తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital
Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 194 పేజీలు: 10+4 వెల: 6.50



SHOWROOMS: TELANGANA: RENAULT MAHBUBNAGAR Ph: 9289995319. RENAULT SHAD NAGAR Ph: 9311700675.



బుధవారం న్యూఢిల్లీలో తిరంగా బైక్‌ర్యాలీలో మోటార్‌సైకిల్ నడుపుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# కానిస్టేబుల్ ఆత్మహత్య

>> ఆత్మ హత్య కు పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే సాయి కుమార్ ను ఎల్బీ నగర్ పోలీస్ లు కామినేని ఆసుపత్రి కి తరలించగా అప్పటికే సాయి కుమార్ మృతి చెందినట్లు వైద్యులు పోలీసులకు తెలిపారు. దీంతో ఘటన జరిగిన విషయాన్ని ఎల్బీ నగర్ పోలీస్ లు సాయి కుమార్ కుటుంభ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

**ఉన్నతాధికారుల వేధింపులే కారణం :** కుటుంబ సభ్యులు సాయికుమార్ మృతిపై అతని తల్లి తండ్రులు విజయ, ఒడియ మరియు కుటుంబ సభ్యులు పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత అధికారుల వేధింపులు తట్టుకోలేకే సాయికుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ,దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సాయి కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని సుమారు 6 గంటలకు పైగా వారు ఆందోళన చేశారు.

ఏసీపీ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం..సాయికుమార్ మృతికి నిరసనగా ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన కొనసాగింది. ఈ క్రమంలో ఏసీపీ కార్యాలయంలోకి వెళ్లిన కొందరు కుటుంబ సభ్యులు అక్కడే టేబుల్ పై ఉన్న సిస్టమ్ ను ప్రింటర్‌తో పాటు ఇతర ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులకు, కుటుంబ సభ్యులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. అంతే కాకుండా ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్త కుండా ఎల్బీ నగర్ డీసీపీ అనురాధ , డీసీపీ రామేశ్వర్ తో పాటు వనస్థలి పురం ఏసీపీ కాశిరెడ్డి సీఐ లు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

**ప్రభుత్వం ఆదుకుంటుంది: మల్ రెడ్డి రంగా రెడ్డి..**

ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ లో సాయి కుమార్ ఆత్మహత్యకు కు పాల్పడిన విషయం తెలవగానే ఇబ్రహీం పట్నం ఎం ఎల్ ఏ మల్ రెడ్డి రంగా రెడ్డి, రాష్ట్ర రోడ్ రహదారుల కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాం రెడ్డి లు పోలీస్ స్టేషన్ కు వచ్చి సాయి కుమార్ కుటుంబ సభ్యులనుఓదార్చి వారితో సంప్రదింపులు జరిపారు. అనంతరం ఎంఎల్ ఏ మల్ రెడ్డి మాట్లాడుతూ సాయి కుమార్ మృతి పట్ల తాము ప్రభుత్వం తరపున సానుభూతి వ్యక్తం చేస్తున్నామన్నారు. కానిస్టేబుల్ సాయి తన నియోజక వర్గ వ్యక్తి అని అందుకే వారి కుటుంబ సభ్యులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయిస్తామన్నారు. అలాగే సాయి తండ్రికి పెంచను కుటుంబం లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం , 10 లక్షల ఆర్థిక సహాయం తో పాటు ప్రభుత్వం తరపున ఇంకా ఉన్న సరే అన్ని త్వరగా అందేలా చేస్తామన్నారు. కుటుంబ సభ్యులను త్వరలో సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి విధంగా చూస్తామని తెలిపారు. దీంతో సాయి కుమార్ కుటుంబ సభ్యులు బంధువులు ఆందోళన విరమించి స్టేషన్ నుండి వెళ్లి పోయారు.

## మేడిగడ్డ కేసులో కెసిఆర్‌కు మళ్లీ సమన్లు

>> శంకర్ భూపాలపల్లి కోర్టుకు ఎల్ అండ్ టి, మాజీ మంత్రి హరీష్‌రావు తరుపు న్యాయ వాదులు హాజరైనారు. తుది నిర్ణ యం తీర్పు వెలువడే అవకాశం ఉందని వార్తలు రావడంతో ఉదయం నుంచి భూపాపల్లి కోర్టులో తీవ్ర ఉత్కంఠత నెలకొన్నది ఎల్‌అండ్ టి ప్రతినిధులు కూడా హాజరైనారు. అయితే న్యాయస్థానం విచారణను సెప్టెంబర్9కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. మేడిగడ్డ కుప్పకూలిన సంఘటనపై రామలింగమూర్తి పిటీషన్ దాఖలు చేశారు. ఆయన మృతి చెందడంతో ఈ కేసుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పిటిషనర్ మృతి చెందినా విచారణను కొనసాగించాలని హైకోర్టు సూచిస్తూ జిల్లాకోర్టు పరిధిలో పరిష్కారం చేసుకోవాలని ఆదేశించింది. కెసిఆర్‌కు కూడా సమన్లు పంపాలని స్పష్టం చేసినా ఆయనకు ఇంకా సమన్లు అందలేదని తెలియడంతో మరోమారు సమన్లు పంపాలని ఆదేశాలు జారీచేశారు.

# మహిళా సంఘాలకు

>> బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి.. తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయిని వసూలు చేయాల్సిందేనన్నారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాల రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సీఎం సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వీబీ జీ రామ్ జీ లో ఫ్లాట్‌పాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ఫ్లాట్‌పాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోపపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సీఎం సూచించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నిందితుడికి

# 20 యేళ్ల జైలు

>> బొల్లిగూడెంకు చెందిన కాలా జాన్ (45)పై 2025లో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 279/2025 కింద బీఎన్ఎస్ సెక్షన్ 64(2)(ఎం), 351(2)తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(ఐ) రెడ్‌విత్ 6 కింద కేసు నమోదైంది. కేసు దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు ఆధారాలను కోర్టుకు సమర్పించారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. అలాగే బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ కేసును అప్పటి మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ ఆర్. గోవిందరెడ్డి దర్యాప్తు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. శ్రీనివాసాచారి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు.

# పేదల సొంతింటి కలకు కేంద్రం చేయూత

>> సహాయం అందిస్తోందని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు చెప్పారు. "పేదలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసం కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే దాదాపు 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. కేంద్రం నుంచి పిఎంఏవై-జి ఇళ్ల కేటాయింపు జరిగితే గ్రామీణ పేదల సొంతింటి కలను మరింత వేగంగా నెరవేర్చగలం" అని మంత్రి అన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా మంత్రి పొంగులేటి ఆహ్వానించారు. పిఎంఏవై-జి 2.0 కింద తెలంగాణకు ఇళ్ల కేటాయింపును స్వయంగా రాష్ట్రానికి వచ్చి ప్రకటిస్తే గ్రామీణ పేదలకు మరింత భరోసా కలుగుతుందని తెలిపారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందనకు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## వారం - వర్జ్యం

13-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
తి.పాడ్యమి రా.8.46
న1.ఆశ్లేష ఉ.6.06, న2.మఖ తె.4.39
వ.1. ఉ.6.20-ఉ.9.18
వ.2. రా.9.19-రా.12.21
దు.1. ఉ.10.04-ఉ.10.55
దు.2. మ.3.10-సా.5.01
రాహు మ.1.30-మ.3.00 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** క్రీడలయందు ఆసక్తి కలిగి ఉంటారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది.

**వృషభం :** సంఘంలో గుర్తింపు కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుంటారు. ప్రయాణాలు. మిత్రుల కలయికతో విందు, వినోదాలు.

**మిథునం :** గృహనిర్మాణం ఆలోచనలు కొనసాగిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి.

**కర్కాటకం :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మొండి బాకీలు వసూలవుతాయి. స్వల్ప ధనలాభం పొందుతారు.

**సింహం :** అనుకోని అతిథుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వస్త్ర లాభం.

**కన్య :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**తుల :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. ప్రయాణాలు.

**వృశ్చికం :** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సకాలంలో ఋణాలు తీరుతాయి. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం :** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి.

**కుంభం :** చేపట్టిన పనులు సవ్యంగా పూర్తి చేస్తారు. నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం :** కొన్ని విషయాలలో పట్టిందల్లా బంగారంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నీటివాటాపై జిఆర్ఎంబిలో కొట్లాడుతాం

### రూ.200కోట్లు ఎక్కడివో కెటిఆర్ చెప్పాలి: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,ఆగస్టు 12,ప్రభాతవార్త:** గోదావరి జలాలలో మన తెలంగాణ విషయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం రాజీ పడే ప్రసక్తిలేదని జిఆర్ఎంబి మీటింగ్ కు అటెండ్ అవుతాం ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలపై బలంగా కొట్లాడుతామనీ శాసనసభ వ్యవహారాలు, ఐటి పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ నీటి వాటాల్లో తెలంగాణ కు బిఆర్ఎస్ ప్రభుత్వం తీరని,తీవ్ర నష్టం చేసిందనీ ఆరోపించారు. మేము 5 ఎకరాల భూమి ని 7.5 కోట్ల కు ఇచ్చామనీ కోటిన్నర కు ఇచ్చిన భూమిని బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.90 లక్షల కే ఇచ్చిందనీ ఆరోపించారు.నిబంధనల మేరకే భూ కేటాయింపు లు జరిగాయనీ అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారనీ ముందుగా కెటిఆర్ రూ.200 కోట్లు ఎక్కడివో?! ఎక్కడి నుంచి వచ్చాయో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుంది దానిపైకూడా చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన చెందారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కెటిఆర్ కు మంచిది కాదనీ శ్రీధర్‌బాబు హెచ్చరించారు.తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైంది కాదని కెటిఆర్‌కు హితవు చెప్పారు. మాపైన ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజల పై చూపకండనీ వేడుకొన్నారు.బిఆర్ఎస్ గోబెల్స్ ప్రచారం తో అసత్యాలను సత్యాలు చేయాలని కుట్రలు చేస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికలు, ఉప ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ని ప్రజలు ఓడించారనీ గుర్తుచేశారు.

# తెలంగాణ నీటిప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలు తొలగించండి

### తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం చెప్పిన జిఆర్ఎంబి అజెండా

**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** గోదావరిపై తెలంగాణ ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ సూచించిన మూడు అభ్యంతరాలు ఎజెండా నుంచి తొలగించాలని తెలంగాణ ప్రభుత్వం జిఆర్ఎంబిని కోరింది. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండాపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది . తెలంగాణ ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన సూచనలు జిఆర్ఎంబి ప్రాధాన్యత ఇస్తూఏకపక్షంగా ఎజెండాలో చేర్చడంపై తెలంగాణ పాలకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతులు నిలిపివేయాలనే అంశాన్ని తొలగించాలని కోరింది. తెలంగాణ ప్రాజెక్టుల టిఏపి అనుమతుల వివరాల అంశం కూడా వద్దని తెలిపింది. సిడబ్ల్యుసి టిఏసి, జలశక్తి మంత్రిత్వశాఖ ఇచ్చిన అనుమతుల సమీక్ష అంశంపైనా ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో చెప్పిన అభ్యంతరాలపై గతంలోనే జిఆర్ఎంబి లో విస్తృతంగా చర్చించామని తెలంగాణ ప్రభుత్వం గుర్తుచేసింది. సిడబ్ల్యుసి ఈ అంశాలను పరిశీలించి ఆంధ్రప్రదేశ్ వాదనలు తిరస్కరించిందని తెలంగాణ ప్రభుత్వం సూచిచింది గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ అవార్డు, కేంద్రజలసంఘం మార్గదర్శకాల ప్రకారమే ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినట్లు స్పష్టం చేసింది. మూడు అంశాలను అజెండా నుంచి డ్రాప్ చేయాలని జిఆర్ఎంబి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సవరించిన అజెండా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.



బుధవారం పార్లమెంటు వద్ద ఆందోళనల్లో పాల్గొన్న ఖర్గే, ప్రియాంక గాంధీ, ఇతర విపక్ష ఎంపీలు

# ప్రమోషన్లపై రివ్యూ చేయండి

>> స్థాయి ఉద్యోగులను రిలీవ్ చేశారు. కానీ, 2022లో సుప్రీంకోర్టు ఆంధ్ర ప్రాంత ఉద్యోగులను రిలీవ్ చేయడాన్ని తప్పుపడుతూ, యాజమాన్యాలను వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. అందులో భాగంగా 2022లో 2015 నుండి ఇచ్చినటువంటి అన్ని పదోన్నతులను ఒక్క కలంపోటుతో రద్దు చేస్తూ, అనేక మంది తెలంగాణ ఉద్యోగులకు రివర్షన్లు ఇచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతుల్లో రిజర్వేషన్లు మరియు పర్యవసానంగా వచ్చే సీనియారిటీ సమస్యను పరిష్కరించకుండా గత యాజమాన్యాలు 2022లో షరతులతో కూడిన పదోన్నతులు వందలాది మంది ఉద్యోగులకు కల్పించింది. అదేవిధంగా 2024లో గతంలో ఓసి అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్ కు సమీక్ష పిటిషన్ దాఖలు చేస్తూ షరతులతో కూడిన పదోన్నతులు సుమారు 5900 మంది ఉద్యోగులకు కల్పించారు. 2025లో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం దాఖలు చేసిన పిటీషన్ విచారణ సందర్భంగా 28 ఏప్రిల్ 2025న హైకోర్టు రెగ్యులర్ పదోన్నతులపై స్టే విధించింది అప్పటినుండి విద్యుత్ సంస్థల్లో వందలాది మంది ఉద్యోగులకు ఇన్చార్జి పదోన్నతులతో కల్పిస్తూ కాలం వెళ్లబోస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను శాశ్వతంగా పరిష్కరించి రెగ్యులర్ ప్రమోషన్లు ఇస్తారో లేదో అని ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు కొందరు ఉద్యోగులు రిటైర్మెంట్ అవుతున్నటువంటి ఇన్చార్జి పదోన్నతులతో ఎలాంటి ఆర్థిక లాభం లేకుండానే పదవి విరమణ పొందుతున్నారు.

# తెలంగాణలో 36,353 పోలింగ్ కేంద్రాలు

>> తెలిపింది. రాష్ట్రంలో పోలింగ్ స్టేషన్ల మార్పులు, పేర్ల మార్పులకు ఈసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఆమోదించింది. కొన్ని పోలింగ్ స్టేషన్ల తొలగింపు, విలీనానికి కూడా అనుమతి ఇచ్చింది. ఆయా జిల్లాల వారీగా పోలింగ్ స్టేషన్ల మార్పుల జాబితాను ఈసీ విడుదల చేసింది. పోలింగ్ కేంద్రాల ప్రదేశాల మార్పునకు కూడా ఆమోదించింది. ఈ మార్పుల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఈసీ ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ సీఈఓ కార్యాలయం బుధవారం మెమో జారీ చేసింది. ఈ క్రమంలో కొత్తగా 460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, 551 కేంద్రాల లొకేషన్లను మార్చింది. 335 కేంద్రాల పేర్లు మార్చింది. 92 పోలింగ్ సెంటర్లను రద్దు లేదా విలీనం చేసింది. కొత్తవాటితో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 36,353 పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసింది. గతంతో పోలిస్తే 368 పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 4,094, అతి తక్కువగా ములుగులో 308,వనపర్తిలో 322 పోలింగ్ కేంద్రాలు ఉండనున్నాయి. కుటుంబసభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా మార్పులు, చేర్పులు చేశారు.

## సత్వరమే పరిహారం

>> చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ నియమించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్‌ఆర్‌సి చెల్లదు..

>> నెల 25న జీవో 172 జారీ చేసింది. రేషన్ కార్డుల్లోని డేటా ఆధారంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు ఇవ్వాలని తహశీల్దార్లను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పరిగణనలోకి తీసుకోవడంపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి గత నెల 31, ఈ నెల 10వ తేదీల్లో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాశారు. మరోవైపు ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ఎస్ఐఆర్‌కు పరిగణనలోకి తీసుకోవద్దంటూ దాఖలైన పిటిషన్లపై స్పందించాలని సీఈసీ, సీఈవోలను హైకోర్టు కూడా ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లుబాటుపై కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టతనిచ్చింది, ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఇచ్చే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదని స్పషం చేసిన సీఈసీ, అవసరమైతే 2013 జులై 25న ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోకు అనుగుణంగా జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. గత మెమో ప్రకారం దరఖాస్తు వివరాలను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేస్తారని, కొత్త జీవో ప్రకారం ఎలాంటి విచారణ చేయకుండా కేవలం రేషన్‌కార్డులోని డేటాను మాత్రమే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ రూపంలో ఇస్తున్నారని సీఈసీ పేర్కొంది. ప్రభుత్వం జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కేవలం రేషన్‌కార్డుకు సమానమైన డాక్యుమెంట్ మాత్రమేనని సీఈసీ తెలిపింది,ఎస్ఐఆర్ ప్రక్రియలో సుప్రీంకోర్టు ఆమోదించిన ఓటరు అర్హత ధ్రువీకరణ పత్రాల్లో రేషన్‌కార్డు లేదని కేంద్ర ఎన్నికల కమిషన్ వివరించింది. కాబట్టి రేషన్‌కార్డుకు సమానమైన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను ఎస్ఐఆర్‌కు చెల్లదని స్పష్టం చేసింది. అయితే గత నెల 25కు ముందు జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది.

# ఛార్జిషీటు లీక్?

>> ప్రచారం ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటూ డిఫెన్స్ లాయర్లు కూడా ఈ కథనాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కోర్టులో అధికారికంగా సమర్పించకముందే ఛార్జ్‌షీట్ కాపీలు మీడియాకు చేరాయని వారు ఆరోపించారు. ఈ ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, ఆ కథనాలను పరిశీలించి, తదుపరి చర్యలు అవసరమా కాదా అని నిర్ణయిస్తామని తెలిపింది. నీట్ యుజి ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో 13 మంది నిందితులపై సిబిఐ దాదాపు 20,000 పేజీల ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. దర్యాప్తు సంస్థ ప్రకారం, ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులు ఢిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) కార్యాలయం నుండి పరీక్ష ప్రశ్నలను సేకరించి, వివిధ మార్గాల ద్వారా లీక్ చేశారు. అత్యంత గోప్యమైన విభాగం నుండి బయటకు వచ్చేటప్పుడు తనిఖీ విధానాలు లేకపోవడాన్ని నిందితులు తమకు అనుకూలంగా మలుచుకున్నారని కూడా ఆ సంస్థ ఆరోపించింది. కోర్టు ఛార్జ్‌షీట్‌ను స్వీకరించింది. అభియోగాల నమోదుపై వాదనలు ఆగస్టు 13 నుండి ప్రారంభమవుతాయని ఆదేశించింది. కేసులో తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరుతూ సిబిఐ కూడా ఒక దరఖాస్తును దాఖలు చేసింది.

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ

ఖమ్మం జిల్లా, సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, కల్లూరు పరిధిలో CR@71.850 టెండర్ నోటీసు నెంబర్ 09/2026-27 తేది: 11.08.2026 అంచనా విలువ మొత్తం రూ.31,65,048.00 యొక్క నిర్మాణ పనికి సంబంధించిన టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్లు తేది: 12.08.2026 ఉ.11.00గం.ల నుండి 20.08.2026, ఉ.11.00గం.ల వరకు లభించును. గమనిక: మిగతా వివరాలకు ఇ-సైట్ www.tender.telangana.gov.in నందు చూడగలరు.

సం/-. సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, కల్లూరు.

DIPR.NO. 7693-PP/CL/ADVT/1/2026-27 తేది: 12.08.2026

తెలంగాణ రాజపత్రము

ఫారం - 6 (ప్రాథమిక ప్రకటన)

నచట్టం-30/2013లోని 11(1) మరియు సబ్ రూల్-1, రూల్ 19 ప్రకారం)

ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-1, పాల్వంచ ఆర్.సి.నెం. బి/347/2024 తేది: 28.07.2026

జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం.జి/2261/2026 తేది: 29.07.2026

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజపత్రము నెం. బి3/54/2026 తేది: 30.07.2026

ఈ దిగువ నిర్దిష్టపరిచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం, నాగినేనిప్రోలు గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.13-37¼ గుంటలు ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ క్రింద డిస్ట్రిబ్యూటరీ కెనాల్-2L (LM1), ప్యాకేజి నెం.1, నాగినేనిప్రోలు గ్రామము వద్ద ఈ దిగువ చూపిన భూమి అవసరమై ఉన్నదని భావించినందున భూసేకరణ, పునరావాస, పునర్నిర్మాణం కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

భూసేకరణ వలన భూనిర్వాసితులయ్యే కుటుంబాలు ఏమియులేవు. నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునర్నిర్మాణం అంశాలకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అధికారిగా నియమించబడినారు. కావున ఈ ప్రాజెక్ట్ క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం, నాగినేనిప్రోలు గ్రామంలోని విస్తీర్ణం ఎ.13-37¼ గుంటలు గల భూమి ఈ క్రింద చూపిన విధంగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామం : నాగినేనిప్రోలు మండలం : బూర్గంపాడు జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం

| క్ర. సం | సర్వే నెం. (సబ్ డివిజన్ ప్రకారం) | సర్వే నెం. (భూదా రతి ప్రకారం) | భూమి (యాజ మాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/ తరి) | ఎంత మేర మొత్తం సర్వే | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: భూమి (యాజమాన్యం) | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: అనుభవదారుని పేరు | చెట్లు & కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 437/2/2 | 437/1/2 | పట్టా | మెట్ట | 1.14 | పేరం సింధుజారెడ్డి భ: నరసింహారెడ్డి | పేరం సింధు భ: నరసింహారెడ్డి | లేదు |
| 2 | 437/2/2 | 437/1/8 | పట్టా | మెట్ట | 0.18 | [illegible] | [illegible] | లేదు |
| 3 | 437/37/2 | 437 | [illegible] | మెట్ట | 0.18 | [illegible] | [illegible] | లేదు |
| 4 | 437/37/2 | 437 | [illegible] | మెట్ట | 0.38 | [illegible] | [illegible] | లేదు |
| 5 | 437/37/2 | 437 | [illegible] | మెట్ట | 0.05 | [illegible] | [illegible] | లేదు |
| 6 | 437/37/2 | 437 | [illegible] | మెట్ట | 0.15 | [illegible] | [illegible] | లేదు |
| 7 | 437/19/2 | 437/18/EE/1 | పట్టా | మెట్ట | 0.33 | [illegible] | [illegible] | లేదు |
| 8 | 437/19/2 | 437/12/a2 | పట్టా | మెట్ట | 0.20 | [illegible] | [illegible] | లేదు |
| 9 | 437/19/2 | 437/18/AA2 | పట్టా | మెట్ట | 0.01 | [illegible] | [illegible] | లేదు |
| 10 | 437/19/2 | 437/19/E/2 | పట్టా | మెట్ట | 0.18 | [illegible] | [illegible] | లేదు |
| 11 | 324/2 | 324/1/AA/1 | పట్టా | మెట్ట | 0.21 | [illegible] | [illegible] | లేదు |
| 12 | 324/2 | 324/1/A | పట్టా | మెట్ట | 0.11 | [illegible] | [illegible] | లేదు |
| 13 | 325/2 | 325/1/AA | పట్టా | మెట్ట | 0.22 | [illegible] | [illegible] | లేదు |
| 14 | 325/2 | 325/2/AA | పట్టా | మెట్ట | 0.24 | [illegible] | [illegible] | లేదు |
| 15 | 325/2 | 326/1/AA | పట్టా | మెట్ట | 0.02 | [illegible] | [illegible] | లేదు |
| 16 | 325/2 | - | పట్టా | మెట్ట | 0.02 | [illegible] | [illegible] | లేదు |
| 17 | 326/2 | 326/1/AA | పట్టా | మెట్ట | 0.09 ½ | [illegible] | [illegible] | లేదు |
| 18 | 326/2 | 335/336/3/1 | పట్టా | మెట్ట | 0.10 ½ | [illegible] | [illegible] | లేదు |
| 19 | 326/2 | 326/1/A/1 | పట్టా | మెట్ట | 0.02 | [illegible] | [illegible] | లేదు |
| 20 | 326/2 | 326/2/A | పట్టా | మెట్ట | 0.04 | [illegible] | [illegible] | లేదు |
| 21 | 334/2 | 326/2 | పట్టా | మెట్ట | 0.12 | దొపటి సామ్రాజ్యం భ: పెద్ద నారాయణ | దొపటి నాగే శ్వరరావు తం: పెద్ద నారాయణ | లేదు |
| 22 | 334/2 | 334/2/1 | పట్టా | మెట్ట | 0.24 | దొపటి విశ్వ నాథం తం: నారాయణ | దొపటి విశ్వ నాథం తం: పెద్ద నారాయణ | లేదు |
| 23 | 336/2 | 335/336 | పట్టా | మెట్ట | 0.10 ½ | యడమకంటి పెద రోసి రెడ్డి తం: పెద పాపిరెడ్డి | యడమకంటి పెద రోసి రెడ్డి తం: పెద పాపిరెడ్డి | లేదు |
| 24 | 336/2 | 335/336/2/A | పట్టా | మెట్ట | 0.10 ½ | యడమకంటి అక్కమ్మ భ: పెద రోసిరెడ్డి | యడమకంటి అక్కమ్మ భ: పెద రోసిరెడ్డి | లేదు |
| 25 | 336/2 | 335/336/3/1 | పట్టా | మెట్ట | 0.10 ½ | యడమకంటిపెద రోసిరెడ్డి తం: పెద పాపిరెడ్డి | యడమకంటి పెద పాపిరెడ్డి తం: పుల్లారెడ్డి | లేదు |
| 26 | 336/2 | 335/336/3 | పట్టా | మెట్ట | 0.16 ½ | పోతిరెడ్డి సుబ్బారెడ్డి తం: బాలిరెడ్డి | పోతిరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి తం: బాలిరెడ్డి | లేదు |
| 27 | 336/2 | 335/336/2/AA | పట్టా | మెట్ట | 0.11 ½ | పోతిరెడ్డి చిన్న సుబ్బారెడ్డి తం: గోవిందరెడ్డి | పోతిరెడ్డి చిన్న సుబ్బారెడ్డి తం: గోవిందరెడ్డి | లేదు |
| 28 | 337/2 | 401/407/2 | పట్టా | మెట్ట | 0.21 | యడమకంటిరామ లింగమ్మ భ: పెదపాపిరెడ్డి | యడమకంటిరామ లింగమ్మ భ: పెదపాపిరెడ్డి | లేదు |
| 29 | 401/2 | 401/407/2 | పట్టా | మెట్ట | 0.00 ¼ | యడమకంటి రామ లింగమ్మ భ: పెదపాపిరెడ్డి | యడమకంటిరామ లింగమ్మ భ: పెదపాపిరెడ్డి | లేదు |
| 30 | 400/2 | 399/1/3 | పట్టా | మెట్ట | 0.09 ½ | [illegible] | [illegible] | లేదు |
| 31 | 399/2 | 399/2 | పట్టా | మెట్ట | 0.15 | [illegible] | [illegible] | లేదు |
| 32 | 399/2 | 399/1/3 | పట్టా | మెట్ట | 0.27 | [illegible] | [illegible] | లేదు |
| 33 | 340/2 | 340/u/2 | పట్టా | మెట్ట | 0.18 ¾ | [illegible] | [illegible] | లేదు |
| 34 | 340/2 | 341/2/2 | పట్టా | మెట్ట | 0.00 ¼ | [illegible] | [illegible] | లేదు |
| 35 | 393/2 | 393/4 | పట్టా | మెట్ట | 0.23 ½ | [illegible] | [illegible] | లేదు |
| 36 | 393/2 | 393/1 | పట్టా | మెట్ట | 0.10 ½ | [illegible] | [illegible] | లేదు |
| 37 | 392/2 | 393/1 | పట్టా | మెట్ట | 0.08 | [illegible] | [illegible] | లేదు |
| | మొత్తం విస్తీర్ణం | | | | 13.37 | | | |

[illegible]

DIPR RO.NO: 648/LA/PP/Advt/Pub/2026-27

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 194 పేజీలు: 10+4 వెల: 6.50



**కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లపై హైకోర్టు స్టే**

కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి కోర్టు ఆదేశం

విచారణ 4 వారాలకు వాయిదా

2



8 **టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ రాజీనామా**




**ఇండియాగేట్ త్రివర్ణమయం**



బుధవారం న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద భారీ ఎత్తున తిరంగా యాత్ర నిర్వహించిన ప్రజలు




**సభలో సుదీర్ఘ చర్చకు సిద్ధమే**

8 **స్పీకర్ ఓంబిర్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లేఖ**

విపక్షాలకు తగిన సమాధానమిస్తామని వెల్లడి


## ఓటరు ధ్రువీకరణకు ఎఫ్ఆర్‌సి చెల్లదు..

**'సర్'పై స్పష్టం చేసిన సిఇసి**

**ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కూడా రేషన్ కార్డు వంటిదే**

**కోటిమందికి నోటీసులు ఇచ్చే అవకాశం**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు12:** తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్(ఎఫ్ఆర్‌సి) ఎస్ఐఆర్‌లో ఓటరు అర్హత ధ్రువీకరణ కోసం చెల్లదని కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కేవలం రేషన్‌కార్డుకు సమానమైన డాక్యుమెంట్ మాత్రమేనని సీఈసీ తెలిపింది. సుప్రీంకోర్టు ఆమోదించిన 12 డాక్యుమెంట్లలో రేషన్‌కార్డు లేనందున దాని ఆధారంగా ఇచ్చే ఎఫ్ఆర్‌సీని పరిగణనలోకి తీసుకోలేమని తేల్చి చెప్పింది. అవసరమైతే ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన మెమో నిబంధనల మేరకు జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సమర్పించవచ్చునని సూచించింది. ఈ నెల 17న ముసాయిదా జాబితా ప్రచురించిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో సుమారు కోటి మందికి ఎన్నికల కమిషన్ నోటీసులు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈసీ నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు అర్హతను ధ్రువీకరించుకునేందుకు 12 పత్రాల్లో ఒకటి సమర్పించాల్సి ఉంటుంది. ఆ పన్నెండు డాక్యుమెంట్లలో రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కూడా ఒకటని నోటిఫికేషన్‌లో సీఈసీ తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూడా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఇటీవల నిర్ణయించిన ప్రభుత్వం గత >>2





**తెలంగాణలో 36,353 పోలింగ్ కేంద్రాలు**

368 పెంపు

**హైదరాబాద్‌లో అత్యధికంగా 4,094 కేంద్రాలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు12:** తెలంగాణలో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదం >>2

# సత్వరమే పరిహారం

**అధికారులు వెంటనే వాస్తవ నివేదికలు ఇవ్వాలి**

**సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డలో ఎన్‌డిఎస్‌ఏ సూచనలు పాటించాలి**

**గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై కన్సల్టెన్సీని నియమించండి**

**గరిష్ఠ స్థాయిలో గోదావరి జలాల వినియోగం: సిఎం రేవంత్‌రెడ్డి**



బుధవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు12:** గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదని, ఈ విషయంలో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలన్నారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ఎన్డీఎస్ఏతో సంప్రదించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే అధికారులు వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఎం సూచించారు. అధికారులు ఆ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. గట్టు,గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం >>2

## మిల్లింగ్ బాధ్యతలు మహిళా సంఘాలకు

**మిల్లర్ల నుంచి బకాయిలు వసూలుకు విధివిధానాలు: సిఎం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు12:** మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో >>2


## మేడిగడ్డ కేసులో కెసిఆర్‌కు మళ్లీ సమన్లు

**మృతుడు రామలింగమూర్తి వేసిన కేసు సెప్టెంబరు 9కి వాయిదా**

**భూపాలపల్లి కోర్టుకు హాజరైన హరీశ్ లాయర్లు, ఎల్ అండ్ టి ప్రతినిధులు**



**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాత వార్త:** మేడిగడ్డ కేసు విషయంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావుకు మరోమారు సమన్లు పంపించాలని జిల్లా న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. బుధవారం జయ >>2



నిందితుడు కాలా జాన్

## పోక్సో కేసు నిందితుడికి 20 యేళ్ల జైలు

**హైదరాబాద్ (ఉప్పల్), ఆగస్టు 12 ప్రభాతవార్త:** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసును విచారించిన నేరేడ్‌మెట్‌లోని అత్యాచారం, పోక్సో కేసుల ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. బోడుప్పల్ >>2



న్యూఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌తో భేటీ అయిన మంత్రి పొంగులేటి

## పేదల సొంతింటి కలకు కేంద్రం చేయూత

**తెలంగాణకు 11.56 లక్షల పిఎంఎవై-జి ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి.. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్**

**కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పొంగులేటి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు12:** తెలంగాణ గ్రామీణ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పిఎంఎవై-జి 2.0) కింద తెలంగాణకు 11,56,915 ఇళ్లను ఒకేసారి కేటాయించాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఎంపీలు డా. మల్లు రవి, రామసహాయం రఘురామిరెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్ షెట్కార్, ఎం. అనిల్‌కుమార్ యాదవ్‌లతో కలిసి మంత్రి పొంగులేటి కలిశారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో పేదల గృహ అవసరాలను వివరిస్తూ కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీ.పీ. గౌతమ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలనలో ఇళ్ల కోసం 21 లక్షల దరఖాస్తులు వచ్చాయని మంత్రి తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్ ప్లస్-2024 యాప్ ద్వారా ఇంటింటా సర్వే నిర్వహించగా 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా గుర్తించబడ్డాయని చెప్పారు. సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలను కూడా పూర్తి చేసినట్లు వెల్లడించారు. 'అర్హులైన కుటుంబాల జాబితాను రెండేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాం. తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయాలని నేను పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అనేక దఫాలుగా కేంద్రం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. స్వయంగా ప్రధానమంత్రి గారి దృష్టికి కూడా తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భాల్లోనూ రాష్ట్ర గృహ అవసరాలను ఆయన దృష్టికి తీసుకువచ్చాను" అని పొంగులేటి తెలిపారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదల గృహ నిర్మాణం నిలిచిపోవడంతో భారీ డిమాండ్ ఏర్పడిందని, ఈ నేపథ్యంలో అర్హులైన 11,56,915 కుటుంబాలకు ఒకేసారి ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. పిఎంఎవై-జి కింద కేంద్ర వాటాతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక >>2



## ప్రమోషన్లపై రివ్యూ చేయండి

**నష్టపోయిన బిసి, ఒసి ఉద్యోగులకు పదోన్నతులివ్వాలి**

**రివర్షన్లు ఇచ్చిన ఉద్యోగుల వాదనలు వినాలి**

**ట్రాన్స్‌కో, జెన్కో సహా విద్యుత్ సంస్థలకు హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్, అగస్టు 12, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతులను సమీక్షించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ట్రాన్స్కో, జెన్కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లో 2014, జూన్ 2 నుండి కల్పించిన అన్ని పదోన్నతులను సమీక్షించాలని ఆదేశించింది. పలు కేసుల విచారణలో భాగంగా జస్టిస్ నగేష్ భీమపాక ధర్మాసనం బుధవారం కీలక ఉత్తర్వులను జారీ చేసింది. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం దాఖలు చేసిన పిటీషన్లను ధర్మాసనం విచారించింది. వాద ప్రతివాదనలు విన్న హైకోర్టు నియమాల ఆధారంగా విద్యుత్ సంస్థల్లో పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ, ఓసి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని అదే సమయంలో సమీక్షలో భాగంగా నష్టపోయే వారి వాదనలు వినిపించడానికి అవకాశం కల్పించాలని తెలియజేస్తూ కేసును 18 ఫిబ్రవరి 2027నకు తదుపరి విచారణ నిమిత్తం వాయిదా వేసింది. కాగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత 2015లో వేలాది మందికి షరతులతో కూడిన పదోన్నతులు కల్పిస్తూ, ఆంధ్ర స్థానికత కలిగిన ఉద్యోగులను ఏకపక్షంగా సుమారు 1154 మంది ఉన్నత >>2

## కానిస్టేబుల్ ఆత్మహత్య

**ఎల్బీనగర్ ఎసిపి కార్యాలయంలో కలకలం**

**వేధింపులే కారణమని పిఎస్ వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన**



కానిస్టేబుల్ సాయికుమార్ (ఫైల్)

**హైదరాబాద్ (మన్సూరాబాద్), ఆగస్టు 12, ప్రభాతవార్త:** ఎల్బీ నగర్ ఏసీపీ కార్యాలయంలో అటాచ్‌మెంట్‌పై విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జర్పుల సాయికుమార్ (23) బుధవారం వేకువజమున ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. దీంతో సాయి కుమార్ కుటుంబసభ్యులు బంధువులు పోలీస్‌స్టేషన్ ఆవరణలో తీవ్ర ఆందోళనకు దిగారు తమ కుమారుడుది ఆత్మహత్య కాదని ఉన్నతాధికారుల వేధింపుల వల్లనే ఈ ఘటన జరిగిందని ఆరోపిస్తూ గంటల తరబడి నినాదాలు చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలానికి చెందిన సాయికుమార్ 2024లో కానిస్టేబుల్‌గా ఎన్నికై ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తు న్నాడు. కాగా గత నెల నుంచి ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఏసీపీ కార్యాలయానికి అటాచ్‌మెంట్‌పై ఈ కాప్స్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా మంగళవారం రాత్రి నైట్ డ్యూటీ నిర్వహిస్తున్న సాయి కుమార్ విధుల్లో భాగంగా ఆ రోజు అర్ధరాత్రి ఒంటి గంటకు డీఎస్ఆర్‌కు సంబంధించి డీసీపీ కార్యాలయ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి కానీ రాత్రి 2 గంటలు అవుతున్న ఎల్బీ నగర్ ఏసీపీ కార్యాలయం నుండి సమాచారం రాకపోడంతో ఎల్బీనగర్ డీసీపీ ఆఫీస్ సిబ్బంది వెంటనే ఏసీపీ కార్యాలయానికి ఫోన్ చేసినా స్పందన రాలేదు. దీంతో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో నైట్ డ్యూటీ చేస్తున్న డిఐ నరేందర్ మరియు ఇతర సిబ్బందికి డీసీపీ ఆఫీస్ నుండి సమాచారం అందించారు. దీంతో సెక్షన్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ సుమారు 2.30 గంటలకు ఏసీపీ కార్యాలయానికి వెళ్లి పరిశీలించగా.. ఏసీపీ కార్యాలయంలో ఉండే రెస్ట్‌రూమ్‌లో సాయికుమార్ శాలువతో >>2




3 **జూ.ఎన్టీఆర్‌కు సర్జరీ సక్సెస్**

రికవరీకి 2-3 నెలలు?


## విచారణకు ముందే ఛార్జిషీటు లీక్?





**నీట్ కేసు విచారణలో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆందోళన**

**సిబిఐ ఛార్జిషీటు విచారణకు స్వీకరణ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** నీట్ యుజి పేపర్ లీక్ కేసులో 13 మంది నిందితులపై సిబిఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను ఢిల్లీ రైస్ అవెన్యూ కోర్టు బుధవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో దర్యాప్తు సంస్థ సమర్పించిన తుది నివేదికను ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా స్వీకరించారు. సిబిఐ ఛార్జ్‌షీట్ వివరాలు మీడియాకు వెల్లడి కావడంపై కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా మైనర్లతో సహా సాక్షుల వివరాలు బయటకు రావడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టులో వాదనలు జరగకముందే ఛార్జ్‌షీట్‌లోని అంశాలు ప్రచురితం కావడం తీవ్ర ఆందోళనకరమైన విషయమని రౌస్ అవెన్యూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా పేర్కొన్నారు. ఇటువంటి వెల్లడి చర్యలు క్రిమినల్ విచారణ ప్రక్రియ నిష్పాకతను దెబ్బతీసే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. మీడియా సహ సంబంధిత వర్గాలన్నీ, తమ కథనాల వల్ల కోర్టు విచారణ ప్రభావితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలిగి ఉన్నాయని కోర్టు నొక్కి చెప్పింది. మైనర్లతో సహా సాక్షుల పేర్లను మీడియా కథనాలు బయటపెట్టాయని సిబిఐ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలపడంతో ఈ విషయం తెరపైకి వచ్చింది. నిందితులకు నిష్పాక్షక విచారణ పొందే హక్కుపై ఇటువంటి >>2

వార్త

బుర్రలో ఎన్నో విషయాల్ని నింపి గందరగోళం చేసేది విద్య కాదు. వ్యక్తిలో శీలాన్ని పెంపొందించి జీవితాన్ని తీర్చి దిద్దుకునే అవగాహన కలిగించేదే నిజమైన విద్య.

- సిసిరో

# కేన్సర్ కని'కట్టు'!

శంఖంలో పోస్తే తప్ప గంగాజలం తీర్థం కాబోదు. ఇదో సిద్ధాంతం. రాజపుండులా మానవ జీవాలను పీల్చిపిప్పి చేస్తున్న కేన్సర్‌ను నోటిఫై చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలే దానికి నిదర్శనం. కేన్సర్ లక్షణాలు కనిపించగానే ఒక్క క్షణం కూడా జాప్యం చేయకుండా వైద్యానికి చేరువయితేనే ఆ ప్రాణం నిలబడుతుంది. లేకుంటే అదీ ఒకటి, రెండు దశలు దాటాక ఆసుపత్రికెళ్లినా ఉపయోగం ఉండొచ్చు, ఉండకపోవచ్చు. దశలు మారే కొద్దీ ప్రాణాంతకమని, ఇక సాధారణ పరిస్థితికి రాలేమని కేన్సర్ వ్యాధి చికిత్స నిపుణులు హెచ్చరిస్తూనే ఉంటారు. కానీ వైద్యానికి ఖర్చుపెట్టుకునే ఆర్థిక స్తోమత లేక ఎంతో మంది చచ్చే చావు వచ్చేవరకు మంచాన్ని వదిలిపెట్టి కదలరు. ఏనాటికైనా పోవాల్సిందే కదా! అని సరిపెట్టుకోవడం కద్దు. కేన్సర్ కూడా నయమవుతుందన్న భరోసా కల్గిస్తున్న నైపుణ్యం కలిగిన డాక్టర్లు ఉన్నా దానిగుర్తింపు వైద్య చికిత్సల కోసం ఖర్చు పెట్టేందుకు ఎంతో మందికి స్తోమత ఉండటం లేదు. అందుకే కేన్సర్‌ను నయం చేయగలిగిన వ్యాధిగా డాక్టర్లు చెప్పినా కూడా వైద్య ఖర్చులకు తట్టుకోలేక తాము జీవిత చరమాంకంలో ఉన్నామనిచెప్పుకుంటూ బతికేస్తున్నారు. స్తోమత ఉన్నవారు మంచి ఖరీదైన వైద్యం చేయించుకుని ఎంచక్కా ఆరోగ్యంతో తిరగ్గలుగుతున్నారు. మరి ఏదారీ దిక్కుతోచని వారే తమ అంతిమ యాత్ర కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. కేన్సర్ పీడిత రోగులను వారి ఖర్మకు వారిని వదిలేసేందుకు ఎవరూ సిద్ధంగాలేరు. కొన్ని విధాన నిర్ణయాల విషయంలో ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరముందంటూకొందరు బాధితులుసుప్రీం కోర్టు మెట్లెక్కారు. ఉన్నత ధర్మాసనం నుంచి తగు మార్గదర్శకాలు వెలువడ్డాయి. కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు వీలుగా ఆ వ్యాధిని నోటిఫై యబుల్ డిసీజ్‌గా ప్రకటించాలని తాజాగా సుప్రీం కోర్టు ఆదేశించింది. పార్లమెంటు స్థాయీ సంఘం చేసిన సిఫార్సులను 17 రాష్ట్రాలు అమలు చేసి నోటిఫైడ్ వ్యాధి'గా కేన్సర్ ప్రకటించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు కేన్సర్ వ్యాధి చికిత్సలో ఒకే రకమైన విధానాన్ని అమలు చేయాలని సుప్రీం మార్గదర్శకాలు జారీ అవసరమని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహన్‌ల త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. దేశంలో అంతకంతకూ పెరుగుతున్న కేన్సర్ మహమ్మారిని అణచివేయడంలో రోగులకు సకాలంలో మెరుగైన వైద్యాన్ని అందించడానికి ఈ వ్యాధిని దేశమంతటా అన్ని రాష్ట్రాలు నోటిఫై చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం సుప్రీం త్రిసభ్య ధర్మాసనం జోక్యంతో ఆ వ్యాధికి దేశమంతటా ఒకే రకమైన ఆరోగ్య విధానం ఉండేలా ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రముఖ వైద్యులు అనురాగ్ శ్రీవాస్తవ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు అత్యంత కీలకమైనవిగానే చెప్పాలి. ఈ ఆదేశాలు అమలైతే ఇప్పటికే ఉన్న రాష్ట్రాలతోపాటు మరో 19రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కూడా ఏకరూప వైద్య చికిత్సలకు లోబడి కేన్సర్ రోగుల వైద్యంలో తరిస్తాయి. నిజానికి దేశంలో కేన్సర్‌కు సంబంధించినడేటా కొరత ఉంది. కోర్టు ఆదేశాలు అమలై కేన్సర్‌ను 'నోటిఫై యబుల్ వ్యాధి'గా నిర్ధారిస్తే దేశంలోని ప్రతి ఆసుపత్రి, వైద్యుడు వాటి డేటాను ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. వ్యాధి తీవ్రత, విస్తృతిని బట్టి ప్రభుత్వం నివారణ చర్యలకు ఆరోగ్య ప్రణాళిక సిద్ధం చేసేందుకు అవకాశముంటుంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 14కిందనోటిఫై చేయబడిన రుగ్మతలకే ఆరోగ్య సంరక్షణ ఉంటుంది. నోటిఫై చేయడమనేది కొన్ని రాష్ట్రా లకే పరిమితమైతే మిగిలిన రాష్ట్రాలలో కేన్సర్ రోగులకు ప్రభుత్వపరంగా వైద్యభరోసా ఉండదు. కేన్సర్‌పైజాతీయ స్థాయి డిజిటల్ రిజిస్ట్రీఏర్పాటు కావాలని పిటీషనర్ కోరుతున్నారు. వ్యాధి ముదిరిన తర్వాత ఖరీదైన చికిత్సల కోసం వెంపర్లాడడం కన్నా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాలను నిలబెట్టుకోవచ్చు. ఇలా ఒకే ఒక లక్ష్యంతో ఫిర్యాదీ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఇదొక దేశ ప్రజారోగ్యానికి సంబంధించిన ఒక దిశానిర్దేశంగా చెప్పుకోవాలి. ఆరోగ్య రక్షణ వ్యవస్థకు ఇదొక పటిష్టమైన పునాదిగా చూడాలి. దేశవ్యాప్తంగా జాతీయ కేన్సర్‌నియంత్రణ విధానాన్ని రూపొందించేందుకు మార్గదర్శనం ఏర్పడ్తుంది. ప్రజలను సరైన అవగాహన లేమితో గోమూత్రం వంటి శాస్త్రీయ ఆధారాలు లేని ప్రత్యామ్నాయ చికిత్సల నుండి కాపాడిన ట్లవుతుంది. కేన్సర్ అంటువ్యాధి కాదు నయమౌతుందన్న నినాదమే కేన్సర్ రోగిని సగం బతికిస్తుంది. అదే కేన్సర్ వ్యాధి నియంత్రణకుదారులు తెరిచే ఉంటే ఆ రోగి సంపూర్ణ ఆరోగ్యంతో బయటపడే వీలుంది. కేన్సర్ నియంత్రణకు అవసరమైన వైద్యనిర్మాణసౌకర్యాలు, స్క్రీనింగ్ కేంద్రాలు, రేడియో థెరపి, ఖీమో థెరపీ, ఆంకాలజీ స్పెషలిస్టులు పాలియేటిక్ కేర్ అందుబాటులోకి రాగలవు. కేన్సర్ వ్యాధిలో తెలుగు రాష్ట్రాలో పేరొందిన వైద్య చికిత్సలున్నందున అధునాతన స్కానింగ్ సౌకర్యాల కారణంగా వాళ్లు సరైన చికిత్సల ద్వారా స్వస్థతనొందుతారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్, ఊపిరితిత్తులు కేన్సర్ వంటి వాటికి అధునాతన వైద్యం లభిస్తుంది. అనేక రాష్ట్రాలలో అవగామన లేమి కారణంగా వ్యాధి ముదిరిన తర్వాతనే వైద్యం మొదలైన కారణంగా ఎంతో కాలం రోగి బతికేందు కు చాన్సులు బహుతక్కువని పిటీషనర్ పేర్కొన్నారు. వైద్యానికి లొంగదని ఇన్నాల్లూ చెప్పుకుంటూ వస్తున్న కేన్సర్‌కు ఒక 'టీకా' దొరికిందన్న వార్త ఎంతో శుభదాయకం. కానీ అది ఏదశలో వాడాలి. ఎలా వాడాలి అన్న అంశాలపై స్పష్టమైన వైద్య అవగాహన లభ్యమైన రోజుల్లో ఆసుపత్రి డేటా బేస్‌లు ప్రభుత్వ భీమా పథకాలతో అనుసంధా నించబడిన డేటాలేనిదే కేన్సర్ చికిత్స సాధ్యంకాని పరిస్థితి ఉంది. ఇవన్నీ పద్ధతిగా జరిగితే కేన్సర్ రోగుల సంఖ్య నానాటికీ తగ్గుముఖాన్ని పట్టనుండటం శుభ పరిణామం కాగలదు.

ఆదర్శాన్ని నిలపడానికి వెయ్యిసార్లు ప్రయత్నించండి. ఆ వెయ్యిసార్లు విఫలమయితే మరొకసారి ప్రయత్నించండి.



స్వామి వివేకానంద

ఆకలి రుచి ఎరుగనట్లే మనకు అవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.



ఆస్కార్‌వైల్డ్

## ప్రజావాక్కు

### పెద్దల సభకు పెద్దలనే పంపాలి

ఒక ప్రయోగం చెయ్యండి సీఎం గారూ గవర్నర్ కోటలో శాసనమండలి సభ్యులకు కానీ రాజ్యసభ సభ్యులకుగాని పూర్వం సమాజంలో రకరకాల సేవలు చేసినవారిని గౌరవంగా గుర్తించి ఆయా పదవులలో నియమించేవారు. లేక ఎన్నుకునేవారు. పార్టీలతో నిమిత్తం లేకుండా ఎన్నుకునేవారు. వావిలాలలాంటివారు అలా ఎన్నికాకబడ్డవారే! అలాంటి వారిని నియమిస్తేనే ఆయా సభలకు గౌరవం పెరుగుతుంది. అలాంటి వారిని నియమిస్తేఅవినీతికి తావు లేకుండా, స్వార్థంలేకుండా నిజంగాసమస్యల మీద పోరాడతారు. అయితే ఈరోజు బాగా డబ్బున్నవారికి, కుల పిచ్చి వాళ్లకు, మత పిచ్చగాళ్లకు రాజ్యసభ, శాసనమండలిలోకి పంపిస్తున్నారు. మనరాష్ట్రంలో రేపుఇద్దరినిగవర్నరు కోటాలో శాసనమండలికి నియమించబోతున్నారు. సమాజాన్ని బాగా అవగాహన చేసుకున్నవారికి, వివిధ రంగాలలో పని చేస్తున్నవారికి ఇచ్చినట్లయితే ఆయా పదవులకు న్యాయం చేసిన వారవుతారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రవర్తనే ప్రపంచ శత్రువుగా మారుస్తుంది

ప్రపంచాన్ని శాసించాలన్న దురాలోచనతో పలు దేశాలతో కాలు దువ్వి కయ్యం తెచ్చుకుంటున్న ట్రంప్ ప్రపంచ శత్రువుగా మారి ఒంటరౌతున్నాడు. శత్రుత్వం ఒక్కసారిగా పుట్టదు. అది చిన్నచిన్న మాటలవల్ల, చిన్నచిన్న అపార్థాల వల్ల క్రమంగా పెరుగుతుంది. కాని అంతకంటే పెద్ద పెద్ద తప్పులతో కళ్లున్న కబోదిలా ప్రవర్తించడం విడ్డూరంగా ఉంది. అవమానపరిచే మాటలు మాట్లాడితే ఎదుటివారి భావాలను గౌరవించకపోతే కోపంతో, అహంకారంతో మాట్లాడితే ఎప్పుడూ తానే సరైందని భావిస్తే ఇలాంటి ప్రవర్తన వల్ల మనకు దగ్గరగా ఉన్నవాళ్లే దూరమవుతారు. మిత్రులు కూడా శత్రువులుగా మారిపోతారు. ట్రంప్ దీనికి అతీతులు కాదు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### ఈ కేవైసీ తప్పనిసరి

రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్‌కలిగి ఉన్న లబ్ధిదారులందరూ ఎవరి పేరు పై రిజిస్ట్రేషన్ అయిందో వాళ్ళుఈ నెల 15లోపు కచ్చితంగా ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి. భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశంఉంది. ఇదివరకే ఈకేవైసీ చేసుకున్నవారు మరల చేసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు సూచిస్తున్నారు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### సమీకృత ఉపాధి హామీ

ఉపాధి హామీని సుస్థిరం చేయడం వైపు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సగటు కూలి రోజులు 125కి పూర్తి స్థాయిలో చేరుకోవాలి. సమీకృత ఉపాధి వైపు అడుగులు వేయాల్సిందే. మరి అది ఎలాసాధ్యం. పండ్లతోటల పెంపకం వల్లనే సాధ్యం అవుతుంది. లేదా నీటి కుంటల నిర్మాణం వల్లనే సాధ్యం అవుతుంది. సమీకృత ఉపాధి హామీ అంటే ఏమిటి ఒక రైతుకు ఉపాధి హామీ ద్వారా ఒకే దగ్గర వివిధ రూపాలలో లబ్ది చేకూర్చడం. ఉదాహరణకు పంట కుంటల నిర్మాణం చేసి వాటిలో చెప పిల్లలను పెంచి ఆ చేప కుంటల గట్టు చుట్టూ కూరగాయలు పండ్ల తోటల పెంపకం చేపట్టేట్టు వాళ్లకి అవగాహనా కల్పించాలి. తద్వారా సమీకృత ఉపాధి హామీ సాధ్యం అవుతుంది. తద్వారా ఎక్కువ రోజులు కూలి ఉపాధి హామీలోభాగం కాగలుగుతాడు. వేసవి కాలంలో వ్యవసాయధారులంతా పని లేకుండా ఉంటారు. కావున వారిని 3 నెలల పాటు కాపాడే ఆదాయం అది సమకూర్చగలదు.

- భారత అవినాష్, జనగామ

### శక్తివంతమైన వేదికలు సామాజిక మాధ్యమాలు

సామాజిక మాధ్యమాలు సమాచారాన్ని క్షణాల్లో ప్రపంచమంతా వ్యాప్తి చేసే శక్తివంతమైన వేదికలుగా మారాయి. అయితే అదే వేగంతో తప్పుడు వార్తలు, మార్ఫింగ్ చేసిన వీడియోలు, దారితప్పించే పోస్టులుకూడా విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. నిజానిజాలు నిర్ధారించకముందే ఇటువంటిసమాచారం లక్షలాది మందికి చేరి అనవసర భయాందోళనలుసృష్టించడంతోపాటువ్యక్తులప్రతిష్టను దెబ్బతీయగలదు. అంతేకాకుండా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసి సామాజిక సామరస్యానికి విఘాతం కలిగించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా యువత ఎక్కువ సమయం డిజిటల్ వేదికలపైనే గడపడం వల్ల నిర్ధారణ లేని సమాచారాన్ని సులభంగా నమ్మే, ఇతరులకు పంపించే పరిస్థితి ఏర్పడుతోంది.

- హెచ్.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈమధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకులకంటే ఎక్కువ ఉన్నట్లు తెలిసింది. అది సహజం, వాస్తవం కూడా. యువకుల సంఖ్యబలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవ వనరులు కాస్త ఎక్కువ పొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు, సామాజికస్థితి, అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తి వినాశనం జరుగుతున్నది. ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'పులి' ఉంటేనే అడవికి మనుగడ!

**నేపాల్‌లో బఫర్‌జోన్ కమ్యూనిటీ ఫారెస్ట్ మోడల్ సక్సెస్ అయ్యింది. అక్కడ స్థానికులకు టూరిజం ఆదా యంలో వాటా ఇచ్చారు. ఫలితంగా వారు స్వచ్ఛందంగా పులులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. రష్యాలో 'అముర్ టైగర్' కోసం గ్రామాలచుట్టూ ఎర్లీవార్నింగ్ సిస్టమ్ పెట్టారు. మనం కూడా ఇలాంటి మోడల్స్‌ని ఆచరణలోకి తెస్తే మరిన్ని ఆశించిన ఫలితాలు రావచ్చు. అంకితభావం గల అటవీ అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర నిఘాలో రిజర్వ్ అడవులలో పులులసంఖ్య పెరిగినట్టే, ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతేపులి బఫర్ జోన్ దాటి టైగర్ కారిడార్‌లో కూడా సురక్షితంగా బతక గలుగుతుంది. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వాలకూ, పౌర సమాజానికి, పత్రికలూ, ప్రసార సాధనాల సహకారం, వన్యప్రాణుల సంరక్షణ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థల క్రియాశీలక పాత్రలు తోడైతే ఇది 21వ శతాబ్దపు అతి గొప్ప 'పెద్దపులి సంరక్షణ' కార్యక్రమంగా నిలుస్తుందని చెప్పక తప్పదు.**



డా. నీలం సంపత్

పులుల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందనే పర్యావరణ వేత్తల అభిప్రాయాన్ని గౌరవిస్తూ మన దేశంలో పులుల సంరక్షణ కోసం ప్రభుత్వాలు త్రికరణ శుద్ధిగా కృషి చేస్తుండడం అభినందనీయం. స్వతంత్ర భారతంలో తొలి ఇరవై ఐదు సంవత్సరాల కాలంలో దేశంలో పులుల సంఖ్య గణనీయంగాతగ్గి పులి సంతతి దేశంలో అంతర్ధానమోతుందేమోననే భయం మొదలైంది. పర్యవసానంగా పులుల సంరక్షణ కోసం 1973లో ప్రాజెక్ట్ టైగర్‌ను భారత ప్రభుత్వం ప్రారంభించింది. తద్వారా పులుల సంరక్షణలో మన దేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. ఇది బహిరంగ రహస్యం. మొదట 9 రిజర్వ్‌లు, 18,278 చ.కి.మీ.ల నుండి నేడు 58రిజర్వ్‌లు, 84,488 చ.కి.మీ.కు పెరిగింది. ఇది దేశ భూభాగంలో 2.6 కావడం గమనార్హం. రిజర్వ్ ఫారెస్ట్‌ల ఏర్పాటు, ఆదివాసీల తోడ్పాటు, సుశిక్షితులైన అటవీ అధికారుల స్ఫూర్తిదాయకమైన మార్గదర్శకత్వం, క్షేత్ర స్థాయి అటవీశాఖ సిబ్బంది త్యాగాల ఫలితంగా 2006లో 1,411గా ఉన్న పులులసంఖ్య 2022లో 3,682కి పెరిగింది. ప్రపంచ పులుల్లో 75 భారత్‌లోనే ఉన్నాయి. ఈ అద్భుతమైన విజయగాథ చిరస్మరణీయమే. రిజర్వ్ అడవులలో పెరుగుతున్న పులులు ఇరుకుగా మారిన వాటి ఆవాసాలలో ఇమడలేక రిజర్వ్ అడవుల్లో చోటుచాలక 3540 పులులు ఇప్పుడు రిజర్వ్ ఫారెస్ట్ బయటకు వలస వెళ్లాల్సివస్తోంది. నూతన ఆవాసాల అన్వేషణలో పులులు గ్రామాలు, పొలాలు, రోడ్లతో కూడిన జనావాసాల వైపు దూసుకువస్తున్నాయి. దీంతో మనిషిపులి ఘర్షణలు పెరుగుతున్నాయి. మనుషుల, పశువుల ప్రాణనష్టం జరుగుతోంది. ఫలితంగా పులుల పట్ల ప్రజల్లో తీవ్రవ్యతిరేకత, భయం పెరిగి వాటిని వేటాడే పరిస్థితులు వస్తున్నాయి. తెలంగాణ, కర్ణాటకతో సహా పలురాష్ట్రాల్లో ప్రజల ఆగ్రహానికి పెద్ద సంఖ్యలో పులులు బలైన వైనం బహిరంగ రహస్యమే. దీనికి తోడు అంతర్జాతీయ విఫణిలో పులి చర్మానికి, గోర్లకు ఉన్న డిమాండ్, 'ఔషధ గుణాలున్నాయి' అనే మూఢనమ్మకాల కారణంగా వేటగాళ్ల ఉచ్చులో పడి రిజర్వ్ అడవుల లోపలే అడపా తడపా పులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. దుర్భేద్యమైన రిజర్వ్ అడవులలోనే పోచింగ్ సాధ్యమైనప్పుడు రిజర్వ్ అడవుల బయట పులులను పోచింగ్ బెడద నుండి కాపాడడం కష్టంగా మారుతుందని చెప్పక తప్పదు. ఈ సమస్య పరిష్కారానికి 2025 అక్టోబర్ 6న డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్‌లో జరిగిన వైల్డ్ లైఫ్ వీక్‌లో భాగంగా కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, నేషనల్ టైగర్‌కన్జర్వేషన్ అథారిటీలు సంయుక్తంగా రూ.88.7 కోట్ల బడ్జెట్‌తో మూడు సంవత్సరాల కాలపరిమితితో టిఒటిఆర్ అనే వినూత్న పులుల సంరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. రిజర్వ్‌ఫారెస్ట్ బయట కూడా శాస్త్రీయంగా, ల్యాండ్‌స్కేప్ ఆధారితంగా పులులను కాపాడటం. అదే సమయంలో మనుషుల ప్రాణాలు, జీవనోపాధికి భంగం కలగకుండా చూడటం. రియాక్టివ్‌గా కాకుండా ప్రోయాక్టివ్‌గా, టెక్నాలజీ, ప్రజల భాగస్వామ్యంతో పని చేయడమే దీని స్ఫూర్తి. త్రిముఖ వ్యూహంగా టి.ఒ.టి.ఆర్ పని చేస్తుంది? కమ్యూనికేషన్ సిస్టమ్స్ అప్ గ్రేడ్, త్వరితగతిన స్పందించే రెస్క్యూ టీములు, రెస్క్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెరుగుపరచడం. రిజర్వ్ అడవుల బయట మనుషులు పులులు కలిసి జీవించే పరిస్థితులుసృష్టించడం. అవగాహన కార్యక్రమాలు, నష్టపోయిన వారికి సకాలంలో పరిహారం. ఆలస్యం చేస్తే ప్రజలు



ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతారు. గ్రామస్తులను భాగస్వాములుగా చేయాలి. ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2022 ప్రకారం 212 ఫారెస్ట్ డివిజన్లలో పులులున్నాయి. వాటిలో మొదటి ఫేజ్‌గా 9 రాష్ట్రాల్లోని 40డివిజన్లను ఎంపిక చేయడం జరిగింది. అవి ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, అస్సాం, తెలంగాణలు. తెలంగాణలో కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను ఎంపిక చేయడం హర్షనీయమే. సమీప గతంలో మహారాష్ట్రలోని తాడోబా, తిప్పేశ్వర్, ఛత్తీస్‌గఢ్ ఇంద్రావతి నుండి కవ్వాల్‌కు పులులు వచ్చేందుకు కుమ్రం భీం టైగర్ కన్జర్వేషన్ కారిడార్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక రిజర్వ్ నుండి మరో రిజర్వ్‌కు పులులు వలసవెళ్లే క్రమంలో అనివార్యంగా రిజర్వ్ బయట వాటిసంచారం కనిపిస్తోంది. అందుకే రిజర్వ్ బయట వాటి సంరక్షణ కోసమే టి.ఒ.టి.ఆర్‌ను ప్రతిపాదించారు. గతంలో రిజర్వ్ ఫారెస్ట్‌లను వ్యతిరేకించిన రాజకీయ పార్టీలే నిన్న గాక మొన్న టైగర్ కారిడార్ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులను, సమీప ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనేతరులను టైగర్ కారిడార్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టిన వైనం శోచనీయం. పులుల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ, సుస్థిరతతో కూడిన అభివృద్ధి జరుగుతుందన్న విషయాన్ని పక్కనపెట్టి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఈధోరణిని ప్రదర్శించడం దురదృష్టకరమనేది పులుల సంరక్షణ నిపుణుల నిశ్చితాభిప్రాయం. ఎందుకంటే టైగర్ కారిడార్ మూలంగా పోడుసేద్యం చేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరుల ఆవాసాలు చెదిరి వారి మనుగడే ప్రమాదంలో పడుతుందని వాదిస్తున్న రాజకీయపార్టీల నేతలు దేశంలో అనేక ఇతరరాష్ట్రాలలో పాలన కొనసాగిస్తున్న తమ పార్టీ ప్రభుత్వాలు అభివృద్ధిసాకుతో లక్షల హెక్టార్ల అటవీ భూములను కార్పొరేట్లకు అప్పణంగా అప్పగిస్తుంటే మౌనంగా ఉండడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమే ననేది పర్యావరణ వేత్తల అభిప్రాయం. ఈ పరిస్థితులలో కొమ్రం భీం టైగర్ కారిడార్‌లో పోయినేడాది ప్రవేశపెట్టిన టి.ఒ.టి.ఆర్‌కు రాజకీయ పార్టీల నేతలు ఏవిధంగా సహకరిస్తారో వేచిచూడక తప్పదు. మరోవైపు గ్రామాల్లో పులి మ్యానీటర్ గామారింది 'పులి వస్తే చంపేయాలి' అనే భయం ఉంది. ఈ భయాన్ని పోగొట్టి 'పులి ఉంటే అడవి బాగుంటుంది, అడవితోనే మానవ మనుగడ సుస్థిరమౌతుందనే అవగాహన ప్రజలలో కలిగించాలి. టెక్నాలజీ తోడ్పాటు మానవ వనరుల కల్పన గిరిజన భాగస్వామ్యంతో పైలట్ ప్రాజెక్ట్ అమలులో వున్న రాష్ట్రాల్లో కెమెరా ట్రాప్స్, డ్రోన్స్, నిఘా, ముందస్తు హెచ్చరికలతో పాటు శిక్షణ పొందిన అటవీ సిబ్బంది, వెటర్నరీ డాక్టర్లు, రెస్క్యూ టీములు పని చేస్తాయి. బాధితులకు పరిహారం వేగంగా అందించడం కూడా జరుగుతోంది. ఇక్కడ అత్యంత కీలకం ఆదివాసీ భాగస్వామ్యం. శతాబ్దాలుగా అడవిలో బ్రతికే గిరిజనులకు పులి కదలికలు, అడవి రహస్యాలు బాగా తెలుసు. వారిని 'ఫారెస్ట్ గార్డ్స్' 'ఈకో గైడ్స్'గా నియమిస్తే టి.ఒ.టి.ఆర్ 200 సక్సెస్ అవుతుంది. వారిని భాగస్వాములు చేయకుండా పైనుండి ఉత్తర్వులుఇస్తే ఈ ప్రాజెక్ట్ ఆశించిన ఫలితాలను అందించడంలో విఫలమయ్యే ప్రమాదం ఉంది. నేపాల్‌లో బఫర్‌జోన్ కమ్యూనిటీ ఫారెస్ట్ మోడల్ సక్సెస్ అయ్యింది. అక్కడ స్థానికులకు టూరిజం ఆదాయంలో వాటా ఇచ్చారు. ఫలితంగా వారు స్వచ్ఛందంగా పులులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. రష్యాలో 'అముర్ టైగర్' కోసం గ్రామాలచుట్టూ ఎర్లీవార్నింగ్ సిస్టమ్ పెట్టారు. మనం కూడా ఇలాంటి మోడల్స్‌ని ఆచరణలోకి తెస్తే మరిన్ని ఆశించిన ఫలితాలు రావచ్చు. అంకితభావం గల అటవీ అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర నిఘాలో రిజర్వ్‌అడవులలో పులులసంఖ్య పెరిగినట్టే, ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే పులి బఫర్ జోన్ దాటి టైగర్ కారిడార్‌లో కూడా సురక్షితంగా బతక గలుగుతుంది. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వాలకూ, పౌర సమాజానికి, పత్రికలూ, ప్రసార సాధనాల సహకారం, వన్య ప్రాణుల సంరక్షణ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థల క్రియాశీలక పాత్రలు తోడైతే ఇది 21వ శతాబ్దపు అతి గొప్ప 'పెద్దపులి సంరక్షణ' కార్యక్రమంగా నిలుస్తుందని చెప్పక తప్పదు.

# గిగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక

సి.హెచ్.ప్రతాప్

డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారిన శ్రామికులకు సామాజిక భద్రత అవసరం అన్న డిమాండ్ ప్రస్తుతం ఊపందుకుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ గిగ్, ప్లాట్‌ఫామ్ ఆధారిత ఉపాధి అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయి. డెలివరీ సిబ్బంది, క్యాబ్ డ్రైవర్లు, కిరాణా సరుకులు అందించే సిబ్బంది, గృహ సేవలు అందించే కార్మికులు ఆధునిక నగర జీవనానికి అవిభాజ్య భాగంగా మారారు. వినియోగదారుడి ఇంటి గడపకు చేరే ప్రతి సేవ వెనుక ఒక శ్రామికుడి శ్రమ ఉంది. అయితే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు అభివృద్ధి చెందుతున్న వేగంతో కార్మికుల సామాజిక భద్రత కూడా బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. గిగ్ పనిలో సమయసౌలభ్యం, కొంత స్వతంత్రత ఆకర్షణీయ అంశాలే. కానీ దాని వెనుకఆదాయ అనిశ్చితి, ఇంధన వ్యయం, వాహన నిర్వహణ భారం, రోడ్డు ప్రమాదాల ముప్పు, వర్షం-ఎండలో పనిచేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అనారోగ్యం లేదా ప్రమాదం కారణంగా పనిచేయలేకపోతే ఆదాయం వెంటనే నిలిచిపోవచ్చు. రేటింగ్‌లు, ప్రోత్సాహకాలు, పనుల కేటాయింపు, ఖాతా నిలిపివేత వంటి ప్లాట్‌ఫామ్ నిర్ణయాలు కూడా జీవనోపాధిపై ప్రభావం చూపగలవు. అందువల్ల ఫ్లెక్సిబిలిటీ పేరుతో భద్రతను విస్మరించడం సమర్థనీయం కాదు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్, 2026 ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ చట్టం గిగ్ కార్మికుల నమోదు, ప్రత్యేక గుర్తింపు, సంక్షేమ బోర్డు, సంక్షేమ నిధి, సామాజిక భద్రతా పథకాలు, ఫిర్యాదు పరిష్కారం వంటి అంశాలకు వ్యవస్థను కల్పిస్తోంది. అయితే చట్టం అమలులోకి వచ్చే తేదీని ప్రభుత్వం ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించాల్సి ఉంటుంది. అలాగే నిర్దిష్ట బీమా మొత్తం లేదా ప్రతి కార్మికుడికి ఒకే విధమైన సంక్షేమ ప్రయోజనాలను చట్టం నేరుగా హామీ ఇవ్వదు. ప్రభుత్వం రూపొందించే పథకాల ద్వారా ప్రయోజనాలు అమలవుతాయి. ఇక చేయాల్సింది మరింత స్పష్టంగా ఉండాలి. పని గంటలకు గరిష్ఠ పరిమితి, నిర్బంధ విశ్రాంతి విరామాలు, వరుసగా అధిక గంటలు పనిచేయకుండా రక్షణ వంటి నిబంధనలను భవిష్యత్ నియంత్రణలో పరిగణించాలి. ప్రమాదంలో గాయపడినప్పుడు తక్షణ వైద్య సహాయం, ఆసుపత్రి ఖర్చుల భర్తీ, ప్రమాద మరణం లేదా శాశ్వత వైకల్యానికి తగిన పరిహారం కల్పించే సమగ్ర ప్రమాద బీమా అవసరం. కుటుంబ ఆరోగ్యం, ఆసుపత్రి చికిత్స, ప్రసూతి, మానసిక ఆరోగ్యం వంటి అంశాలను కూడా ఆరోగ్య బీమా పరిధిలోకి తీసుకురావాలి. అదేవిధంగా అనారోగ్యం, ప్రమాదం లేదా ప్రసూతి సమయంలో ఆదాయ పరిరక్షణ, వృద్ధాప్యానికి పెన్షన్ లేదా దీర్ఘకాలిక పొదుపు, నైపుణ్యాభివృద్ధి, చట్టపరమైన సహాయం వంటి భద్రతా వ్యవస్థలు అవసరం. ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరొకదానికి మారినా ప్రయోజనాలు కోల్పోకుండా పోర్టబుల్ సామాజిక భద్రతా ఖాతా ఏర్పాటు చేయాలి. చెల్లింపులు, కోతలు, ప్రోత్సాహకాలు, రేటింగ్‌లు, అల్గారిథమిక్ నిర్ణయాలపై పారదర్శకత తప్పనిసరి చేయాలి. అన్యాయంగా ఖాతా నిలిపివేతకు స్వతంత్ర అప్పీల్ వ్యవస్థ ఉండాలి. కేంద్ర స్థాయిలో కోడ్ ఆన్‌సోషల్ సెక్యూరిటీ, 2020కూడా గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను సామాజిక భద్రతా చట్రంలోకి తీసుకొచ్చింది. ఈశ్రమ్ వంటి నమోదు వ్యవస్థలతో రాష్ట్రాల సంక్షేమ పథకాలను అనుసంధానించడం ద్వారా కార్మికుల ప్రయోజనాలను మరింత పోర్టబుల్‌గాచేయవచ్చు. కార్మిక సంక్షేమం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ప్లాట్‌ఫామ్ సంస్థలు కూడా తమ వ్యాపార నమూనాలో సామాజిక భద్రతా వ్యయాన్ని అంతర్భాగంగా చూడాలి. తెలంగాణ ప్రభుత్వం గతంలో ప్రతిపాదించిన విధానంలోప్రమాద, ఆరోగ్య బీమాకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది కూడా. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విజయం యాప్‌ల వేగంతో కాదు. ఆయాప్‌ల వెనుక పనిచేసే మనుషుల భద్రత, గౌరవం, భవిష్యత్తుతో కొలవాలి. సాంకేతిక ఆవిష్కరణఉపాధిని సృష్టించాలి. గిగ్ ఆర్థికవ్యవస్థకు నిజమైన బలం కావాలంటే ఫ్లెక్సిబిలిటీతో పాటు భద్రత, ఆదాయంతోపాటు బీమా, ఉపాధితో పాటు గౌరవం ప్రతి కార్మికుడికి అందాలి.

# సామాన్యుడి నెత్తిపై ధరల పిడుగు



జీ. శ్రీలత

ఒక కుటుంబం ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి భారీ ఆర్థిక గణాంకాలు అవసరం లేదు. ఆ కుటుంబం నెలకు తెచ్చే సరుకుల జాబితాను ఒకసారి పరిశీలిస్తే చాలు. బియ్యం, పప్పు, వంటనూనె, పంచదార, గోధుమలు, కూరగాయలు, పాలు, ఇంధనం. వీటి ధరలు ఎంత పెరిగాయి? అనే ప్రశ్నలకు సమాధానం వెతికితే సామాన్యుడి ఆర్థిక స్థితి ఏ దిశగా వెళ్తుందో స్పష్టంగా అర్థమవుతుంది. ప్రస్తుతం దేశంలో అదే జరుగుతోంది. ఆదాయాలు పెరిగే వేగం కంటే నిత్యావసరాల ధరలు పెరుగుతున్న వేగం ఎక్కువగా ఉండటంతో కోట్లాది కుటుంబాల నెలవారీ బడ్జెట్ అస్తవ్యస్తమవుతోంది. ధరల పెరుగుదల ఇప్పుడు కేవలం మార్కెట్‌లో కనిపించే సంఖ్య కాదు.. అది ప్రతి ఇంటి వంటగదిలో కనిపిస్తున్న మంట. గత ఫిబ్రవరి 28 నుంచి ఆగస్టు 3 మధ్య కేవలం ఐదు నెలల వ్యవధిలోనే వంటింట్లో నిత్యం ఉపయోగించే అనేక సరుకుల ధరలు 5 శాతం నుంచి 40శాతం వరకు పెరిగినట్టు మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి. ప్రాథమిక ఆహార వస్తువుల ధరలు పెరగడం అంటే పేద, మధ్యతరగతి కుటుంబాలపై నేరుగా అదనపు భారం పడటమే. సంపాదనలో గణనీయమైన భాగం ఆహారం, ఇంధనం, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలకే వెచ్చించాల్సి వస్తే పొదుపు ఎలా సాధ్యం? భవిష్యత్తు కోసం పెట్టుబడి ఎలా పెట్టగలరు? పిల్లల విద్య, ఆరోగ్యం వంటి అవసరాలకు ఎలా కేటాయించగలరు?ధరల పెరుగుదలకు అంతర్జాతీయ పరిణామాలు, యుద్ధాలు, వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు, ఇంధన ధరలు, దిగుమతులపై ఆధారపడటం వంటి అనేక కారణాలు ఉన్నాయనడంలో సందేహంలేదు. ప్రపంచ ఆర్థికవ్యవస్థ పరస్పర ఆధారితంగా మారిననేపథ్యంలో ఒక దేశంలో జరిగేయుద్ధం, మరో దేశంలో ఏర్పడే వాతావరణ సంక్షోభం కూడా మన వంటింటిపై ప్రభావం చూపుతోంది. యుద్ధాలు ప్రభుత్వాల చేతుల్లో ఉండకపోవచ్చు. వాతావరణాన్ని కూడా నియంత్రించలేం. అంతర్జాతీయ మార్కెట్లను పూర్తిగా శాసించలేం. కానీ వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి దేశీయమార్కెట్‌ను రక్షించే విధానాలను రూపొందించడం మాత్రం ప్రభుత్వాల బాధ్యత. ఆహారనిల్వలను సమర్థంగా నిర్వహించడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, రైతులను ప్రోత్సహించడం, దిగుమతులపై అధిక ఆధారపడకుండావ్యూహాలు రూపొందించడం, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టడం వంటి చర్యలు ప్రభుత్వ పరిధిలోనే ఉంటాయి. అందుకే ధరలు పెరిగిన ప్రతిసారీ అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపడం కంటే ప్రభుత్వం ముందస్తుగా



ఏం చేసింది? ఇంకా ఏం చేయాలి? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో కోట్లాది కుటుంబాలకు బియ్యం కేవలం ఒక ఆహార పదార్థం కాదు. అది వారి రోజువారీ జీవితంలో అత్యంత ప్రాథమిక అవసరం. అలాంటి బియ్యం ధరలు గణనీయంగా పెరగడం ఆందోళన కలిగించే పరిణామం. దేశంలో 2025-26పంట సంవత్సరంలో వరి ఉత్పత్తి రికార్డు స్థాయిలో ఉంటుందని ప్రభుత్వ అంచనాలున్నప్పటికీ, మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గి ధరలు పెరగడం విరుద్ధమైన పరిస్థితిని సూచిస్తోంది. ఉత్పత్తి ఉన్నప్పటికీ వినియోగదారుడికి ధర ఎందుకు తగ్గడం లేదు? రైతు నుంచి వినియోగదారుడి వరకు ఉన్న సరఫరా గొలుసులో ఎక్కడ సమస్య ఉంది? నిల్వలు ఎలా ఉన్నాయి?మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా?మధ్యవర్తుల పాత్ర ఎంత? ప్రభుత్వం వద్ద ఉన్న బఫర్ స్టాక్స్ పరిస్థితి ఏమిటి? రైతుకు తగిన ధరరావాలి. అదే సమయంలో వినియోగదారుడిపై అనవసరమైన భారం పడకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే సమర్థవంతమైన వ్యవసాయ, ఆహార విధానానికి కొలమానం. నిత్యావసర వస్తువుల ధరల్లో వంటనూనెది ప్రత్యేక స్థానం. భారతదేశం తన దేశీయ అవసరాల్లో గణనీయమైన భాగం కోసం దిగుమతులపై ఆధారపడుతోంది. అంతర్జాతీయమార్కెట్లలో ధరలు పెరిగినా, యుద్ధాలు జరిగినా, సముద్ర రవాణాకు అంతరాయం ఏర్పడినా దానిప్రభావం నేరుగా భారతీయ వినియోగదారుడిపై పడుతుంది. ఇది తాత్కాలిక సమస్యగా చూడటం ప్రమాదకరం. దేశీయంగా నూనెగింజల ఉత్పత్తిని పెంచే దీర్ఘకాలిక వ్యూహం అవసరం. రైతులకు మెరుగైన విత్తనాలు, సాగు సాంకేతికత, మార్కెట్ హామీ, గిట్టుబాటు ధర కల్పించకుండా దిగుమతులపై ఆధారపడటంకొనసాగిస్తే ప్రతి అంతర్జాతీయ సంక్షోభం మన వంటింటిని ప్రభావితం చేస్తూనే ఉంటుంది. పంచదార ధరలు 8నుంచి 15 శాతం వరకు పెరగడం మరో ఆందోళనకర పరిణామం. హోల్‌సేల్ మార్కెట్‌లో క్వింటాల్‌కు గణనీయమైన పెరుగుదల నమోదవుతుండగా, దేశంలోని ప్రధాన నగరాల్లోరిటైల్ ధరలు కూడా పైకి కదులుతున్నాయి. సరఫరా తగినంతగా లేకపోతే ధరలు మరింత ఎగిసే అవకాశం ఉంటుంది. వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులు వర్షపాతంపై ప్రభావం చూపితే పంటల సాగు, ఉత్పత్తి రెండూ దెబ్బతింటాయి. ఇప్పటికే ఖరీఫ్ పంట విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే తగ్గినట్టు మార్కెట్ వర్గాల అంచనాలు చెబుతున్నాయి. సాగు తగ్గితే ఉత్పత్తి తగ్గుతుంది. ఉత్పత్తి తగ్గితే సరఫరా తగ్గుతుంది. సరఫరా తగ్గితే ధర పెరుగుతుంది. ధర పెరిగితే చివరికి భారం వినియోగదారుడిపైనే పడుతుంది. ధరలు పెరిగిన తర్వాత స్పందించడం కంటే ధరలు పెరగడానికి దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించడం ప్రభుత్వాల బాధ్యత. దేశ ఆర్థిక వ్యవస్థకు నిజమైన అద్దం స్టాక్ మార్కెట్ సూచీలు కాదు. సామాన్యుడి వంటగది. ఆ వంటగదిలో మంట అదుపులో ఉన్నప్పుడే దేశ ఆర్థిక ప్రగతి నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.



బుధవారం గాంధీభవన్‌లో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రాలు అందజేస్తున్న దృశ్యం

## శ్రీధర్‌బాబును కలిసేందుకు వచ్చిన నిరుద్యోగులను అడ్డుకొన్న పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త: పోలీసు నియామకాలలో అభ్యర్థుల వయోపరిమితి పెంపులని విన్నపం చేసుకొనేందుకు శాసనసభవ్యవహారాలు, పరిశ్రమలు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును కలిసేందుకు వెళ్ళి నిరుద్యోగులకు గాంధీ భవన్‌లో చేదు అనుభవం ఎదురైంది. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం బుధవారం ఉదయం పదకొండు గంటలకు ఇందిరాభవన్‌లో ప్రారంభం కాగానే శ్రీధర్‌బాబు వద్దకు అనేక మంది వినతులతో వెళ్ళి వారి సమస్యలు వివరించుకొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఆయన అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారం కు చొరవ తీసుకోవాలని కోరారు. ఇదిఇలా ఉంటే మరోవైపు పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత కూడా గాంధీభవన్‌కు వచ్చిచేరుకొంది. పోలీస్ ఉద్యోగాలకు వయోపరిమితి పెంపులని మంత్రి శ్రీధర్ బాబును కలిసి విజ్ఞప్తి చేసేందుకు గాంధీ భవన్‌కు వెళ్లిన నిరుద్యోగులను లోనికి రానీయకుండా పోలీసులు అడ్డుకోవడం నిరుద్యోగుల ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ సమస్యలు చెప్పుకు నేందుకు వస్తే అడ్డుకోవడం నిరుద్యోగులు ఆవేదన చెందారు. శ్రీధర్‌బాబుకు మా సమస్య తెలిస్తే ఆయన పరిష్కారంకు చొరవ తీసుకోవాలని విద్యా వంతుడు ఆయన తప్పక మా గోడు వింటాడని మాకు న్యాయం జరుగు తుందని వచ్చామని కానీ ఆయనను కలవకుండా మధ్యవర్తులు అడ్డుపడ్డారని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ గెలిచిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీనిచ్చినారని కానీ అది ఇంతవరకు అమలు చేయడంలేదని అన్నారు. కాంగ్రెస్ మంత్రులు నాయకులు ఇప్పుడు కనీసం కలిసేందుకు కూడా సమయం ఇవ్వడం లేదని ఆరోపించారు.

## సస్పెండెడ్ ఇన్‌స్పెక్టర్ ముందస్తు బెయిల్ పిటిషన్

హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త: గృహహింస కేసులో బాధితురాలిగా వున్న ఓ మహిళపై లైంగిక దాడితో పాటు బలవంతంగా డబ్బులు తీసుకున్న కేసులో సస్పెండ్ అయిన జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో తనపై నమోదైన మరో కేసులో హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. జూబ్లీహిల్స్‌లో వెలుగు చూసిన ఘటన తరువాత ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించడం తెలిసిందే. దీని తరువాత మరో మహిళను కూడా ఆయన ఇదే తరహాలో వేధింపులకు గురిచేసి, లైంగిక దాడికి పాల్పడి, ఆమెను గర్భవతి చేసి, రెండు కోట్ల రూపాయలు వసూలు చేసినా అభియోగాలపై బీఎన్ఎస్ 64,68,74,75, 77,78,89,115,308,351 సెక్షన్లతో పాటు ఐటి చట్టం లోని 66,67 సెక్షన్ల కింద కేసునమోదు చేశారు. ఈ కేసులో బాధితురాలి నా గ్యాలం తీసుకోకుండానే పాటు ఆమెకు వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు. దీని తరువాత ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి అజ్ఞాతంలో వెళ్లి పోయారు. తనపై అమీన్‌పూర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణకు స్వీకరించిన హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

## రేగా కాంతారావు ముందస్తు బెయిల్ పిటిషన్

హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త: పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో తనపై నమోదైన లైంగిక దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని బి ఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని రేగా కాంతారావు హైకోర్టును ఆశ్రయించగా దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేయడం తెలిసిందే. అయితే ఈలోపు పోలీసులు తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన కోర్టును కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ మధుసూదన్ రావు ఇది తన పరిధిలోకి రాదని, ముందస్తు బెయిల్ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ బెంచ్ ముందువుంచాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. మరోవైపు కాంతారావుపై నమోదైన కేసుపై పోలీసులు విచారణ వేగం పుంజుకుంది. ఆయన కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. విచారణకు ఆయన రావడం లేదని పోలీసులు వివరించారు.

## గాలిలో ఉండగానే ఇంజన్ వైఫల్యం

### చెన్నై ఎయిర్‌పోర్టులో ఇండిగో అత్యవసర ల్యాండింగ్



చెన్నై, ఆగస్టు 12: కోల్‌కతానుంచి చెన్నై వస్తున్న ఇండిగో విమానం అత్య వస రంగా ల్యాండ్ అయ్యింది. విమానం గాల్లో ఉండగా ఇంజన్ ఫెయిల్ అయింది. దాంతో చెన్నై విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించాల్సి వచ్చింది. మంగళవారం అర్ధరాత్రి ఈ భయానక ఘటన చోటుచేసుకుంది. 224 మంది ప్రయాణికులతో ఇండిగో విమానం కోల్‌కతా నుంచి చెన్నైకి బయల్దేరింది. రాత్రి 11.30కి అది గమ్యస్థానంలో దిగాల్సి ఉంది. విమానం ల్యాండింగ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో ఎడమవైపు ఇంజిన్ విఫలమైనట్లు పైలెట్ గుర్తించారు. వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను అప్రమత్తం చేశారు. దాంతో సురక్షిత ల్యాండింగ్ కోసం చెన్నై విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించారు. అధికారుల అప్రమత్తతతో ఏడు నిమిషాల తర్వాత సురక్షితంగా విమానం దిగడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. మరో 10నిమిషాల తర్వాత ఎమర్జెన్సీని ఉపసంహరించుకోవడంతో కార్యకలాపాలన్నీ సాధారణ స్థితికి చేరుకున్నాయి.

## పోలీసు కొలువుల భర్తీకి నాలుగేళ్ల సడలింపు ఇవ్వాలి

### డిజిపిని కోరిన ఐబిసి సంక్షేమ సంఘం నేతలు

హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త: పోలీసు శాఖలో చేపడుతున్న కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టుల భర్తీలో నాలుగేళ్ల వయో పరిమితిని పెంచాల ని రాష్ట్ర ఐబిసి సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవికిరణ్ రావు, కోశాధికారి యాద గిరి గుప్తా సహ ఇతర నేతలు బుధవారం నాడు డిజిపి ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు రెగ్యులర్‌గా భర్తీలు కావడం లేదని, ఇందులో పోలీసు శాఖలు కూడా వున్నాయని తెలిపారు. ఈ నే పథ్యంలో చాలా మంది నిబంధనల మేరకు ప్రభుత్వ ఉద్యోగాలకు వయో పరిమితిని దాటేశారని, వీరికి సడలింపు ఇవ్వడం న్యాయమని సంఘ ం నేతలు తెలిపారు. గతంలో కానిస్టేబుల్ పోస్టులకు 34 ఏళ్ళు, ఎస్ఐ పోస్టులకు 37 ఏళ్ల వరకు వయో పరిమితి వుండేదని వారు తెలిపారు. ఇప్పుడు కానిస్టేబుల్ పోస్టులకు 32 ఏళ్లు, ఎస్ఐ పోస్టులకు 35 ఏళ్ల వరకు వుండడంతో చాలా మందికి అన్యాయం జరుగుతుందని, దీనిని స వరించి కానిస్టేబుల్ పోస్టులకు 36 ఏళ్ల వరకు, ఎస్ఐ పోస్టులకు 39 ఏళ్ల వరకు పెంచడంతో పాటు అదనంగా మరో నాలుగేళ్ల సడలింపు ఇవ్వాలని వారు కోరారు. నిరుద్యోగులకు ఇది వరంగా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో పాటు పోలీసు శాఖలో ఖాళీగా వున్న అన్ని పోస్టులకు వెంటనే భర్తీ చేయాలని వారు కోరారు.

## టిమ్స్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ మహబూబ్ ఖాన్

జూబ్లీహిల్స్, ఆగస్టు 12, ప్రభాతవార్త: సనత్‌నగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మహ బూబ్ ఖాన్ నియమితులయ్యారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య విభాగాల మధ్య సమన్వయం చేయడంతో పాటు ఆస్పత్రి కార్య కలాపాలను పర్యవేక్షించనున్నారు.



# విద్యుత్ ఉచ్చుకు అటవీశాఖ బీట్ ఆఫీసర్ బలి

### అక్రమ వేటను అడ్డుకునే క్రమంలో విషాదం

## ముగ్గురిపై కేసు



మృతుడు బానోతు నవీన్(ఫైల్)

బూర్గంపహాడ్, ఆగస్టు 12 ప్రభాతవార్త: అడవి జంతువులను అక్రమంగా వేటాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చు అటవీశాఖ ఉద్యోగి ప్రాణాలను బలిగొంది. వన్యప్రాణుల వేటకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు అందిన సమాచారంతో సంఘటనా ప్రాంతానికి వెళ్లిన బీట్ ఫారెస్ట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) బానోతు నవీన్ విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందిన విషాద ఘటన బూర్గం పహాడ్ మండలం నకిరిపేట గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నకిరిపేట గ్రామపరిధిలో కొంతమంది వ్యక్తులు అడవి జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో డీఆర్ఓ కరుణం అనార్కలి, ఎఫ్‌బీఓ బానోతు నవీన్‌తో పాటు అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని విద్యుత్ తీగలను గుర్తించడంతో పాటు సంబంధిత వ్యక్తుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు ఎఫ్‌బీఓ బానోతు నవీన్ తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. అక్రమ వేటను అడ్డుకునే విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన ఉద్యోగి ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడంతో అటవీశాఖలో విషాదం నెలకొంది. నవీన్ మృతికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆవుల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్ఓ కరుణం అనా ర్కలి బుధవారం బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అడవి జంతువులను వంపేం దుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు ఫిర్యా దులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పాల్వం చ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సతీష్ దర్యాప్తును పర్య వేక్ష స్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. అడవి జం తువుల వేట కోసం విద్యుత్ తీగలను ఏర్పాటు చేయడం వన్యప్రాణులతో పాటు మనుషుల ప్రా ణాలకు సైతం తీవ్ర ప్రమాదకరంగా మారు తోంది. ఈ ఘటనలో వేట కోసం ఏర్పాటు చేసి నట్లు ఆరోపణలు ఉన్న విద్యుత్ ఉచ్చే అటవీశాఖ ఉద్యోగి ప్రాణాలను బలిగొనడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అక్రమ వేటను అరికట్టడంతో పాటు ఇలాంటి ప్రమాదకర విద్యుత్ ఉచ్చులను ఏర్పా టు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని

# లగ్జరీ ఫ్లాట్‌లో పేకాట దందా గుట్టురట్టు

### రూ.3.28 లక్షల నగదు, పేకాట కార్డులు, నగదు లెక్కింపు యంత్రం స్వాధీనం, మాజీ డీసీసీబీ ఛైర్మన్ సహా 8మంది అరెస్ట్



పేట్ బషీరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త: లగ్జరీ అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట దందాను కుత్బుల్లాపూర్ ఎస్ ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు ఛేదించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం కొంపల్లి సమీపంలోని అపర్ణ సెరినిటీ అపార్ట్‌మెంట్ డీబ్లాక్‌లోని ఫ్లాట్ నంబర్ 706పై పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. అక్కడ నగదు పందేలతో టీన్ పత్తి ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం పేకాట ఆడుతున్న వారిలో రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన పలువురు ఉన్నారు. పట్టుబడ్డవారిలో రమేష్ (45), చేగూరి మోహన్ (56), కె. శ్రీనివాస్ (56), కాసాల విక్రమ్ రెడ్డి (46), ఎన్. శ్రీనివాస్ (53), బిట్టి దేవేందర్ రెడ్డి (58), గొల్లపల్లి భాస్కర్ (59), ఎస్. రాజు (26) ఉన్నారు. వీరిలో ఎస్. రాజు వంట పని, ప్రైవేట్ చేస్తుండగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వారిలో బిట్టి దేవేందర్ రెడ్డి మాజీ మెదక్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తిగా పోలీసులు పేర్కొంటున్నారు. ఆయనపై గతంలోనూ పేకాటకు సంబంధించిన కేసు నమోదైనట్లు సమాచారం. ఈ ఘటనలోనూ పేకాట ఆడు తున్నారనే ఆరోపణలపై పోలీసులు ఆయనతో పాటు మరో ఏడుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది. పేకాట స్థావరంలో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడి పరిస్థితులను చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. నగదును చేతులతో లెక్కించాల్సిన అవసరం లేకుండా ప్రత్యేకంగా నగదు లెక్కింపు యంత్రాన్ని అక్కడ ఏర్పాటు చేసి ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈ స్థావరంలో పేకాట వ్యవహారం కొంతకాలంగా కొనసాగుతోందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల దాడిలో మొత్తం రూ.3,28,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఎనిమిది స్మార్ట్‌ఫోన్లు, పది సెట్ల పేకాట కార్డులు, ఒక నగదు లెక్కింపు యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు నమోదు చేశారు.

# లోక్‌సభ స్థానాల సంఖ్యను 543కే పరిమితం చేయాలి

### తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం



చెన్నై, ఆగస్టు 12: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. లోక్‌సభలో మొత్తం స్థానాల సంఖ్యను ప్రస్తుత 543కే శాశ్వతంగా పరిమితం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. 2026 ఏప్రిల్ 16న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి 850కి పెంచడంతో పాటు, 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వేగంగా అమలు చేయాలని ప్రతిపాదించారు. అయితే పార్లమెంట్‌లో హాజరై ఓటు వేసిన సభ్యుల్లో రాజ్యాంగపరంగా అవసరమైన మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లభించకపోవడంతో ఆ బిల్లు ఆమోదం పొందలేదు. జనాభా నియంత్రణలో ముందంజలో ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ కారణంగా పార్లమెంటులో రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకూడదన్న ఉద్దేశంతో తమిళనాడు ప్రభుత్వం ఈ తీర్మానాన్ని తీసుకొచ్చింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ సభ్యుల సంఖ్యను 550 నుంచి 850కి పెంచే ప్రతిపాదన జనాభా నియంత్రణ విషయంలో జాతీయ విధానాలను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు నష్టం కలిగిస్తుందని తీర్మానంలో పేర్కొన్నారు.

## తెలంగాణలో వరి ఉత్పత్తిలో కాళేశ్వరానికి ఎలాంటి పాత్ర లేదు: సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 12: రాష్ట్రంలో భారీ వరి ఉత్పత్తిలో కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలాంటి పాత్ర లేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం సిఎం (ట్విట్టర్) ఎక్స్ వేదికగా ఓ సందేశాన్ని పోస్ట్ చేశారు. గత రెండేళ్లు పైగా కాలంలో రైతు రుణ మాఫీ, రైతు బీమా, రైతు భరోసా, 24గంటల ఉచిత విద్యుత్, చాలా జిల్లాల్లో నీటి లభ్యత వంటి రైతు కేంద్రీకృత విధానాల ఫలితంగా తెలంగాణ రైతులు రికార్డు స్థాయి వరి దిగుబడిని సాధించారన్నారు. అయితే, లోతైన పరిశీలనతో కూడిన విశ్లేషణలో, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జనయ్య ఒక కీలక వాదనను వినిపించినట్లు చెప్పారు. తెలంగాణలో ఈ భారీ వరి ఉత్పత్తిలో కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలాంటి పాత్ర లేదు. రాష్ట్రంలో వరి దిగుబడి ఇంత పెరగడానికి గత పదేళ్లుగా కురిసిన మంచి వర్షాలే ప్రధాన కారణం అని సిఎం తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 15 లక్షల కొత్త బోరుబావుల కారణంగా అదనంగా 40 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయని చెప్పారు. తెలంగాణలో సాగునీటి సరఫరాలో ఉన్న భూమి విస్తీర్ణంలో 100 శాతం వృద్ధికి కేవలం ఈ బోరుబావులే కారణమని, పెరుగుతున్న సాగునీటి ఖర్చులను అధిగమించలేకే నికర ఆదాయమే రైతుల సంక్షేమాన్ని నిర్ణయిస్తుంది. కానీ, గత దశాబ్దంలో తెలంగాణ ఆ విషయంలో ఎలాంటి వృద్ధిని సాధించలేదు అని సిఎం స్పష్టం చేశారు. వ్యవసాయ విషయంలో ప్రతిపక్షాలు సృష్టించిన అబద్ధపు ప్రచారం బట్టబయలైంది. ఇక ఆ చర్చకు ముగింపు పలికినట్లే, రైతుల భవిష్యత్తును, వారి ఆర్థిక శ్రేయస్సును మార్చే ప్రక్రియను ప్రారంభించింది కాంగ్రెస్ ప్రజా పాలన మాత్రమే అని సిఎం పేర్కొన్నారు.

## భూములను ఎలా పొందాలో తెలంగాణ బిడ్డలకు నేర్పించాలి: కెటిఆర్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు12: లక్ష రూపాయలు పెట్టుబడితో వందల కోట్ల భూములు ఎలా కొట్టేయాలో తెలంగాణ బిడ్డలకు కూడా చెప్పాలని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి సోదరుల భూకబ్జాలకులపైన ఎక్స్‌లో స్పందించిన కెటిఆర్ ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీగా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఆయన ఎద్దేవా చేశారు. నిజమైన స్ఫూర్తి ఎవరైనా, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టిఎఎస్‌ను నిర్మిస్తే సిఎం మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం అనుముల హబ్ ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారన్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలని ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు మాత్రం కారుచౌకగా కేటాయింపు చేశారని ఆయన ఆరోపించారు. రూ. 1 లక్ష పెయిడ్ అప్ క్యాపిటల్‌తో ఒక్క ఉద్యోగి కూడా లేని టెస్టాలరేక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టం ప్రైవేటు లిమిటెడ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం, ఇంతటి అర్థించిన అనుముల కొండల్ రెడ్డిని ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీగా ప్రకటించాలని కెటిఆర్ ఎద్దేవా చేశారు.

# వయసొచ్చిన పిల్లలు తల్లిదండ్రుల ఆస్తి కాదు

### భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ వారికుంది

### బాంబే హైకోర్టు సంచలన తీర్పు



ముంబై, ఆగస్టు 12: వయోజనులైన పిల్లలు స్వతంత్ర వ్యక్తులని, వారు తల్లిదండ్రుల ఆస్తి ఎంతమాత్రం కాదని బాంబే హైకోర్టు చారిత్రాత్మక తీర్పును ఇచ్చింది. మేజర్లు అయిన యువతీ యువకులు తమకు నచ్చిన జీవిత భాగస్వామిని ఎంచుకునే పూర్తి స్వేచ్ఛను కలిగి ఉంటారని, వారి నిర్ణయాల్లో ఇతరులు జోక్యం చేసుకోరాదని తేల్చి చెప్పింది. కుటుంబాల పేరుతో వయోజనుల నిర్ణయాలపై ఆధిపత్యం చెలాయించలేరని పునరుద్ఘాటించింది. మేజర్ అయిన ప్రతీ ఒక్కరికీ వారి వ్యక్తిగత జీవితం, భాగస్వామి ఎంపిక విషయంలో రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛ ఉంటుందని పేర్కొంది. అలాగే వారి అభిప్రాయాలను గౌరవించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని న్యాయస్థానం తేల్చి చెప్పింది. అంతేకాకుండా పిల్లలను తల్లిదండ్రుల ఆస్తి కాదని వివరించింది. ఆ విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకోవాలని కూడా తెలిపింది. నచ్చిన వ్యక్తితో కలిసి జీవిస్తున్న కుమార్తె కన్పడిని కోరుతూ తల్లి దాఖలు చేసిన పిటిషన్‌ను నాగ్‌పూర్ బెంచ్ కొట్టివేసింది. స్వేచ్ఛగా భాగస్వామిని ఎంచుకునే హక్కు మేజర్లకు ఉందని స్పష్టం చేస్తూనే.. ఇలాంటి కేసుల్లో హెబియస్ కార్పస్ పిటిషన్లు చెల్లవని న్యాయస్థానం తేల్చి చెప్పింది. నాగ్‌పూర్‌కు చెందిన ఓ యువతి 17ఏళ్ల వయసులో ట్యూషన్ క్లాసుల కోసం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీ సులు సదరు బాలిక ఒక యువకుడితో వెళ్లినట్లు గుర్తించారు. ఆపై ఆమెను పట్టుకుని తల్లికి అప్పగించారు. అయితే ఆ తర్వాత కొంతకాలానికి ఆ యువతి మళ్లీ ఇల్లు వదిలి సదరు యువకుడి వద్దకు వెళ్లిపోయింది. దీంతో కుమార్తె కన్పడిని తనకు అప్పగించాలని కోరుతూ తల్లి బాంబే హైకోర్టును ఆశ్రయించింది. మైనర్‌గా ఉన్నప్పుడు ఆ యువకుడు తన కుమార్తెను అక్రమ నిర్బంధంలో ఉంచాడని, యువతి పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయలేదని తల్లి ఆరోపించారు. అంతేకాకుండా తన కుమార్తెను తన కస్టడీకి అప్పగించాలంటూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో విచారణ జరిపిన న్యాయస్థానం షాకింగ్ కామెంట్లు చేసింది. యువతి స్వయంగా తీసుకున్న నిర్ణయం మేరకు, స్వీయ ఆలోచనలతోనే భాగస్వామిని ఎంపిక చేసి కలిసి జీవిస్తోందని కోర్టు గుర్తు చేస్తూ, ఈ నేపథ్యంలోనే తన నిర్ణయాన్ని వ్యక్తపరిచిన యు వతి హక్కును సమర్థిస్తూ సదరు తల్లి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది.

## జూ.ఎన్టీఆర్ భుజానికి సర్జరీ విజయవంతం

### కోలుకోవడానికి రెండు నుంచి మూడు నెలల సమయం: హెల్త్ బులిటెన్ విడుదల చేసిన వైద్యులు



హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త: ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స విజయవంతం అయ్యింది. ఈమేరకు బుధవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో సర్జరీ నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. సర్జరీ అనంతరం ఎన్టీఆర్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఇటీవల జిమ్‌లో ఉండగా ఎన్టీఆర్ భుజానికి గాయం కాగా ప్రత్యేక వైద్య నిపుణుల బృందంతో వర్కింగ్ ఆర్థోస్కోపిక్ శస్త్ర చికిత్స ప్రయోజనకరంగా ఉంటుందని నిర్ధారించామని తెలిపారు. ఈనేపథ్యంలో ఆర్థోపెడిక్ సర్జన్ల బృందం ఆర్.ఎ.పూర్ణచంద్ర తేజస్వి, డా.నితిన్ బెజ్జంకి, డా.మధుసూదన్ రావు, డా.శ్రీనివాస్‌రావు సూరపనేని ఆధ్వర్యంలో ఈ సర్జరీని విజయవంతంగా పూర్తిచేశారని తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ ఇప్పుడు వైద్య పర్యవేక్షణ లో ఉంటారని రెండునుంచి మూడునెలల కాల వ్యవధిలో పూర్తిగా కోలుకుని, తిరిగి సాధారణ కార్యకలాపాలను ప్రారంభిస్తారని తాము ఆశిస్తున్నారని హెల్త్‌బులిటెన్‌లో పేర్కొన్నారు.

మీ అందరి అండతో త్వరలో మీ ముందుకు వస్తా: ఎన్టీఆర్: తన భుజానికి సర్జరీ విజయవంతంకావడంపై కిమ్స్ వైద్య బృందానికి జూనియర్ ఎన్టీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరిఅండతో త్వరలో మీ ముందుకు వస్తా. నా క్షేమం కోరుకున్న అందరికీ కృతజ్ఞతలని ఎక్స్ వేదికగా జూ.ఎన్టీఆర్ పోస్టు పెట్టారు.

## 14 మంది కూలీలకు అస్వస్థత

### ఇద్దరి పరిస్థితి విషమం, ఐసియూలో చికిత్స

#### సుజాతనగర్ మండలం కొత్త అంజనాపురంలో ఘటన

కొత్తగూడెం, ఆగస్టు 12 ప్రభాతవార్త: పంట పొలంలో పురుగుమందు పిచికారీ చేస్తుండగా దాని ప్రభావానికి గురై 14 మంది కూలీలు అస్వస్థతకు గురైన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలో చోటుచేసుకుంది. కొత్త అంజనాపురం గ్రామానికి చెందిన నర్రా అజయ్ పంట పొలంలో రెండు రోజుల క్రితం సుమారు 20 మంది కూలీలు కలుపు తీసే పనులు చేస్తున్నారు. అదే సమయంలో పొలంయజమాని పంటకు పురుగుమందు పిచికారీ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో మందు తుంపర్లు, వాసనకు గురైన కూ లీలు అస్వస్థతకు గురయ్యారు. పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లిన అనం తరం కొందరికి వాంతులు, విరేచనాలు వంటి అనారోగ్య లక్షణాలు కనిపిం చడంతో కుటుంబసభ్యులు వారిని బుధవారం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు 14 మందికి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన 12మంది ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం మెరుగ్గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

## మరింత దిగువకు భూగర్భ జలాలు

### రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఆందోళనకరం

### 145 మండలాల్లో 2 మీటర్లకు పైగా లోతుకు..

#### సగటున 22 సెంటీమీటర్లు తగ్గుదల

హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త: రాష్ట్రంలో గత నెలలో కురిసిన వర్షాలు రాష్ట్రంలో రుతుపవన కాలపు లోటును కొంతమేర పూడ్చడానికి సహాయపడి నప్పటికీ, భూగర్భ జల మట్టాలను పెంచడంలో మాత్రం ఎటువంటి ఉపయోగం కనిపించడం లేదు. జూన్ చివరి నాటికి భూ మట్టానికి 9.46 మీటర్ల దిగువన (ఎంబిజిఎల్) ఉన్న రాష్ట్ర సగటు భూగర్భ జల లోతు, జూలై చివరి నాటికి స్వల్పంగా పెరిగి 9.48 ఎంబిజిఎల్‌కు చేరింది. పదకొండు జిల్లాల్లో భూగర్భ జల మట్టాలు స్వల్పంగా పెరగ్గా, మిగిలిన 22 జిల్లాల్లో మట్టాలు తగ్గాయి. రాష్ట్ర భూగర్భ జల శాఖ అధికారుల వివరాల ప్రకారం, జూలైలో 9.48 ఎంబిజిఎల్ భూగర్భ జల మట్టం, గత ఏడాది ఇదే నెలలోని 8.37 ఎంబిజిఎల్ కంటే ఎక్కువగా ఉంది. రుతుపవనాలకు ముందు నెల అయిన మేలో భూగర్భ జల మట్టాలు 9.26 ఎంబిజిఎల్‌గా ఉండగా, తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సగటున 22 సెంటీమీటర్లు తగ్గినట్లు తెలుస్తోంది. భూగర్భ జలమట్టం ఉపరితలం వైపుగా పెరిగిన 12 జిల్లాలలో, ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా సగటున 2.72 మీటర్ల నీటిమట్టం పెరిగింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా ఆసిఫాబాద్ జిల్లా (1.18 మీటర్లు), మహబూబాబాద్ (99 సెంటీమీటర్లు), మరియు నిర్మల్ (94 సెంటీమీటర్లు) ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లో భూగర్భ జలమట్టాలలో స్వల్ప మెరుగుదల మాత్రమే కనిపించింది. నీటిమట్టాలు తగ్గిన జిల్లాలలో, సూర్యాపేట, రంగారెడ్డి (ఒక్కొక్కటి 1.18 మీటర్లు)లలో ఒక మీటరు లేదా అంతకంటే ఎక్కువ తగ్గుదల నమోదైంది. ఆ తర్వాత మహబూబ్‌నగర్ (1.07 మీటర్లు), మంచిర్యాల (1.01 మీటర్లు)లలో తగ్గుదల ఉండగా, జనగాం, కామారెడ్డిలలో వరుసగా 86 సెంటీమీటర్లు, 67సెంటీమీటర్లు తగ్గుదల నమోదైంది. భూగర్భ జల శాఖ మండలాల వారీగా పర్యవేక్షణ డేటా ఆధారంగా 61 మండలాల్లో 50 సెంటీమీటర్ల వరకు, 55 మండలాల్లో మీటరు వరకు, 112 మండలాల్లో 1 నుంచి 2 మీటర్ల మధ్య, 145 మండలాల్లో ఆందోళనకరంగా రెండు మీటర్లకు పైగా నీటిమట్టం తగ్గినట్లు గుర్తించారు. వీటిల్లో ఆదిలాబాద్ నిర్మల్ మధ్య భాగం, నిజామాబాద్ దక్షిణమధ్య భాగం, కామారెడ్డి పశ్చిమ మరియు ఈశాన్య భాగాలు, భూపాలపల్లి వాయువ్య భాగాలు, సూర్యాపేట దక్షిణ భాగాలు, నారాయణపేట పశ్చిమ భాగాలు, రంగారెడ్డి ఉత్తర భాగాలు, మేడ్చల్ నైరుతి భాగాలు, మరియు భద్రాద్రి కొత్తగూడెం ఉత్తర భాగాలలో ఉన్నాయి.

## నిజాం షుగర్స్‌పై చర్చించాలి: రైతు ఐక్యవేదిక

హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త: రాష్ట్రంలో మూసివేసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేసే అంశంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు దీనికి సంబంధించి ఐక్యవేదిక అధ్యక్షుడు శేరే నర్సారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీలపునరుద్ధరణ సిఫార్సుల కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈమేరకు చెరుకు రైతులు, కార్మికుల నుంచి అభిప్రాయాలు, సలహాలను స్వీకరించి సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించగా 173కోట్లరూపాయలను కేటాయించారని తెలిపారు. అయితే ఫ్యాక్టరీ పునరుద్ధరణ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వం
క్రీడల విభాగం
(యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ క్రింద ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ)
(మానవ వనరుల విభాగం-II)
ప్రధాన కార్యాలయం, గేట్ నెం.10 (ఈస్ట్ గేట్),
జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, లోధీ రోడ్, న్యూఢిల్లీ-110003
ఫైల్.నెం. 01-04001(02)/3/2026-66 తేదీ: 21-07-2026
LPD మైనస్ పెన్షన్ ప్రాతిపదికన అసిస్టెంట్ డైరెక్టర్ (అధికార భాష) ఉద్యోగానికి నియామకం
భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి సంస్థ అయిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI), LPD మైనస్ పెన్షన్ ప్రాతిపదికన ఒక (01) అసిస్టెంట్ డైరెక్టర్ (అధికార భాష) పోస్టును నియామకం కోసం అర్హులైన మరియు ఆసక్తిగల అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి షెడ్యూల్ ఈ క్రింది విధంగా ఉంది:
- ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి ప్రారంభ తేదీ: 23.07.2026
- ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి ముగింపు తేదీ: 22.08.2026
వివరణాత్మక ప్రకటన, అర్హతా షరతులు, నియామక నిబంధనలు, దరఖాస్తు ప్రొఫార్మా మరియు ఇతర సూచనలు SAI వెబ్‌సైట్ www.sportsauthorityofindia.nic.inలో అందుబాటులో ఉన్నాయి.
CBC 47103/11/0021/2627



బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న రూప్‌సింగ్

## ఎలక్ట్రిక్ ఆటోల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

### తెలంగాణ రక్షణ సేన సీనియర్‌నేత రూప్‌సింగ్, మాజీ మంత్రి బోడ జనార్ధన్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 12, ప్రభాతవార్త:** ఆర్టీసీలో ఎలక్ట్రిక్ ఆటోల ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రక్షణ సేన సీనియర్‌నేత రూప్‌సింగ్, మాజీ మంనరితి బోడ జనార్ధన్‌లు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీఆర్టీయూ) అనుబంధ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆటో కార్మికులకు అన్యాయం చేసే 263 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆటోడ్రైవర్ల జీవితాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. ఫ్రీబస్సు పేరుతో ఆటోడ్రైవర్ల పొట్టకొట్టిన ప్రభుత్వం, ఇప్పుడు ఆర్టీసీ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్‌ఆటోలు నడపాలని నిర్ణయించటం అన్యాయమన్నారు. ఆటో డ్రైవర్లతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా బతికి బట్ట కట్టలేదని, తక్షణమే ఎలక్ట్రిక్ ఆటోల నిర్ణయం ఉపసంహరించుకోకపోతే కాంగ్రెస్‌ప్రభుత్వాన్ని ఆటో డ్రైవర్లు పాత రేస్తారని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, వారికి అన్యాయం జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించ బోమని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్లకు మంచి చేయకపోయినా, చెడు చేసే కార్యక్రమం మానుకోవాలని సూచించారు. ఈ ధర్నా కార్యక్రమంలో టీఆర్ఎస్ నేతలు ఆర్.వి. ఆర్.ప్రసాద్, నరేష్ ప్రజాపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మల మనోజ్‌గౌడ్, వీరన్న, ఆటో యూనియన్ నేతలు ఎం.ఎ.నబీల్, నజీరుద్దీన్, మహేందర్ నాయక్, శ్రీధర్, శివప్రసాద్, అబ్దుల్‌గని, టీఆర్టీయూ నేతలు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

## నేడు కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,ఆగస్టు12,ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు మహిళల ఆర్థిక వృద్ధి సాధించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ వెనుక బడిన తరగతుల మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే పథకాన్ని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభం చ నుంది.రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజ కవ ర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను బిసి మహిళలకు అందించనున్నారు. లబ్ధిదారు లపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో కుట్టు మిషన్లను అందజే యడం ఈ పథకం ప్రత్యేకత. గురువారం మధ్యాహ్నం వన్నెండు గంటలకు హైదరాబాద్ లోని డా. బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలోని జి 29లో ఈ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.పథకం విధి విధానాలు, కేటాయించిన బడ్జెట్, లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ రేపు నిర్వహించే కార్యక్రమంలో వెల్లడించనున్నారు. ఈ కార్యక్రమంలో బిసి మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు,బిసి కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన నున్నారు.బిసిమహిళలకు స్వయం ఉపాధి అవకా శాలనుకల్పించి, వారి ఆర్థిక స్వావలంబనకు బాట లు వేస్తూ, మహిళలను ఆర్థికంగా శక్తివంతం చేసే దిశగా ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కీలక ముందడుగుగా నిలవనుంది.

## రుణ భారంతో దంపతుల ఆత్మహత్య, అనాథలైన చిన్నారులు

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** అప్పులు చేసి ఇల్లు ఖరీదు చేసిన దంపతులు ఆ అప్పు తీర్చే మార్గం కనిపించక పోవడంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజామాబాద్‌లో వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం నాగంపేట్‌కు చెందిన శేషాల నరేష్, కోటగల్లికి చెందిన మేఘనకు 2014లో వివాహం జరిగింది. నరేష్ నిజామాబాద్ రూరల్ విభాగంలో ట్రాన్స్‌కో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా మేఘన గృహిణిగా వున్నారు. నరేష్ తండ్రి విద్యుత్ విభాగంలో వుంటూ చనిపోవడంతో కారుణ్య నియామకం కింద అతనికి ఉద్యోగం వచ్చింది. కాగా ఈ దంపతులకు తొమ్మిది, ఎనిమిదేళ్ల ఇద్దరు కుమారులున్నారు. అయితే సొంత ఇల్లు కోసం నరేష్ ఏడాది క్రితం తెలిసిన వారి నుంచి 90 లక్షల రూపాయలు అప్పు చేశాడు. ఇల్లు కొన్న తరువాత అప్పులు తీర్చేందుకు మార్గంకనిపించక పోవడంతో బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలని భావించాడు. అయితే ఇందుకోసం పలు బ్యాంకులను కోరినా ఫలితం కనబడలేదు. మరోవైపు అప్పు లు ఇచ్చిన వారు అసలు, వడ్డీల కోసం నరేష్ దంపతులను వేధించసాగారు. దీంతో ఈ దంపతులు మొదట ఇంటిని అమ్మేసి వినాయక్‌నగర్‌లో అద్దె ఇంట్లో దిగారు.

సొంత ఇంటిని అమ్మగా వచ్చిన డబ్బులతో కొంత అప్పు తీర్చగా ఇంకా చాలా మిగిలి వుండడంతో ఏమీ చేయలేక మంగళ వారం రాత్రి మొదట నరేష్ ఉరివేసుకుని ఆత్మహ త్యకు పాల్పడగా మేఘన పురుగుల మందు తాగి తనువు చాలించింది. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు ఇద్దరిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఇద్దరు మరణించారు. కాగా ఇంట్లో సూసైడ్ నోట్ లభించగా దానిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రుణ భారం వల్లే తాము ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు తెలిపారు. కాగా దంపతులు బలవన్మరణంతో వారి ఇద్దరు కుమారులు అనాథలయ్యారు.

## ఆర్మీ నియామకాల్లో తెలంగాణ యువతకు అవకాశాలు కల్పించండి

### సిఎం రేవంత్‌రెడ్డితో ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ భేటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్ర మాలు నిర్వహించాలని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి. రాజేష్ పుష్కర్‌ను కోరారు. దీనికి సానుకూలంగా స్పందిస్తూ దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకు రాజేష్ పుష్కర్ సుముఖత వ్యక్తం చేశారు. బుధవారం ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి బోది పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. కాగా, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపై పుష్కర్‌తో చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాం తాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తానని లెఫ్టినెంట్ జనరల్ వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరం అని అన్నారు. ఈ భేటీలో మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఏల అప్రమత్తతతో అర్హుల ఓటుహక్కు పదిలం: మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు 12,ప్రభాతవార్త:** బిఎల్‌ఎలు అప్రమత్తంగా ఉంటేను అనామాలిస్ కింద తొలగించాలనుకొనే ఓట్లను తొలగించకుండా అర్హులకు ఓటు హక్కు లభించేందుక మార్గం సుగమం అవుతోందిన టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. పార్లమెంట్ నియోజక వర్గాల సర్ సమీక్షలో భాగంగా బుధవారం హైదరాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గాల ప్రతినిధులతో సమీక్ష జరిగింది. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షినటరాజన్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, ఎన్నికల కమిషన్ కమిటీ చైర్మన్ రాజేష్, సర్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ గంప వేణు తదితరులు పాల్గొని మాట్లాడారు. అలాగే ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ ఈ రోజు గాంధీ భవన్ లో టిపిసిసి ప్రధాన కార్యదర్శులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు పోకుండా వచ్చే రోజుల్లో అప్రమత్తంగా పనిచేయాలని ఆయన కోరారు.

# ఒబిసి జాబితాలో 40 వర్గాలను చేర్చాలి

### జాప్యం లేకుండా ప్రయోజనాలు కల్పించాలి

### ప్రధాన మంత్రికి రాష్ట్ర బిసి కమిషన్ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** కేంద్ర ఇతర వెనుకబడిన తరగతుల జాబితాలో 40న తెలంగాణకు చెందిన వివిధ వర్గాలను చేర్చే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి నిరంజన్ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. ఈ మేరకు దీనికి సంబంధించి బీసీ కమిషన్ బుధవారం ఒక ప్రకటనలో లేఖలోని అంశాలను వెల్లడించింది. 2027 జనాభా లెక్కల ప్రక్రియకు ముందే కేంద్రం ఈ సమస్యలను పరిష్కరించాలని ఆ లేఖలో ఆయన కోరారు. కేంద్ర ఓబీసీ జాబితాలో తమను చేర్చాలని కోరుతూ బీసీ కమిషన్ గతంలో ఇచ్చిన వినతిపత్రంపై స్పందించిన కేంద్రం సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ వాటికి సంబంధించి 40 వర్గాల వివరాలను కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బీసీ కమిషన్ గత నెల 18వ తేదీన వాటి వివరాతో కూడిన జాబితాను పంపించినట్లు వివరించారు. కేంద్ర ఓబీసీ జాబితా నుండి కొన్ని వర్గాలను చేర్చడం లేదా తొలగించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ఎ ద్వారా నియంత్రించబడుతుందని సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ డైరక్టర్ పేర్కొన్నట్లు లేఖలో గుర్తు చేశారు. తెలంగాణ ఇప్పటికే ఆయా వర్గాలను రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చినప్పటికీ కేంద్రం ఇంకా ఆ సమస్యను పరిష్కరించలేదని నిరంజన్ పేర్కొన్నారు.

కొన్ని వర్గాలు 2008లోనే రాష్ట్ర జాబితాలో చేరగా, మరికొన్ని అప్పటి నుండి కేంద్ర జాబితాలో చేరిక కోసం ఎదురు చూస్తున్నాయని వెల్లడించారు. ఈ విషయంపై జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సిబిసి) న్యూఢిల్లీలో రెండుసార్లు విచారణ జరిపిందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. తొలి విచారణలు 2021 డిసెంబరు 22 నుండి 24 వరకూ, రెండో సారి విచారణ 2023 సెప్టెంబర్ 5న జరిగిందన్నారు. అయితే ఆర్టికల్ 342ఎ కింద జరుగుతున్న ప్రక్రియ ఇంకా తుది నిర్ణయానికి రాలేదని చెప్పారు.

ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో ఓబీసీ ప్రయోజనాలు కోరుతున్న తెలంగాణలోని 40 వర్గాల సభ్యులు ఈ జాప్యం వల్ల ప్రభావితం అవుతున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధానమంత్రిని కోరారు. ప్రభావిత వర్గాలు కేంద్ర ఓబీసీ పథకం కింద అందుబాటులో ఉన్న ప్రయోజనాలను పొందగలిగేలా కేంద్రం ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించాలని ప్రధానమంత్రికి రాసిన లేఖలో నిరంజన్ విజ్ఞప్తి చేశారు.

## కెపాసిటర్ బ్యాంకులతో వోల్టేజ్ మెరుగుదల

### ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** కెపాసి టర్ బ్యాంకులతో వోల్టేజ్ మెరుగుదల కావడంతో పాటు, విద్యుత్ నష్టాలు తగ్గుతాయని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కె వరుణ్‌రెడ్డి తెలిపారు.

అంతేకాకుండా వ్యవసాయ ఫీడర్లలో తక్కువ వోల్టేజ్ సమస్యకు కెపాసిటర్ బ్యాంకుల సమర్థవంతమైన పరిష్కారమని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ఒక ప్రకటనలో తమ సంస్థ పరిధిలో సుమారు 14 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉండటంతో గ్రామీణ విద్యుత్ ఫీడర్లపై ఇండక్షన్ లోడ్ అధికంగా ఉండి పవర్ ఫ్యాక్టర్ తగ్గి, విద్యుత్ ప్రవాహం పెరిగి వోల్టేజ్ డ్రాప్ ఏర్పడుతోందన్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా తమ సంస్థ పరిధిలో ఇప్పటికే గత రెండున్నర సంవత్సరాలలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో 2 ఎంవిఎఆర్ కెపాసిటర్ బ్యాంకులు 303, ఒక ఎంవిఎఆర్ కెపాసిటర్ బ్యాంకులు 89 ఏర్పాటు చేశామని చెప్పారు. రైతాంగానికి నాణ్యమైన, స్థిరమైన వోల్టేజ్‌తో విద్యుత్ సరఫరా అందించడంతో పాటు, సాంకేతిక విద్యుత్ నష్టాలను గణనీయంగా తగ్గినాయని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో మోటార్ల కారణంగా ఏర్పడే రియాక్టివ్ పవర్ డిమాండ్‌ను నియంత్రించేందుకు సబ్‌స్టేషన్లు, 11 కేవీ ఫీడర్ల వద్ద కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేశామని చెప్పారు. 392 కెపాసిటర్ బ్యాంకుల ద్వారా పిటిఆర్ సామర్థ్యం ఉపశమనం అవుతోందన్నారు. దీంతో అనేక ప్రాంతాల్లో వెంటనే అదనపు పవర్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఉండదని పేర్కొన్నారు. కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో అదనపు 66 కొత్త పిటీఆర్‌లు ఏర్పాటు అవసరం లేదని, తద్వారా రూ.21 కోట్ల మేర డబ్బు ఆదా అవుతుందని వెల్లడించారు. అలాగే 11 కేవీ ఫీడర్లలో కెపాసిటర్ బ్యాంకులు పెట్టడం వలన సుమారు 82 కోట్ల మేర సాంకేతిక నష్టాలు తగ్గినాయని పేర్కొన్నారు.

అంతేకాకుండా కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటుతో సబ్‌స్టేషన్ల వద్ద పవర్ ఫ్యాక్టర్ కూడా గణనీయంగామెరుగువడుతోందన్నారు. ముఖ్యంగా అగ్రికల్చర్ ఫీడర్లలో తక్కువ వోల్టేజ్ సమస్య రాకుండా కెపాసిటర్ బ్యాంకులు, వోల్టేజ్ బూస్టర్లు పెట్టడం వలన రైతాంగానికి మెరుగైనవోల్టేజ్‌అందుతుందని పేర్కొన్నారు.

## రైతులకు నీళ్లు ఇవ్వకుండా వరుణ యాగాలా?

### మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీష్‌రెడ్డి





**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** నీళ్ల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం, మోసం చేస్తుంది. రెండు నెలలుగా గోదావరి పై బిఆర్ఎస్ పోరాటం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి. జగదీష్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుని పోతుంటే రేవంత్ రెడ్డి మౌనంగా ఉంటున్నాడు. కేసీఆర్ హయాంలో ఆనాడు శ్రీశైలం ఎగువన 10 నుంచి 12 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాడు. ఈ ప్రభుత్వంలో ఒక్క ఎకరాకు నీళ్లు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఎగువ నుంచి కృష్ణాకు బ్రహ్మాండంగా నీళ్లు వస్తుంటే, ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటుంది. పాలమూరు బిడ్డనని చెప్పుకునే రేవంత్ రెడ్డి కన్న తల్లికి ద్రోహం చేస్తున్నాడు అని ఆరోపించారు. నాగార్జున సాగర్‌కు చుక్క నీరు రాకుండా, పోతిరెడ్డిపాడుకు నీళ్లు తరలిస్తున్నారు.25 వేల క్యూసెక్కుల నీళ్లు పోతిరెడ్డిపాడు నుంచి తరలిస్తుంటే.. నాగార్జున సాగర్ చుక్క నీరు వచ్చే పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు నీళ్లు ఇవ్వకుండా పెద్ద కుట్ర చేస్తుంది.రైతులు ఆరుతడి పంటలు వేసుకోండని అంటున్నారు..ఆరుతడి పంటలకైనా నీళ్లే కావాలి కదా అన్నారు. పోతిరెడ్డిపాడుకు నీళ్లు ఇవ్వొద్దని డిమాండ్ చేసే దమ్ముందా.. అని జగదీష్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన 7 ప్రాజెక్టులపై రివ్యూ చెయ్యాలని జిఆర్ ఎంబీ ఎజెండాలో పొందుపరిచారు. బీఆర్ఎస్ మాట్లాడిన తరువాత ఎజెండా అంశాలపై లేఖ రాశారు. జిఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగత్, నల్లమోతు భాస్కర్ రావు, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్ పాల్గొన్నారు.

## మహారాష్ట్ర సిఎస్‌ను కలిసిన సంజయ్ జాజు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ-2047' విజన్ తదితర అంశాలను సంజయ్ జాజు వివరించారు. తెలంగాణ-మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న సత్సం బంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర సహకా రంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సిఎండి శ్రీ సి.ఎస్. శెట్టిను ముంబైలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, 'రైజింగ్ తెలంగాణ-2047' లక్ష్యాలు తదితర అంశాలను ఆయన ఎస్‌బీఐ సీఎండీకి వివ రించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సంజయ్ జాజు వివరించారు.

## ఎమ్మెల్సీ కోదండరాంకు నిరసన సెగ

### ప్రెస్‌క్లబ్‌లో కారును చుట్టుముట్టిన నిరుద్యోగులు

### ఆందోళన కారులను అరెస్ట్ చేసిన పోలీసులు



**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్కు నిరుద్యోగుల నిరసన సెగ తప్పలేదు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లకు ఒసమావేశంలో పాల్గొనేందుకు ఆయన రాగా అక్కడే ఉన్న నిరుద్యోగ సంఘాల నాయకులు ఆయనను చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. ఆయన కారు పార్కింగ్ చేసి ఉండటాన్ని గమనించిన నిరుద్యోగులు కారు ముందు బైఠాయించి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోదండరామ్ డౌన్..డౌన్ అంటూ నినాదాలు చేస్తు కారుముందే బైఠాయించడంతో అక్కడికి పంజాగుట్ట, ఖైరతాబాద్ పోలీసులు హుటాహుటీన తరలి వచ్చి నిరుద్యుగులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా వారు వినిపించుకోకుండా పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. ఖైరతాబాద్ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి నేతృత్వంలో పోలీసులు నిరసన కారులను పోలీసు వ్యాన్లలో బలవంతంగా ఎక్కించి ఖైరతాబాద్ పోలీస్టేషన్కు తరలించారు. .ప్రెస్క్లబ్లో సమావేశం ముగించుకుని బయటకు వచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంను నిరుద్యోగ సంఘాల నేతలు కలిసి తమ సమస్యను వివరించారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన నిరుద్యోగుల సమస్యలను సత్వరమే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లతానని హామి ఇవ్వడంతో శాంతించారు.

## ఎస్సీ గురుకులంలో ఎలుకలు దాడి

### గాయపడిన ఆరుగురు విద్యార్థినులు

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** రాష్ట్రం లోని పలు సంక్షేమ గురుకులాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వాన్నంగా ఉంటున్నాయి. ఎలుకలు, తేళ్లు, పాములు వంటి విష సర్పాలు హాస్టల్ విద్యార్థులను నిద్ర పోనీయడం లేదు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం అడవిమల్లాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులను ఎలుకలు కరిచినట్లు తెలుస్తోంది. హాస్టల్ ఆవరణలో ఎలుకలు దాడి చేయడంతో విద్యార్థులు గాయపడ్డారు. బాధితులైన విద్యార్థులను వైద్య చికిత్స కోసం లంకా సాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు వర్గాలు తెలిపాయి. దీంతో హాస్టల్‌లోని పారిశుధ్యం, భద్రతా పరిస్థితులపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో ఎలుకల సంచారం విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్యం సరిగా లేకపోవడం, నివాస సదుపాయంలో ఉంటున్న వారి భద్రతపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎలుకల బెడదను అరికట్టడానికి, క్యాంపస్‌లో సరైన శుభ్రత, పారిశుధ్యం ఉండేలా చూడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. రెసిడెన్షియల్ పాఠశాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఈ సంఘటన నివాస విద్యా సంస్థలలో పారిశుధ్యం, ప్రాథమిక భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలను లేవనెత్తడంతో, తల్లిదండ్రులు సంబంధిత అధికారుల తక్షణ జోక్యాన్ని కోరుతున్నారు.

## తెలంగాణ రైల్వేకు నెలకు 200 రేక్స్ సమకూర్చాలి

### రీజినల్ రింగ్‌రైలు వికరాబాద్ కృష్ణా రైలుమార్గంకు ప్రాధన్యత ఇవ్వండి

### హైదరాబాద్- చెన్నై బుల్లెట్ రైలు కారిడార్‌లో నకిరేకల్‌ను చేర్చాలి

### రైల్వే మంత్రిని కలిసి వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ ఎంపీలు



బుధవారం న్యూఢిల్లీలో రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినపతిపత్రం అందచేస్తున్న కాంగ్రెస్ ఎంపీలు

**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** తెలంగాణలో సిఎంఆర్ బియ్యం ఎఫ్‌సిఐ వేగంగా సేకరణ చేయడానికి ఇక్కడ గోదాముల్లో ఉన్న స్టోరేజిని వెంటనే తరలించాలని దీనికి 200రేక్స్ నెలకు సమకూర్చాలని తెలంగాణ ఎంపిలు మల్లు రవి నాయకత్వంలో రైల్వే మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం అరకొర రేక్‌లు మాత్రమే ఇస్తున్నారని దీనితో స్టోరేజి సమస్యతో రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు సకాలంలో సేకరణ చేయలేక పోతున్నామని తెలిపారు. 130కిమి నిడివికలిగిన వికరాబాద్ కృష్ణరైల్వే లైనుకు రూ.2730కోట్లు అంచనా వ్యయంతో డిపిఆర్ రైల్వేబోర్డు ముందు ఉందని దానికి మోక్షం కల్పించాలని సూచించారు. హైదరాబాద్ అమరావతి బందర్ పోర్టు మూడువందల కిలో మిటర్ల కారిడార్ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు.హైస్పీడ్‌రైల్వే కారిడార్ హైదరాబాద్ బెంగ్లూర్,హైదరాబాద్-చెన్నై ప్రకటించిన విషయంలో కూడా డిపిఆర్ రూపొందించాలని కోరారు. 363 కి.మి రీజినల్ రింగ్‌రైలు డోర్నకల్ కల్వకుర్తి కల్వకుర్తి మాచర్ల ఇతర రైల్వే ప్రాజెక్టులపై కాంగ్రెస్ ఎంపిలు రైల్వేమంత్రితో చర్చించారు. హైదరాబాద్ -చెన్నై హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్‌లో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని కూడా చేర్చే విషయాన్ని పరిశీలించాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు.ఈ ప్రతిపాదనను అనుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన రైల్వే శాఖను కోరారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


## 63లక్షల ఓటర్లను తొలగించకుండా విచారణ చేయండి

**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 63లక్షల అనోమలీస్ ఓటర్లను తొలగించకుండా క్షేత్రస్థాయిలో పరిపూర్ణ విచారణ చేయాలని, అర్హులైన ఏ ఒక్క వయోజనుడికి ఓటుహక్కు తీసి వేసినా ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచి జరగదని టిపిసిసి ఎలక్షన్ కమి షన్ కోఆర్డినేటర్ పువలిపాటి రాజ్‌కుమార్ కోరారు. ఈమేరకు బుధ వారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారిసి. సుదర్శన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ ఈ ప్రక్రియలో సుమారు 73 లక్షల ఓటర్లులని తొలగించబోతున్నారని గణాంకాలతో వివరించారు.రాష్ట్రంలో 3 కోట్ల 38లక్షల ఓటర్లు ఉండగా అందులో నుండి 73 లక్షలను తొలగించడం అందులో 9,22,230 చనిపోయినవారు,11,25,546 ఆబ్సెంట్/ఆన్ ట్రాసెబుల్, 45,18,961 పర్మనెంట్లీ షిఫ్టేడ్, 6,70,203 ఆల్రెడీ ఎన్రోల్డ్, 1.02.294 అదర్స్ అని తొలిగించడంజరుగుతోందని తెలిపారు. అలాగే సుమారు 63లక్షల ఓటర్లు అనోమలీస్‌లో ఉండడం అసాధరణమైన విషయమని, ఈ ఓటర్లని లోతుగా పరిశీలించకుండా తొలగించకూడదని, రీ వెరిఫికేషన్ చెయ్యాలని విన్నవించారు. 73లక్షల ఓటర్ల వివరాలు బూత్ వారీగా వచ్చాక కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ ప్రతి ఓటర్ ఇంటికి వెళ్లి పరిశీలిస్తారని మీడియాకు తెలిపారు

## పేదలను రోడ్డున పడేసిన రేవంత్ సర్కార్

### లగచర్లలో భూములు ఇవ్వబోమని అడిగిన పాపానికి లంబాడా బిడ్డలను జైల్‌లో పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు



బుధవారం సిద్దిపేటలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్సీ,ఎస్టీ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి...ఇవాళ లక్ష ఎకరాల ఆసైన్డ్ భూములను గుంజుకుని పేదలను రోడ్డున పడేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో బుధ వారం ట్రైబల్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇం డస్ట్రీ(టిఐసిసిఐ) ఆధ్వర్యంలో జరిగిన గిరిజన పారిశ్రామికవేత్తల అవ గాహన సదస్సు చాప్టర్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లగచర్లలో భూములు ఇవ్వబోమని అడిగిన పాపానికి లంబాడా బిడ్డలను జైల్‌లో పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని తెలిపారు. గిరిజనుల భూములను లాక్కుని సిఎం సోదరుడు కొండల్‌రెడ్డి, అల్లుడు సత్యకు కట్టబెట్టుకుం టున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు వెతుక్కునే స్థాయి నుంచి పది మందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా గిరిజన యువతను మార్చాలనే గొప్ప లక్ష్యంతో టిక్కీ పని చేస్తోందని ఆయన అభినందించారు. గిరిజన యువత వ్యాపార రంగంలో ఎద గడానికి ఆత్మవిశ్వాసం పట్టుదల క్రమశిక్షణ చాలా ముఖ్యమని, కష్టపడితే ఎవరైనా విజయాలు సాధించవచ్చునని తెలిపారు. నిజామాబాద్ జిల్లా గవర్నమెంట్ స్కూల్‌లో చదివిన రమేష్ నాయక్ అనే గిరిజన బిడ్డ లండన్‌లో 16 హోటళ్లు స్థాపించి గొప్ప వ్యాపా రవేత్త గా ఎదిగాడన్నారు. కెసిఆర్ నాయకత్వంలో గిరిజన అభివృద్ధి కోసం వందల కోట్ల సబ్సిడీలు ఇస్తూ యువతను పారిశ్రామికవేత్తలుగా తయారు చేశారని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక గిరిజనులకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచారని తెలిపారు. ఎస్టీ కార్పోరేషన్‌కు 3 యేండ్లలో నిధులు విడుదల చేయడం లేదన్నారు. ఎస్టీ కార్పోరేషన్ నిధులు పక్కదారి పట్టించారని, లగచర్ల గిరిజనులకు బేడీలు వేశారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సబ్సీడీలను రాబట్టడానికి కృషి చేయాలని అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షంగా మేం గిరిజనుల పక్షాన పోరాడుతామన్నారు. జిల్లాలోని ఎస్టీ యువతీ యువకులు టిక్కీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కేం ద్రంలోని క్యాంపు కార్యాలయంలో లైట్ మోటార్ వెహికల్స్ అసోసియేషన్ సభ్యులకు బీమా బాండ్లు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల డ్రైవర్లు జాగ్రత్త వహించాలని యోగా, వాకింగ్ చేయాలన్నారు.

# 22ఎ అక్రమాలపై సిబిఐ లేదా ఇడి చేత విచారణ జరిపించాలి

## ఆధారాలతో నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో బహిరంగ చర్చకు సిద్ధం

## బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి సవాల్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి భూ కుంభకోణాలు, అవినీతి అక్రమాలు విపరీతంగా పెరిగిపోయాయని బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేవలం నలుగురు మంత్రులు, నలుగురు గుత్తేదారుల (కాంట్రాక్టర్ల) చేతుల్లోనే పాలన నలిగిపోతోందని, మరోవైపు భూ భారతి పేరుతో వచ్చి ప్రస్తుతం భూహార పేరుతో భూదందాలు సాగిస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అవకతవకలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయించి, బాధ్యులను జైలుకు పంపుతామని, లక్షల కోట్ల రూపాయలు కక్కిస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇప్పుడు ఆ ఫోరెన్సిక్ ఆడిట్ వివరాలను ఎందుకు పబ్లిక్ డొమైన్‌లో పెట్టడం లేదని ప్రశ్నించారు. ఈ ఆడిట్ పేరుతో గత ప్రభుత్వ నేతలను బెదిరిస్తూ, బ్లాక్‌మెయిల్ టాక్టిక్స్ ఉపయోగిస్తూ సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో సెక్షన్ 22ఏ (నిషేధిత జాబితా)ను అడ్డుపెట్టుకుని పేద రైతులు, ప్రైవేట్ భూ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. గతంలో 10 శాతంగా ఉన్న 22ఏ భూముల విస్తీర్ణం, ఇప్పుడు 30 నుండి 40 శాతానికి పెరిగి కోటి ఎకరాలకు చేరుకుందని వెల్లడించారు. రైతులకు చెందిన భూములను ఉద్దేశపూర్వకంగా నిషేధిత జాబితాలో చేర్చి, మంత్రికి 40 శాతం ముడుపులు చెల్లిస్తేనే ఆ జాబితా నుంచి తొలగిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య ఉన్న చీకటి ఒప్పందాల వల్లే ఈ భూములను వదిలేస్తున్నారని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(ఏ) ప్రకారం ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంత్రిగా పదవిలో ఉంటూ తన కుటుంబానికి చెందిన కంపెనీలకు పాలమూరు-రంగారెడ్డి, నారాయణపేట్-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టులు కట్టబెట్టుకోవడమే కాకుండా, రీఎస్టిమేషన్ పేరుతో అంచనా వ్యయాన్ని రూ.1,450 కోట్ల నుంచి రూ.4,350 కోట్లకు పెంచుకున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వానికి బినామీగా ఉన్న సంస్థలు ఇప్పుడు కాంగ్రెస్ నేతలకు బినామీలుగా మారాయని విమర్శించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో జరుగుతున్న భూ లావాదేవీలపై, 22ఏ అక్రమాలపై సీబీఐ లేదా ఈడీ చేత విచారణ జరిపించే ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధారాలు అడుగుతున్నారని, తాను ఆధారాలతో సహా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. నిజాం కాలేజ్ గ్రౌండ్స్ లోగానీ, లేదా ఏదైనా ఛానెల్ స్టూడియోలోగానీ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# శాస్త్రీయ ఆవిష్కరణలు,స్టార్టప్‌ల ఫండింగ్‌కు ప్రైవేట్ భాగస్వామ్యం అవసరం: రాంచందర్‌రావు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు12:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటి వరకు భారత్ ఎంతో ప్రగతి సాధించిందని, ముఖ్యంగా డిజిటల్ ఇండియా, సాంకేతిక అభివృద్ధి మరియు పెట్టుబడుల సాధనలో దేశం మైలురాళ్లను అధిగమించిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు గుర్తుచేశారు. ఎస్‌విపి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సైన్స్ ఫండ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సైన్స్, శాస్త్రీయ ఆవిష్కరణల రంగానికి కూడా తగిన ఆర్థిక సహాయం అందించడం చాలా అవసరమని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిందని, సైన్స్ రంగానికి కేవలం ప్రభుత్వం నుంచే కాకుండా ప్రైవేట్ భాగస్వాముల నుంచి కూడా ఫండింగ్ పెరిగినప్పుడే నూతన ఆవిష్కరణలు, ఎంఎస్ఎంఈ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత దృఢపడుతుందని తెలిపారు.ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని రాంచందర్ రావు అన్నారు. ఇటీవల ప్రారంభించిన యుపిఐ విధానం ద్వారా నేడు ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం డిజిటల్ లావాదేవీలలో ఒక్క భారతదేశానిదే 40 శాతం వాటా ఉండటం మన సాంకేతిక రంగానికి నిదర్శనమని చెప్పారు. ఇటువంటి తరుణంలో ఎస్‌విపి వంటి సంస్థలు ముందుకు వచ్చి నూతన ఆవిష్కర్తలకు, స్టార్టప్‌లకు ఫండింగ్ అందించి ప్రోత్సహించడం అభినందనీయమని, ఇది దేశానికి మరింత ఉజ్జ్వలమైన ఆర్థిక భవిష్యత్తును అందిస్తుందని ఆకాంక్షి స్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సింగరేణిలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ అప్రెంటిస్

# 300 సీట్లకు నోటిఫికేషన్ విడుదల

## దరఖాస్తుకు చివరి తేదీ 16

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్, డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు సింగరేణి గుడ్‌న్యూస్ చెప్పింది. అప్రెంటిస్‌షిప్ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. కంపెనీ 300 మంది సంస్థ ఉద్యోగులతో పాటు ఇతరులకు అవకాశం కల్పించింది. 2023-24 నుంచి 2025-26 మధ్య కాలంలో కోర్సులు పూర్తి చేసిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చని సింగరేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంజినీరింగ్ విభాగంలో 150 మంది, నాన్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు 100, డిప్లొమా పూర్తి చేసిన 50 మందికి అప్రెంటిస్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పించింది. ఇంజినీరింగ్ విభాగంలోని 150 సీట్లలో మైనింగ్‌కు సంబంధించి 40, ఈఈఈ 35, ఈసీఈ 10, ఈఎస్ఈ 10, ఐటీ 5, మెకానికల్ 35, సివిల్ 15 మంది, నాన్ ఇంజినీరింగ్‌లో 100 సీట్లలో బీఏ 25, బీఎస్సీ 30, బీకాం 25, బీఫార్మసీ 10, బీబీఏ 5, బీసీఏ 5, డిప్లొమాకు సంబంధించిన 50 సీట్లలో మైనింగ్ 20, ఈఈఈ 10, మెకానికల్, 10, సివిల్ 10 సీట్లు కేటాయించింది. ఇక అకడమిక్ మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ఈ అప్రంటీస్‌లో సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యం ఇస్తారు. అలాగే అప్రెంటిస్ సమయంలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ అభ్యర్థులకు నెలకు రూ.12,300, డిప్లొమా వారికి రూ.10,900 ఉపకార వేతనం అందిస్తారు. అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు, అవసరమైన ధ్రువపత్రాలు జత చేసి ఈ నెల 16 సాయంత్రం 5 గంటల్లోపు ఏరియాల్లోని గనుల వృత్తి శిక్షణ కేంద్రాల్లో అందజేయాలని నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

# తెలంగాణ వ్యవసాయ విధానాలపై బీహార్ ఆసక్తి

## రైతుల కోసం రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు

## బీహార్ వ్యవసాయ మంత్రితో రాష్ట్ర మంత్రి తుమ్మల



**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి రైతాంగానికి సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. బీహార్ వ్యవసాయశాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా బుధవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీహార్-తెలంగాణ రాష్ట్రాల మధ్య వ్యవసాయరంగంలో పరస్పర సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఉత్తమ విధానాల అధ్యయనం, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భగా తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుబంధు, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్ తదితర కార్యక్రమాల అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా కింద ఎకరానికి 12 వేలు ఇస్తున్నామని తెలిపారు. సన్నాలకు 500 బోనస్ అందిస్తున్నామని, దేశంలోనే అత్యధిక వరి పండించిన రాష్ట్రం తెలంగాణే అని అన్నారు. తెలంగాణలో వరి, పత్తితో పాటు మొక్కజొన్న, కందులు, సోయాబీన్, మామిడి, ఎర్ర మిరప, పసుపు, ఆయిల్ పామ్ తదితర పంటల సాగు విస్తరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని, 2025-26లో 3.11 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉండగా, 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తితో 20.01 శాతం ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో సాధించినట్లు వివరించారు. ఇదే సమయంలో బీహార్‌లో అమలు చేస్తున్న వ్యవసాయ విధానాలు, పంటల వైవిధ్యీకరణ, పంటల క్లస్టర్ల విధానం, సాంకేతిక వినియోగం తదితర అంశాలను బీహార్ మంత్రి విజయ్ కుమార్ వివరించారు. బీహార్‌లో చిన్న, సన్నకారు రైతులు 91 శాతం ఉండగా, వ్యవసాయంపై ఆధారపడే జనాభా 77 శాతంగా ఉందని, వ్యవసాయ ఉత్పత్తుల వైవిధ్యానికి అనుగుణంగా ప్రత్యేక పంటల క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మకానా, మొక్కజొన్న, పండ్లు-కూరగాయలు, తృణధాన్యాల కోసం ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేసి ఉత్పత్తి, విలువ జోడింపు, మార్కెటింగ్ రంగాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా రెండు రాష్ట్రాల్లో రైతులకు ప్రయోజనం చేకూరే పంటల పరస్పర అధ్యయనం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడికి దోహదం చేసుకోవాలని ఇరువులు ఒక అంగీకారానికి వచ్చారు.

# అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి యువతీ యువకులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. యువత ఆలోచనలకు ప్రోత్సాహం, వారి ప్రతిభకు వేదిక, వారి ప్రయత్నాలకు అవసరమైన వనరులను అందిస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలరని పేర్కొన్నారు. పేదరికం, అసమానతలు, నిరుద్యోగం, వాతావరణ మార్పులు, సాంకేతిక పరిజ్ఞానంలోని అంతరాలు వంటి సవాళ్లను అధిగమించేందుకు యువతకు అవకాశాలు, వనరులు, నైపుణ్యాలు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. యువతకు సరైన విద్య, నైపుణ్యం, క్రీడలు, ఉపాధి, నాయకత్వ అవకాశాలు కల్పించినప్పుడే బంగారు భవిష్యత్తును నిర్మించగలం. ప్రజా ప్రభుత్వం యువతకు అండగా నిలుస్తోందన్నారు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్స్ ప్రమాదంలో పడుతున్న పరిస్థితుల్లో బ్లూకాలర్ జాబ్స్ అందిపుచ్చుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. భవిష్యత్ సవాళ్లను అధిగమించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన ఏటీసీలు, స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్ యూనివర్సిటీ వంటివి మంచి ఫలితాలు అందిస్తున్నాయన్నారు. టామ్‌కామ్ ద్వారా సింగపూర్, జపాన్, జర్మనీ వంటి దేశాల్లో అవకాశాలను దక్కించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. యువత వ్యసనాలకు బారిన పడకుండా మాదకద్రవ్యాల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందన్నారు. యువత స్పష్టమైన లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలి. యువతే మన బలం - యువతే మన భవిష్యత్తు. యువతకు శుభాభినందనలు అని సిఎం పేర్కొన్నారు.

# వర్షాలతో అప్రమత్తం:దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితేష్

**హైదరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సంస్థ సిఎండి జితేష్ వి. పాటిల్ సూచించారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ వర్షాల ప్రభావంతో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని సర్కిల్‌లలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వాహనాలను 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన విద్యుత్ సామగ్రి, భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారానికి 1912 కాల్ సెంటర్‌పై వెంటనే స్పందించాలని చెప్పారు. విద్యుత్ తీగలు తెగిపడి కనిపించినా, విద్యుత్ స్తంభాలు లేదా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నా ప్రజలు వాటికి దూరంగా ఉండి వెంటనే సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల భద్రతే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

# ఎఐ విప్లవ భవిష్యత్‌కు దిశానిర్దేశం

## ఎఐ హబ్ స్విట్జర్‌ల్యాండ్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో వేగంగా చోటు చేసుకుంటున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, టెక్నాలజీ నిపుణులు, పారిశ్రామికవేత్తలు, పాలసీ మేకర్లను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించిన ఎఐ హబ్ స్విట్జర్‌ల్యాండ్ సమగ్ర డిజిటల్ ప్లాట్‌ఫామ్ బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా ఆవిష్కృతమైంది. మాజీ ఐటీ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు (కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరై ఈ అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు శ్రీధర్ గాండే, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మహేష్ బిగాలతో పాటు ఏఐ రంగానికి చెందిన ప్రముఖులు, అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు చెందిన ఎన్నారైలు పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏఐ రంగంలో ప్రతిరోజూ వేలాది కొత్త సాధనాలు, పరిశోధనలు, నియంత్రణ మార్గదర్శకాలు వెలువడుతున్నాయి. దీనివల్ల ఏర్పడుతున్న సమాచార గందరగోళానికి పరిష్కారం చూపేలా ఎఐ హబ్ స్విట్జర్‌ల్యాండ్‌ను సమగ్ర ఎఐ రిఫరెన్స్ లాయర్‌గా అభివృద్ధి చేశారు. ఇది కేవలం ఏఐ సాధనాల డైరెక్టరీగా కాకుండా స్టార్టప్‌లు, సంస్థలు, పరిశోధకులు, ఏఐ ప్రొఫెషనల్స్‌కు అవసరమైన సమాచారాన్ని ఒకే వేదికపై అందించే నాలెడ్జ్, కంప్లయన్స్ ప్లాట్‌ఫామ్‌గా పనిచేస్తుంది. ఎఐ హబ్ స్విట్జర్‌ల్యాండ్ ప్లాట్‌ఫామ్‌లో ప్రస్తుతం 15 విభిన్న విభాగాల్లో 125కు పైగా వెరిఫైడ్ ఎఐ టూల్స్ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు వాస్తవ ప్రపంచంలో అమలు చేసిన 50కు పైగా ఎంటర్‌ప్రైజ్ కేస్ స్టడీస్, వాటి ద్వారా సాధించిన పెట్టుబడిపై రాబడి (ఆర్ఓఐ) వివరాలను అందిస్తున్నారు. అలాగే ఈయు ఎఐ యాక్ట్,ఎన్ఐఎస్‌టి స్టాండర్డ్స్ సహా 23కు పైగా గ్లోబల్ ఎఐ గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్స్ సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. సంస్థలు తమ అవసరాలకు అనుగుణంగా ఏఐ టెక్నాలజీలను ఎంపిక చేసుకోవడం, వాటి వినియోగాన్ని అంచనా వేయడం, అంతర్జాతీయ నియంత్రణలకు అనుగుణంగా అమలు చేయడంలో ఈ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడనుంది.

# 18 నెలల గరిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

## 4.45 శాతానికి పెరుగుదల



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం జులైలో మరింత వేగం పుంజుకుంది. వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం జూన్‌లో 4.38 శాతంగా ఉండగా, జులైలో 4.45 శాతానికి పెరిగింది. ఇది గత 18 నెలల్లో నమోదైన అత్యధిక స్థాయి. మార్కెట్ అంచనా వేసిన 4.40 శాతం కంటే కూడా తాజా గణాంకాలు స్వల్పంగా అధికంగా ఉన్నాయి. దీంతో రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా రెండో నెలలోనూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన 4 శాతం లక్ష్యానికి పైనే కొనసాగింది. జులైలో ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణం ఆహార ధరల పెరుగుదల. మరోవైపు ఆహారం, ఇంధన ధరలను మినహాయించి లెక్కించే కోర్ ద్రవ్యోల్బణం మాత్రం కొంతమేర తగ్గింది.5.52 శాతానికి పెరిగిన ఆహార ద్రవ్యోల్బణంఆహార ద్రవ్యోల్బణం జూన్‌లో 5.32 శాతంగా ఉండగా, జులైలో 5.52 శాతానికి పెరిగింది. మొత్తం రిటైల్ ద్రవ్యోల్బణం పెరుగుదలలో ఇది కీలక పాత్ర పోషించింది. ఆహారం, పానీయాల విభాగంలో ద్రవ్యోల్బణం కూడా జూన్‌లోని 5.05 శాతం నుంచి జులైలో 5.24 శాతానికి చేరింది.భారత్ ఆహారం, ఇంధనాన్ని మినహాయించిన కోర్ సిపిఐ ద్రవ్యోల్బణం 4.1 శాతం నుంచి జూలైలో 3.9 శాతానికి తగ్గింది. ఆహారేతర విభాగాల్లో ధరల పెరుగుదల మొత్తం రిటైల్ ద్రవ్యోల్బణాన్ని పైకి నెట్టింది. దుస్తులు, పాదరక్షల విభాగంలో ద్రవ్యోల్బణం 3.23 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. గృహ, యుటిలిటీస్ విభాగంలో కూడా 1.99 శాతం నుంచి 2.16 శాతానికి చేరింది. ఆరోగ్య రంగ ద్రవ్యోల్బణం 1.42 శాతం నుంచి 1.34 శాతానికి తగ్గింది. రవాణా రంగంలో ద్రవ్యోల్బణం మాత్రం 4.31 శాతం నుంచి 4.43 శాతానికి పెరిగింది.

# టాటా గ్రూప్ షేర్లలో భారీ పతనం

## రూ.46 వేల కోట్ల మార్కెట్ విలువ ఆవిరి

**ముంబై, ఆగస్టు 12:** టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ప్రస్తుత పదవీకాలం ముగిసిన అనంతరం మరోసారి ఛైర్మన్‌గా కొనసాగేందుకు తనను తాను ప్రతిపాదించుకోబోనని ప్రకటించడంతో టాటా గ్రూప్ అనుబంధ కంపెనీల షేర్లపై బుధవారం భారీ అమ్మకాల ఒత్తిడి నెలకొంది. దీంతో ఆయా కంపెనీల మార్కెట్ విలువలో సుమారు రూ.46,000 కోట్లు ఆవిరైపో యాయి. పలు టాటా గ్రూప్ షేర్లు 5.95 శాతం వరకు పతనమయ్యాయి. టాటా గ్రూప్‌లో తదుపరి నాయకత్వంపై అనిశ్చితి నెలకొనడం పెట్టుబడిదారుల ఆందోళనకు కారణమైంది. ముఖ్యంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేరు ఎన్ఎస్ఇ లో ఇంట్రాడేలో 5.95 శాతం వరకు పడిపోయి రూ.2,300.10 కనిష్ఠాన్ని తాకింది. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ షేరు సుమారు 4 శాతం క్షీణించింది. టాటా స్టీల్ షేరు 2 శాతానికి పైగా పడిపోయి రూ.183.60 వద్ద ట్రేడైంది. ఇతర గ్రూప్ కంపెనీలైన టాటా ఎలెక్సీ, టాటా కమ్యూనికేషన్స్, టాటా టెక్నాలజీస్, టాటా పవర్, ట్రెంట్ షేర్లు కూడా దాదాపు 2 శాతం వరకు నష్టపోయాయి.

# సెయిలింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో రజతం

## బిసి గురుకుల విద్యార్థినికి మంత్రి పొన్నం సన్మానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** ఇటలీలో జరిగిన అంతర్జాతీయ సెయిలింగ్ పోటీల్లో రజత పతకం సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చిన బిసి గురుకుల విద్యార్థిని ఎస్. రిష్వితను బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. జూలై 30 నుండి ఆగస్టు 7 వరకు ఇటలీలోని గార్డా సరస్సు వద్ద జరిగిన సెయిలింగ్ ఇంటర్నేషనల్ కాడెట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రమోషనల్ క్లాస్ పోటీల్లో రిష్విత రజత పతకం సాధించింది. ఈ పోటీల్లో పాల్గొన్న మరో ఇద్దరు విద్యార్థులను కూడా మంత్రి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న స్పోర్ట్స్ పాలసీలో భాగంగా విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడల్లో పూర్తి ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం రాష్ట్రానికి మాత్రమే కాదు, దేశానికే గర్వకారణమన్నారు. విద్యార్థులు సమయపాలన, సమిష్టి కృషితో రాష్ట్రానికి, భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తున్నారంటే అదితెలంగాణ ప్రభుత్వ గురుకుల విద్యా వ్యవస్థకు దక్కిన గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజెపిటి డబ్ల్యూ సెక్రటరీ బి.సైదులు, బిసి సంక్షేమ శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జంతర్ మంతర్ సీజన్2 త్వరలో: అభిజీత్ దీప్కే

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** కాక్‌రోచ్ జనతా పార్టీ మరో విడత ఆందోళనలకు సిద్ధమవుతోంది. జంతర్ మంతర్ సీజన్2 త్వరలో ప్రారంభం కానుందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. ఢిల్లీలో వాలంటీర్ల సమావేశం నిర్వహించకుండా అధికార బీజేపీ ఒత్తిడి తెస్తోందని ఆయన ఆరోపించారు.గత నెల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన భారీ ఆందోళనలను సిజెపి సీజన్1గా పేర్కొంటోంది.

# రాజ్యసభలో లుంగీ వాలా వ్యాఖ్యల రగడ

## సభాహక్కుల అభిశంసన నోటీసు...

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** రాజ్యసభలో దుస్తుల ప్రస్తావన తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. చర్చ సందర్భంగా తనను లుంగీవాలా అని పిలిచారంటూ సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్, బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్‌పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్షాలు దీనిని దక్షిణాది సంస్కృతిపై జరిగిన దాడిగా అభివర్ణించగా, ఆ ఆరోపణలను సుస్మితా దేవ్ ఖండించారు. సభలో ఇన్‌కమ్ టాక్స్ సవరణ ఆర్డినెన్స్‌పై తీర్మానం ప్రవేశపెడుతున్న సమయంలో తన వెనుక సీటులోకి వచ్చిన సుస్మితా దేవ్, తనను పదే పదే లుంగీవాలా అని పిలిచారని జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. నేను ధోతీ ధరించాను. మలయాళీగా, దక్షిణాది భారతీయుడిగా నేను గర్విస్తున్నాను. ఇలాంటి వ్యాఖ్యలు భారతీయ సంస్కృతిని, ప్రాంతీయ గుర్తింపును హేళన చేయడమే అని బ్రిట్టాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుస్మితా దేవ్ వివరణ - ప్రివిలేజ్ నోటీసు ఈ ఆరోపణలపై సుస్మితా దేవ్ స్పందిస్తూ తాను లుంగీవాలా అనే పదాన్ని వాడలేదని, ఏ రాష్ట్ర సంస్కృతినీ లేదా దుస్తులను అవమానించలేదని స్పష్టం చేశారు.

# భారత్ డీల్‌మేకింగ్ జోరు..

## 11.6 బిలియన్ డాలర్లతో 210 లావాదేవీలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** భారత్‌లో ఒక్కనెలలోనే 11.6 బిలియన్ డాలర్లవిలువైన 210 లావాదేవీలు జరిగాయి. విలీనాలు, కొనుగోళ్లు, ప్రైవేట్ ఈక్విట పెట్టుబడుల పునరుజ్జీవనం కనిపిస్తోంది ఈ ఏడాదిలోనే అత్యంత బలమైన క్యాపిటల్ మార్కెట్ల కార్యకలాపాలు ఇందుకు ప్రధాన కారణమని గ్రాంట్ థార్న్‌టన్ భారత్ నివేదిక వెల్లడించింది.ఎంఅండ్ఏ, పీఈ రంగాలు కలిపి జూలైలో 187 లావాదేవీల ద్వారా 7.3 బిలియన్ డాలర్ల విలువను నమోదు చేశాయి. గతనెలతో పోలిస్తే లావాదేవీల సంఖ్య 15 శాతం, విలువ 73 శాతం పెరిగింది. భారీ వ్యూహాత్మక లావాదేవీలు తిరిగి రావడం వల్ల డీల్ విలువలు గణనీయంగా పెరిగాయని నివేదిక తెలిపింది. ఇందులో బిలియన్ డాలర్లకు పైగా విలువైన మూడు డీల్స్, 100 మిలియన్ డాలర్లకు పైగా విలువైన మరో ఆరు లావాదేవీలు ఉన్నాయి. వీటి మొత్తం విలువ సుమారు 5.7 బిలియన్ డాలర్లు.జూలైలో బిలియన్ డాలర్ స్థాయి ఎంఅండ్ఏ లావాదేవీలు తిరిగి రావడంతో పాటు, ఈ ఏడాది క్యాపిటల్ మార్కెట్లలో అత్యంత బలమైన నెలగా నిలిచిందని గ్రాంట్ థార్న్‌టన్ భారత్ డీల్స్ లైఫ్‌సైకిల్ భాగస్వామి శాంతి విజేత తెలిపారు. జూలైలో ఎంఅండ్ఏ కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. మొత్తం 76 డీల్స్ ద్వారా 6 బిలియన్ డాలర్ల విలువ నమోదైంది. ప్రైవేట్ ఈక్విటీ రంగంలో 111 లావాదేవీల ద్వారా 1.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదయ్యాయి. లావాదేవీల సంఖ్య 9 శాతం పెరిగినప్పటికీ, మొత్తం విలువ 4 శాతం తగ్గింది. చిన్న స్థాయి, ప్రారంభ దశ, వృద్ధి ఆధారిత సంస్థల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ప్రాధాన్యత ఇవ్వడం ఇందుకు కారణమని నివేదిక పేర్కొంది.

# ఇరాన్-అమెరికా యుద్ధం మరింత సుదీర్ఘమయ్యే అవకాశం

## ట్రంప్ పదవీకాలం ముగిసే వరకు కొనసాగిస్తాం: ఇరాన్ అధికారి

**టెహ్రాన్, ఆగస్టు 12:** అమెరికాతో కొనసాగుతున్న ఘర్షణను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవిలో ఉన్నంతకాలం కొనసాగించే వ్యూహాన్ని ఇరాన్ అనుసరించే అవకాశం ఉందని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ సీనియర్ సలహాదారు మొహమ్మద్ రెజా నగ్దీ పేర్కొన్నారు. యుద్ధాన్ని త్వరగా ముగించడం కంటే అమెరికాపై దీర్ఘకాలిక ఒత్తిడి, నష్టాన్ని పెంచేలా ఘర్షణను కొనసాగించడమే లక్ష్యంగా ఉండవచ్చని ఆయన వ్యాఖ్యలు ఇపుడు సంచలనంగా మారాయి. భవిష్యత్తులో ఇరాన్‌పై మరోసారి దాడి చేయాలంటే శత్రు దేశాలు భయపడే స్థాయిలో నిరోధక శక్తిని సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని నగ్దీ తెలిపారు. శత్రువు ఎప్పుడూ ఇరాన్‌పై దాడి చేయడానికి సాహసించకుండా నిరోధక శక్తిని సాధించాలి. అప్పుడే మనం భద్రతతో జీవించగలం అని ఆయన మీడియా ఇంటర్వ్యూలో చెప్పారు.

# భోగాపురంలో ప్రత్యేక విమానం ల్యాండింగ్

## న్యూఢిల్లీ నుంచి వచ్చిన గంటా, ఎంపి సిఎం రమేష్

**విశాఖపట్నం, ఆగస్టు 12ప్రభాత వార్త:** భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకల సందడి మొదలైంది. వాస్తవానికి ఈనెల 17 వ తేదీ తర్వాత రెగ్యులర్ విమాన సర్వీస్ లు ప్రారంభమవుతాయని పౌర విమానయాన శాఖ ప్రకటించింది. అయితే ఆ సమయానికన్నా ముందే ప్రత్యేక విమానాల ల్యాండింగ్ మొదలైంది. ఢిల్లీ నుంచి భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ లు బుధవారం ప్రత్యేక విమానంలో భోగాపురం విమానాశ్రయంలో దిగగా.. మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కామి నేని శ్రీనివాస్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు తదితరులు ప్రత్యేక విమానంలో వెళ్తూ కాకతాళీయంగా కలుసుకున్నారు. ఇక్కడ విమానాల టేక్ ఆఫ్ కు అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలను కల్పిం చారు. అలాగే విశాఖ నుంచి కనెక్టివిటీ కోసం మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఎలివేటెడ్ బీచ్ కారిడార్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఆర్టీసీ 16 ఎలక్ట్రికల్ బస్సులను భోగాపురం విమానాశ్రయం వరకు ఇప్పటికే ట్రయిల్ రన్ నడిపారు. మెట్రో కూడా సాధ్యమైనంత త్వరగా పట్టాలెక్కేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ప్రత్యేక విమానాల రాకపోకలు మొదలవడంతో ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్ గా చెప్పుకునే భోగాపురం విమానాశ్రయం హడావిడి ప్రారంభమై సందడి షురూ అయ్యింది.

# రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఎంపీ వద్దిరాజు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** ప్రతిపాదిత నిజామాబాద్ రైల్వే బైపాస్ లైన్ (నిజామాబాద్, తెలంగాణ) మార్గాన్ని పునఃపరిశీలించాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కోరారు.నిజామాబాద్ రూరల్ మండలం గుప్తాన్‌పల్లి, పాంగ్రా గ్రామాలలో చుట్టుపక్కల భూములను ప్రభావితం చేస్తూ నిజామాబాద్ పట్టణం వెలుపల భూసేకరణ ప్రక్రియలో ఉన్న ప్రతిపాదిత రైల్వే లైన్‌కు సంబంధించి మంత్రిఅశ్వినీ వైష్ణవ్‌ను ఢిల్లీలో బుధవారం సాయంత్రం ఎంపీ రవిచంద్ర కలిసి చర్చించారు.

# బలూచిస్థాన్‌లో పాక్ ఆర్మీ మారణహోమం

**క్వెట్టా, ఆగస్టు 12:** బలూచిస్తాన్‌లో పాకిస్తాన్ ఆర్మీ దారుణ మారణకాండకు పాల్పడుతోంది. అమాయకులైన ప్రజలపై అర్ధరాత్రి వైమానిక దాడులకు దిగింది. అర్ధరాత్రి పాక్ ఆర్మీ జరిపిన వైమానిక దాడిలో 28 మంది పౌరులు మరణించారు. 17మందికిపైగా గాయపడ్డారు. పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలూచిస్తాన్‌లో ప్రజలతోపాటు,ఉద్యమకారులు ఆందోళన చేస్తున్నారు.

# ఎలివేటెడ్ కారిడార్ కోసం ఇళ్లు కోల్పోతున్నారు

## సీఎం రేవంత్ రెడ్డికి రామచందర్‌రావు బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు బహిరంగ లేఖ రాశారు. రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ కోసం ఇళ్లు కోల్పోతున్నారన్నారు. కార్ఖానా, సికింద్రాబాద్‌లో ఇళ్లు కోల్పోతున్న వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. బాధితులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు.

# 131.2 బిలియన్ డాలర్లకు ఎగుమతులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో భారత్ మొత్తం ఎగుమతులు 17.6 శాతం వార్షిక వృద్ధితో 131.2 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని ఇండియా ఎగ్జిమ్ బ్యాంక్ బుధవారం నివేదిక విడుదలచేసింది.

రెండోత్రైమాసికంలో చమురు రహిత ఎగుమతులు 20.3 శాతం పెరిగి 113.8 బిలియన్ డాలర్లకు చేరవచ్చని నివేదిక పేర్కొంది. అలాగే చమురు, రత్నాలు- ఆభరణాలను మినహాయించిన ఎగుమతులు 20.5 శాతం వృద్ధితో 105.8 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, వివిధ దేశాలకు ఎగుమతులను విస్తరించడం, ప్రధాన వాణిజ్య భాగస్వాములతో ఇటీవల కుదిరిన వాణిజ్య ఒప్పందాల వల్ల లభించే అవకాశాలు, భాగస్వామ్య దేశాల్లో బలమైన డిమాండ్ భారత్ ఎగుమతుల వృద్ధికి దోహదపడుతున్నాయని ఎగ్జిమ్ బ్యాంక్ పేర్కొంది.దేశీయ తయారీ రంగం నిరంతర విస్తరణ, మారకపు రేట్లలో చోటుచేసు కునే మార్పులు భారత్ ఎగుమతుల సానుకూల దృక్పథానికి ప్రధాన చోదక శక్తులుగా ఉంటాయని బ్యాంక్ తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో భారత్ ఎగుమతులు 129.6 బిలియన్ డాలర్లతో ఆల్‌టైమ్ త్రైమాసిక గరిష్ఠాన్ని నమోదు చేశాయి.

# సభలో సుదీర్ఘ చర్చకు సిద్ధమే




## స్పీకర్ ఓంబిర్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లేఖ

### విపక్షాలకు తగిన సమాధానమిస్తామని వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** నీట్ పరీక్ష వ్యవహారం పార్లమెంట్ ఉభయ సభలను కుదిపేస్తోంది. పేపర్ లీక్‌పై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా లేఖ రాశారు. నీట్ పేపర్ లీక్‌పై చర్చకు సిద్ధమని చర్చకు ఎంత సమయం కావాలంటే అంత సమయం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో జరిగే చర్చలో తాను స్వయంగా పాల్గొని ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం ఇస్తానని తెలిపారు. చర్చకు ఎన్ని గంటలు లేదా ఎన్ని రోజులు సమయం కేటాయించాలనే విషయాన్ని ప్రతిపక్షంతో సంప్రదించి పరస్పర అంగీకారంతో నిర్ణయించాలని స్పీకర్‌ను కోరారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రభుత్వ తరఫున నీట్ అంశంపై చర్చకు అంగీకరించిన విషయాన్ని బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ప్రస్తావించినట్లు అమిత్ షా తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోపబ్లిక్ ఎగ్జామినేషన్స్ ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్‌మీన్స్ 2026ను ఇప్పటికే చర్చకు తీసుకున్నామని గుర్తుచేశారు. ఆ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఎవరూ నీట్ పరీక్ష అంశాన్ని లేవనెత్తలేదని తెలిపారు. అయినప్పటికీ ఈ అంశంపై మరోసారి చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పార్లమెంట్ వెలుపల బుధవారం మీడియాతో మాట్లాడిన అమిత్ షా ఏ అంశంపైనైనా చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే ప్రతిపక్షం సభ కార్యకలాపాలను అడ్డుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వం దాచాల్సిందేమీ లేదని, పార్లమెంట్‌లో ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పార్లమెంట్‌లో చర్చకు కొన్ని నిబంధనలు ఉంటాయని, కేవలం ప్రకటన చేసి వెళ్లిపోవడం ద్వారా చర్చ జరగదని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి వరకు, అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా నీట్ అంశంపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. దేశ ప్రజల ముందు అన్ని విషయాలు స్పష్టమయ్యేలా ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానని చెప్పారు. పార్లమెంట్‌కు తాను దూరంగా ఉంటున్నానన్న ఆరోపణలను కూడా ఖండించారు. సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి తాను క్రమం తప్పకుండా సభకు హాజరవుతున్నానని, సభలో గందరగోళం కారణంగా చర్చల్లో పాల్గొనే అవకాశం రాలేదని తెలిపారు. నీట్ విద్యార్థుల ఆందోళనలపై సమగ్ర చర్చకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఇప్పుడు చర్చకు సమయాన్ని నిర్ణయించడమే మిగిలిందని పేర్కొన్నారు.

**రాహుల్ గాంధీ కౌంటర్**

మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. అమిత్ షా నుంచి ఎలాంటి ఉపన్యాసం వినేందుకు తాము ఆసక్తిగా లేమని అన్నారు. విద్యార్థుల నిరసనల సమయంలో పెల్లెట్ గన్స్ వినియోగించిన అంశాన్ని ప్రస్తావించారు.

వాటిని ప్రయోగించేందుకు అనుమతి ఎవరు ఇచ్చారో అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ వినియోగానికి ఆదేశాలు స్వయంగా అమిత్ షా ఇచ్చి ఉంటే ఆయన రాజీనామా చేయాలని, ఒకవేళ తాను ఆదేశించలేదంటే హోంమంత్రిగా అసమర్థతకు బాధ్యత వహించి పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అమిత్ షా తన హాజరు గురించి మాట్లాడటంపైనా రాహుల్ స్పందించారు. బుధవారం ఆయన సభకు వచ్చారా లేదా అన్నది తమకు ప్రధాన అంశం కాదని, గత 20 రోజులుగా ఆయన సభకు ఎందుకు దూరంగా ఉన్నారన్నదే తమ ప్రశ్న అని అన్నారు.




## మోడీజీ! మీరు కొంచెం మారారు..

### మోడీ, ఖర్గేలమధ్య సరదా సంభాషణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకురాలు సుప్రియా సూలే కుమార్తె వివాహ విందుకు పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే వంటి వారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నేతలు తమ రాజకీయ విభేదాలను పక్కన పెట్టి సరదాగా కాసేపు మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోడీ, ప్రియాంకాగాంధీ, ఖర్గేల మధ్య సరదా సంభాషణ జరిగింది. ప్రధాని మోడీ ప్రియాంకా గాంధీ గారు మీరు ఎలా ఉన్నారు.? అని ప్రశ్నించారు. దీనికి బదులుగా ప్రియాంకాగాంధీ నేను బాగున్నాను సార్, మీరు ఎలా ఉన్నారు? అని అడిగారు. దీనికి మోడీ స్పందిస్తూ నేను అంతే అంటూ బదులిచ్చారు. ఇదే సమయంలో ఖర్గే చర్చలోకి చేరి ప్రధాని మోడీతో సోదరా మీరు కొంచెం మారారుఅని అన్నారు. దీనికి ప్రధాని మోడీ స్పందిస్తూ అచ్చా అని అన్నారు. దీంతో అక్కడ ఉన్న నేతల మధ్య నవ్వులు విరబూశాయి. దీని తర్వాత ప్రధాని మోడీ అందరికి చేతులు జోడించి అభివాదం చేసి అక్కడి నుంచి వెళ్లారు. ఈ సమయంలో రాహుల్ గాంధీ కూడా అక్కడే ఉన్నారు. మోడీ, ఖర్గే మధ్య జరిగిన సంభాషణను విని రాహుల్ కూడా చిరునవ్వుతో కనిపించారు. ఖర్గే చేసిన మీరు మారిపోయారు అనే వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా డీకోడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏ సందర్భానుసారం ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారా అని ఆలోచిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో విద్యార్థుల నిరసన నేపథ్యంలో జెన్‌జీ యువతను ఆకట్టుకోవడానికి మోడీ సెల్ఫీ తరహా ఇన్‌స్టాగ్రామ్ వీడియోలుచేశారు. ఈధోరణిపై ఖర్గే అన్నారని భావిస్తున్నారు. మరోవైపు, ఈ కార్యక్రమంలో ఎన్సీసీ ఎస్పీ నేత శరద్ పవార్‌తో మోడీ మాట్లాడుతూ కనిపించారు. ఎన్సీపీ ఎస్పీకి చెందిన ఎంపీలు ఎన్డీయే కూటమిలో చేరుతారనే వార్తలు వినిపించిన నేపథ్యంలో ఈ కలయిక ఆసక్తికరంగా మారింది.



## ఒమన్ తీరంలో నౌకపై హౌతీల దాడి

### యుద్ధంలోకి హౌతీల ఎంట్రీ

**సనా, ఆగస్టు 12:** ఇరాన్‌అమెరికా యుద్ధం మరింత ఉద్రిక్తంగా మారుతోంది. ఇప్పుడీ యుద్ధంలోకి హౌతీలు కూడా చొరబడ్డారు. తాజాగా గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో ఒక నౌకపై హౌతీలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆరుగురు మరణించినట్లు యెమెన్ వెల్లడించింది. యెమెన్‌లోని ఉగ్రవాద సంస్థ హౌతీస్. ఈ సంస్థకు ఇరాన్ అండగా ఉంటుంది. అందుకే తాజా యుద్ధంలో ఇరాన్ తరఫున ఈ ఉగ్రవాదులుకూడా పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా తాము మూడు మిస్సైల్స్ ప్రయోగించినట్లు యెమెన్ ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ వివరాల ప్రకారం గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో, ఎర్ర సముద్రం వద్ద ఈజిప్టుకు చెందిన తిహామా అనే నౌకపై హౌతీలు మిస్సైల్ దాడి చేశారు. ఈ ఘటనలో నౌకలోని నలుగురు మరణించారు. వీరిలో ముగ్గురు పాకిస్తానీలు, ఒక ఇండోనేసియన్ ఉన్నారు. ఆ తర్వాత ఈ నౌకలోని వారిని రక్షించేందుకు మరో రెస్క్యూ నౌక వచ్చింది. ఆ నౌకపై కూడా హౌతీలు దాడి చేశారు. ఈ ఘటనలో మరో రెస్క్యూవరు మరణించారు. హౌతీస్ జరిపిన దాడిలో ఇలా ఆరుగురు మరణించారు. ఆయుధాలతో వెళ్తున్న సౌదీ మిలిటరీ నౌకపై కూడా బాబ్ ఎల్‌మాండెబ్ వద్ద దాడి చేశామని హౌతీస్ సంస్థ ప్రకటించింది. ఈ దాడిపై సౌదీ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. మరోవైపు అమెరికా కూడా ఒక కార్గో నౌకపై దాడి చేసింది. పనామాకు చెందిన ఒక కార్గో నౌకకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ స్పందించలేదని, దీంతో అమెరికన్ నేవీకి చెందిన ఎంహెచ్60 హెలికాప్టర్ నుంచి రెండు మిస్సైల్స్ ప్రయోగించామని అమెరికా తెలిపింది. ఈ నౌక ఇరాన్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఈ దాడి చేశామని పేర్కొంది. ఇరాన్ పోర్టులకు ఎలాంటి నౌకలు వెళ్లకుండా జలసంధిని అమెరికా దిగ్బంధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలపై నిషేధం ఉన్నప్పటికీ పనామా నౌక వెళ్లేందుకు ప్రయత్నించడంతో దాడి చేశామని తెలిపింది.

## ప్రైవేటు ఆసుపత్రుల గదుల అద్దెలకు పరిమితి ఉండాలి



### పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** దేశంలోని మెట్రో నగరాల లో ప్రైవేటు ఆసుపత్రులు వసూలు చేస్తున్న గది అద్దెలకు పరిమితి విధించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. ఆయా ఆసుపత్రుల సమీపంలోని 3స్టార్ హోటళ్ల సగటు అద్దె కంటే ఈ ఛార్జీలు అధికంగా ఉండకూడదని స్పష్టంచేసింది. పెరుగుతున్న వైద్య ఖర్చులను అదుపులోకి తీసుకువచ్చి రోగులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కమిటీ ఈ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం తన 176వ నివేదికలో ఈ సిఫార్సులను పొందుపరిచింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల అందుబాటు, స్తోమత పేరిట రూపొందించిన ఈ నివేదికను ఈనెల 7న పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపె ట్టారు. ఆసుపత్రుల్లోని మౌలిక సదుపాయాలు, సేవలను బట్టి గది అద్దెల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని, తక్షణమే వీటిని హేతుబద్ధీకరించాలని కమిటీ సూచించింది. ఈనిబంధన కేవలం ప్రాథమిక గదిఅద్దెకేవర్తిస్తుందని, రెసిడెంట్‌డాక్టర్, నర్సింగ్, భోజనం ఖర్చులను ఆసుపత్రులు అదనంగా వసూలు చేసుకోవచ్చని స్పష్టంచేసింది. జాతీయ నమూనా సర్వే (2025) గణాంకాలను కమిటీ ఈ సందర్భంగా ఉటంకించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సగటు చికిత్స వ్యయం రూ.6,631 గా ఉండగా ప్రైవేటుఆసుపత్రుల్లో అది రూ.50,508గా ఉందని పేర్కొంది. ఉదాహరణకు ముంబైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో సింగిల్ రూమ్ అద్దె రోజుకు రూ.6,000నుంచి రూ.12,000వరకుఉండగా సమీపంలోని 3స్టార్ హోటళ్లలో అది రూ.2,500 నుంచి రూ.4,500 మధ్యే ఉందని నివేదికలో వివరించింది. గది అద్దెలతోపాటు ప్రైవేటు ఆసుపత్రులలోని కీలక చికిత్సలు, వ్యాధినిర్ధారణ పరీక్షల ధరలను కూడా నియంత్రించేలా ఒక చట్టబద్ధ మైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. చికిత్స ప్రారంభించడానికిముందే అంచనావ్యయాన్ని రోగులకువివరించాలని సూచించింది.



## జలశక్తి కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అర్చనావర్మ

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని జల వనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ కార్యదర్శిగా ఐఎఎస్ అధికారి అర్చనా వర్మ నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి) ఆమోదం తెలిపింది. 1995 బ్యాచ్‌కు చెందిన ఆగ్‌మట్ కేడర్ అధికారి అయిన అర్చనా వర్మ ప్రస్తుతం ఇదే శాఖలో అదనపు కార్యదర్శిగా, జాతీయ జల మిషన్ మిషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నీటి నిర్వహణ, ప్రజా పరిపాలన, విధానాల అమలులో ఆమెకు ఉన్న విస్తృత అనుభవం కేంద్ర ప్రభుత్వంలోని కీలకమైన జల వనరుల శాఖకు మరింత ఉపయోగ పడనుంది. విస్తృత పరిపాలనా అనుభవంఅర్చనా వర్మ తన పరిపాలనా ప్రస్థానాన్ని అసోంలోని కర్బీ ఆంగ్‌లాంగ్‌లో సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్‌గా ప్రారంభించారు. అనంతరం గోల్‌పారా జిల్లా మేజిస్ట్రేట్‌గా పనిచేశారు.

ఈ సమయంలో తరచూ సంభవించే వరదలు, శాంతిభద్రతల సమస్యలను సమర్థంగా ఎదుర్కోవడంతో పాటు మహిళల స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహం, అక్షరాస్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అసోంలో గ్రామీణాభివృద్ధి కమిషనర్, కార్యదర్శిగా, గువాహటి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, గోల్‌పారా జిల్లా మేజిస్ట్రేట్‌గా ఆమె వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారు. పట్టణ పరిపాలన, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆమెకు ఉన్న అనుభవం క్షేత్రస్థాయిలో పాలన, ప్రజలకు ప్రభుత్వ సేవల అందుబాటుపై మంచి అవగాహనను కల్పించింది.

## రష్యా మధ్యవర్తిగా మాజీ సిజెఐ చంద్రచూడ్


**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** రష్యా ఆక్రమించిన దేశంలోని కొన్ని ప్రాంతాలలో తాము ఆస్తులు, కార్యకలాపాలను కోల్పోయామని ఉక్రెయిన్ ప్రభుత్వ రంగ సంస్థ ఓషాడ్‌బ్యాంక్ దాఖలు చేసిన కొత్త పెట్టుబడి ఒప్పంద మధ్యవర్తిత్వంలో, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్‌ను రష్యా తన మధ్యవర్తిగా నియమించింది. గ్లోబల్ ఆర్బిట్రేషన్ రివ్యూ (జిఎఆర్) ప్రకారం, 1998 ఉక్రెయిన్ - రష్యా ద్వైపాక్షి క పెట్టుబడి ఒప్పందం కింద ఓషాడ్‌బ్యాంక్ వాదనను విచా రించే ముగ్గురు సభ్యుల మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్‌లో చంద్రచూడ్ ఉంటారు. కోస్టారికాకు చెందిన మధ్యవర్తి దయాలా జిమెనెజ్‌ను ఇరుపక్షాలు సంయుక్తంగా నియమించగా, ఆయన ట్రిబ్యునల్ అధ్యక్షురాలిగా ఉన్నారు. గ్రీకు మధ్యవర్తి, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ అయిన స్టావ్రోస్ బ్రెకౌలాకిస్‌ను ఓషాడ్‌బ్యాంక్ నియమించింది. ఈ నియామకం ముఖ్యమైనది, ఎందుకంటే, ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన మరో రెండు పెట్టుబడి ఒప్పంద కేసులలో తమ మధ్యవర్తిగా వ్యవహరించమని రష్యా గత సంవత్సరం చంద్రచూడ్‌ను సంప్రదించిందని జిఎఆర్‌నివేదించింది. ఆకేసులను జర్మన్ ఇంధన సంస్థ వింటర్‌షాల్ డియా, ఉక్రేనియన్ ఇంధన సంస్థ ఉక్రెనెర్గో దాఖలు చేశాయి. చంద్రచూడ్ ఆ రెండు కేసులలోనూ వ్యవహరించడానికి నిరాకరించారు. శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం వింటర్‌షాల్ మధ్యవర్తిత్వంలో ఆయనను నియామక అధికారిగా నియమించినరోజే రష్యా చంద్రచూడ్‌ను సంప్రదించిందని జిఎఆర్ నివేదించింది.

## టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ రాజీనామా

**ముంబయి,ఆగస్టు 12:** టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆగస్టు 18న జరగనున్న కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.టాటా గ్రూప్‌లో తన 40 ఏళ్ల వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని చంద్రశేఖరన్ తెలిపారు. టాటా సన్స్‌ను గత దశాబ్ద కాలంగా నడిపించే అవకాశం దక్కడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఇది తనకు గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన పదవీకాలం ఫిబ్రవరి 2027 వరకు ఉంది. ఆ తర్వాత మరోసారి చైర్మన్‌గా కొనసాగేందుకు తాను ప్రయత్నించబోనని స్పష్టం చేశారు. వారసుడి ఎంపికను త్వరగా పూర్తి చేసి సజావుగా బాధ్యతల బదలాయింపు జరిగేలా చూడాలని బోర్డును కోరినట్లు వెల్లడించారు.చంద్రశేఖరన్ రాజీనామా వార్తల నేపథ్యంలో టాటా గ్రూప్‌కు చెందిన పలు కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. టాటా పవర్ 1.26 శాతం, టిసిఎస్ 3.9 శాతం, టాటా స్టీల్ 1.83 శాతం చొప్పున పడిపోయాయి. చంద్రశేఖరన్ పదవి కొనసాగింపుపై వాటాదారుల మధ్య నెల కొన్న విభేదాలు, టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటాతో ఆయనకు ఉన్న అభిప్రాయ భేదాలు రాజీనామాకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ఫిబ్రవరి 20, 2027 తర్వాత మరో ఐదేళ్లపాటు తన పదవీకాలాన్ని పొడిగించాలని సర్ దోరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌లు ఏకగ్రీవంగా నిర్ణయించి సిఫారసు చేశాయని చంద్రశేఖరన్ తెలిపారు. ఈ ప్రతిపాదనను టాటా సన్స్ నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ, బోర్డు కూడా సమోదుచేసి సిఫారసుచేశాయని చెప్పారు.



అయితే 2026 ఫిబ్రవరి 24న జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఈ ప్రతి పాదనకు ఒక బోర్డు సభ్యుడు మద్దతు ఇవ్వకపోవడంతో అది ఆమోదం పొందలేదని చంద్రశేఖరన్ వెల్లడించారు. ఏకగ్రీవ మద్దతు లేని పరిస్థితిలో తాను నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని ఎంచుకున్నట్లు తెలిపారు. టాటా సన్స్, టాటా ట్రస్ట్స్ మధ్య బోర్డులో ప్రాతినిధ్యం, గ్రూప్‌వ్యూహం, మైనారిటీ వాటాదారు షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ వైదొలగడం వంటి అంశాలపై విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది.



## షార్ట్‌కట్‌లు నేర్చుకుంటే జీవితం షార్ట్ అవుతుంది

### మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణలో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 12:** ఆత్మకథ పుస్తకాలను యువత చదవాలని, ఇతరుల కష్టాలనుంచి వారు నేర్చుకోవాలని ప్రధాని మోడీ అన్నారు. ఇది రీల్స్ యుగం అని, కానీ కేవలం షార్ట్‌కట్‌లునేర్చుకుంటే, జీవితం షార్ట్ అవుతుందని కూడా ఆయన హెచ్చరించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆటో బయోగ్రఫీ 'ట్రింఫ్ ఆఫ్ ద ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్స్, మై స్ట్రగుల్స్' అనే బుక్‌ను ఇవాళ ప్రధాని మోడీ ఆవిష్కరించారు. ఆ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోవింద్ జీవితం పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కోవింద్ పట్టుదలతో చదివి, రాజ్యాంగ హోదాలో అత్యున్నత స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. రాష్ట్రపతి పదవి నుంచి వైదొలిగిన తర్వాతకూడా కోవింద్ ప్రజా జీవితంలో చురుకుగా ఉంటున్నారని, ఆఫీసు నుంచి తప్పుకున్న తర్వాత ఆయనేమీ రెస్టు తీసుకోలేదని, వన్ నేషన్ వన్ ఎలక్షన్ స్కీమ్‌పై ఆయన వర్క్ చేస్తున్నట్లు ప్రధాని చెప్పారు. భారత ప్రజాస్వామ్యంలో ఆయన చేస్తున్న కృషి కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నదని ప్రధాని తెలిపారు.

## జస్టిస్ వర్మపై అభియోగాలు అన్నీ నిజమే

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ఇంట్లో భారీగా నోట్ల కట్టలు లభించిన కేసులో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేలాడు. అతడిపై మోపిన అభియోగాలు అన్నీ నిజమే అని లోక్‌సభ ప్యానెల్ నిర్ధరించింది. అయితే, ఈ విషయంలో అతడిపై ఏ చర్యలు తీసుకుంటారు అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి, రిటైర్డ్ జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీలోని 30 తుగ్లక్ రోడ్డులోని ప్రభుత్వ భవనాల్లో నివాసం ఉంటున్నాడు. గత యేడాది మార్చి 1415 తేదీల మధ్య అతడి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో కొన్ని ఫొటోలు బయటపడ్డాయి. సంచలన విషయాలు వెలుగు చూశాయి. అగ్నిప్రమాదం జరిగిన యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నోట్ల కట్టలున్నాయి. ఇంటి స్టోర్ రూమ్‌లో ఈనోట్లకట్టలు చాలావరకు కాలిపోయాయి. కొన్ని ధ్వంసమయ్యాయి. అవన్నీ రూ.500 నోట్లకట్టలే. ఈ అంశం వివాదాస్పదం కావడంతో పోలీసులు, ఇతర అధికారులు ఆ ఇంటికి వెళ్లి ఆ ప్రదేశాన్ని సీజ్ చేశారు. అప్పటికే ఇంట్లోని సాక్ష్యాలు తారుమారు అయ్యాయి. ఫొటోల్లో కనిపించిన కరెన్సీ నోట్లు ఆ సమయానికి అక్కడ లేవు. మొదట ఈ నోట్ల కట్టలకు, తనకు సంబంధం లేదని యశ్వంత్ వర్మ చెప్పాడు. అసలు, ఈ నోట్లు తన ఇంటికి సంబంధం లేదని చెప్పాడు. అయితే, ఒక రిటైర్డ్ జడ్జి ఇంట్లో భారీగా నోట్ల కట్టలు కనిపించడం సంచలనంగా మారింది. జడ్జిల అవినీతి అంశం తెరమీదకు వచ్చింది. ఈ అంశంపై విచారణ జరిపేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక ప్యానెల్ ఏర్పాటు చేశారు. ఈ ప్యానెల్.. ఈ అంశంపై విచారణ జరిపింది. పలుమార్లు యశ్వంత్ వర్మను ప్రశ్నించింది. ఈ విచారణ తర్వాత అతడిని ప్యానెల్ దోషిగా గుర్తించింది. ఇందుకు ప్రధాన కారణాలు ఇవి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది అది ఎవరిది ఆ డబ్బు ఎంత ఉంటుంది వంటి వివరాలపై యశ్వంత్ వర్మ సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో తనకు తెలియదన్నాడు. ఇతరులు తన ఇంటిని అక్రమంగా వాడుకునే అవకాశం ఉందని, ఎవరో తనకు తెలియకుండా డబ్బు తన ఇంట్లో పెట్టారని వర్మ చెప్పాడు. తనపై కుట్ర చేసి ఎవరో ఆ నోట్లు తన ఇంట్లో పెట్టారని చెప్పాడు.

## హార్ముజ్‌పై సంపూర్ణ పర్యవేక్షణ అమెరికాదే: ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 12:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. ఆ దేశంతో జరుగుతోన్న చర్చలపై తమకు నమ్మకం లేదని, వారు ఎప్పుడూ తనకు అబద్ధాలే చెబుతారని అన్నారు. హార్ముజ్ జలసంధి పై సంపూర్ణ నియంత్రణ అమెరికాకే ఉందని అన్నారు. ప్రస్తుతం జలసంధి తమ అధీనంలోనే ఉందని చెప్పారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గినా, దుందుడుకు చర్యలకు పాల్పడినా కఠిన ప్రతిస్పందన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హార్ముజ్ జలసంధిలో ఒమన్ వద్ద ఓ నౌకపై అమెరికా దాడి చేసింది. ఇరాన్ రేవులపై తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘించడంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపింది. పనామా జెండా కలిగిన 'వేలా నోవ్హా కార్గో నౌకపై నేవీ హెలికాప్టర్ రెండు హెల్‌ఫైర్ క్షిపణులను ప్రయోగించిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ దాడిలో సిబ్బంది ఎవరైనా గాయపడ్డారా అనే విషయాన్ని వెల్లడించలేదు. హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో పనామా కాల్వలో నౌకల రద్దీ పెరిగినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో ఎల్‌నినో ప్రభావంవల్ల కాలువలో నీటి మట్టం తగ్గుతున్నట్లు పేర్కొన్నాయి. దాంతో దానిగుండా ప్రయాణించే ఒక్కో వాణిజ్య నౌక నుంచి పనామా కాలువ అథారిటీ నాలుగుమిలియన్ డాలర్లు వసూలు చేస్తున్నట్లు తెలిపాయి. ఓ భారీ నౌక పనామా దాటాలంటే 10 రోజులు వేచి ఉండాల్సి వస్తోంది.

## సంక్షిప్త వార్తలు

### అరుణాచల్‌లో భారత్ చైనా సైనికుల సరిహద్దుఘర్షణ



**ఇటానగర్, ఆగస్టు 12:** ఇండియా-చైనాల మధ్య మరోసారి ఉద్రిక్త వాతావరణంఏర్పడింది. ఇరుదేశాల సైనికులు సరిహద్దులో పరస్పరం ఘర్షణకు దిగినట్లుతెలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని భారత సరిహద్దు ప్రాంతం లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్‌ఎసి)వద్ద గత నెలలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఒక ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. దీనిపై భారత సైన్యం, ప్రభుత్వం మాత్రం అధికారికంగా స్పందించలేదు. గతనెల 26న ఈ ఘటన జరిగింది.

### చార్‌ధామ్ యాత్రకు పోటెత్తిన భక్తులు

**డెహ్రాడూన్, ఆగస్టు 12:** ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తుతున్నారు. వర్షాకాలం కారణంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ యాత్రికుల సంఖ్య రికార్డు స్థాయిలో నమోదవుతోంది. ఈ యాత్రా సీజన్ ప్రారంభమైన 114 రోజుల్లోనే మొత్తం 47,02,703 మంది భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 4,68,556 అధికం కావడం విశేషం. ఈ ఏడాది యాత్ర సరికొత్త రికార్డును నెలకొల్పే దిశగా సాగుతోంది. భక్తుల భద్రతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్ సింగ్ ధామి స్పష్టంచేశారు.

### బాలి సమిపంలో సముద్రంలో పడవలో మంటలు

**బాలి, ఆగస్టు 12:** ఇండోనేషియాలోని బాలి సమీపంలో ఓ ఓడలో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దాంతో ఆ ఓడలోని 172 మంది అందులో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు 131 మందిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ఒకరు మరణించారు. మిగతా వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సముద్రంలో పెద్ద ఎత్తున అలలు ఎగసిపడుతుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు.

### 250 దాటిన కొలంబియా భూకంప మృతులు


**పెరిరా, ఆగస్టు 12:** కొలంబియాలో భూకంప మృతుల సంఖ్య 250 దాటింది. సోమవారం 7.4 తీవ్రతతో ఆ దేశాన్ని భూకంపం షేక్ చేసిన విషయం తెలిసిందే. పెరిరా, కాలి ప్రాంతాల్లో భారీ సంఖ్యలో భవంతులు నేలమట్టం అయ్యాయి. ఆ శిథిలాల కింద ఇంకా వందల సంఖ్యలో జనం చిక్కుకుని ఉంటారని భావిస్తున్నారు. పర్వత ప్రాంతమైన పశ్చిమ కొలంబియాలో ప్రస్తుతం ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. ఆ ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్లు, ఇండ్లు, స్కూళ్లు, హెల్త్ సెంటర్ల భవనాలన్నీ పగుళ్లు వచ్చాయి. వేర్వేరు నగరాల్లో నమోదు అయిన డేటా ప్రకారం ఇప్పటి వరకు 254 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది.

### కావేరీ నీటి వివాదం: విచారణ 17కి వాయిదా

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** కావేరీ నీటి విడుదలపై 'కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిట్టీ (సిడబ్ల్యుడబ్ల్యుఎ) తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేలా కర్ణాటకను ఆదేశించాలని కోరుతూ తమిళనాడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 17కి వాయిదా వేసింది. ఆగస్టు 13న ఈ అంశాన్ని విచారించాల్సి ఉన్న జస్టిస్ విక్రమ్ నాథ్ అనారోగ్యానికి గురయ్యారని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తెలిపారు.

### జపాన్‌పై ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

**టోక్యో,ఆగస్టు 12:** ఉత్తర కొరియా సైనిక చర్యలు అనూహ్యంగా ఉంటాయి. తాజాగా జపాన్‌పైకి ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ఉత్తర కొరియా తన తీర ప్రాంతం నంచి జపాన్‌పైకి ఒక మిస్సైల్‌ను పరీక్షించింది. వోన్సన్ ప్రాంతంలోని ఉత్తర తీరం నుంచి ప్రయోగించిన ఈ మిస్సైల్ జపాన్ స్పెషల్ ఎకనామిక్ జోన్ సమీపంలో పడ్డట్లు జపాన్ ప్రభుత్వం తెలిపింది.




అత్తారింటికి దారేది? అత్తింట్లో వోటేది? ఈ రెండు ప్రశ్నలకు సమాధానం అంత తేలికగా చెప్పడం కష్టమే. ఒకవేళ దారి దొరికినా అత్తింట్లో వోటు, ఆమె మనసులో సంపాదించేందుకు పెద్ద సవాలేనని, మగువలు ఎంతో కష్టపడాలి అక్కడ సర్దుకు పోవడం పెద్ద సవాలేనని, అందుకే భారతీయ మహిళలకు వివాహం మూన్నాళ్ల ముచ్చట కాకూడదని మనసారా కోరుకునే పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్, రిటైర్డ్ ఐపిఎస్ అధికారిణి డాక్టర్ కిరణ్‌బేడి

# పెళ్లంటే మమకారపు 'బేడీ'లా ?

'పెళ్లి' తదనంతర జీవితం, ఎదురయ్యే సవాళ్ల గురించి ఓ పాడ్‌కాస్ట్‌లో ప్రత్యేకించి ప్రస్తావించారు. ఇంటి పనులు భర్తతో పంచుకోవాలని, ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలని సలహాఇచ్చారు. భారతీయ మహిళలకు వివాహం అంటే వేడుక కాదు, అదొక పెద్ద ట్రామా (మానసిక గాయం) ఇదీ ఆమె వ్యాఖ్యల సారాంశం. ఆమె ఇంకా మాట్లాడుతూ 'పెళ్లిళ్ళ చూడటానికి పండగలా కనిపించినా, సురక్షితమైన పుట్టింటిని వదిలి కొత్త వాతావరణంలోకి వెళ్లడం మహిళలకు తీవ్రమైన భావోద్వేగ, మానసిక సవాళ్లను తెచ్చిపెడుతుందని అన్నారు. కొత్తగా పెళ్లయిన కోడలు అత్తమామలను సొంత తల్లిదండ్రుల్లా చూడాలని, భర్త కుటుంబ వాతావరణానికి పూర్తిగా అలవాటు పడాలని, తన ఇష్టాలతో సంబంధం లేకుండా గృహిణి పాత్రను స్వీకరించాలని సమాజం ఆశిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ అంచనాల గురించి పెళ్లికి ముందే జంటలు ఎందుకు చర్చించుకోవని ఆమె ప్రశ్నించారు. పెళ్లి తర్వాత కూడా ఉద్యోగం కొనసాగిస్తామని, అవసరమైతే ఇంట్లో సహాయానికి మనిషిని పెట్టుకుంటామని, ఇంటి పనులను భర్తతో పంచుకుంటామని మహిళలు ధైర్యంగా చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందని అన్నారు. పెళ్లి తర్వాత చాలా మంది మహిళలు వృత్తిని వదిలేస్తున్నారని కిరణ్ బేడీ ఆవేదన వ్యక్తం చేశారు. వివాహం, పిల్లలు పుట్టిన తర్వాత మహిళా ఉద్యోగుల సంఖ్య తగ్గడానికి ఇదే కారణమని ఆమె విశ్లేషించారు. అత్తారింట్లో మద్దతు లభించని పక్షంలో ఆర్థిక స్వాతంత్ర్యంతో ధైర్యంగా తల్లిదండ్రుల వద్దకు తిరిగి వెళ్లడానికి సంకోచపడరాదని సమాజం అలాంటి నిర్ణయాలను సానుకూల దృక్పథంతో ఆహ్వానించాలన్నారు.

# మీగడతో..



ముఖం అందంగా ఉండాలంటే పార్లర్‌ల వద్దకే వెళ్లాల్సిన పనిలేదు. మన ఇంట్లో దొరికే వాటితోనే చక్కటి నిగారింపును సొంతం చేసుకోవచ్చు. పైగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అందు కోసం ముఖంపై కాస్త శ్రద్ధ పెట్టి ఇంట్లో ఉంటే సహజసిద్ధమైన వాటిని అప్లై చేసి మచ్చలేని చందమామలా ఉండే ముఖాన్ని సొంతం చేసుకుండి. అందుకు ఈ సింపుల్ రెమిడీస్‌ని ఫాలోకండి. రోజూ పెదవులకు కాస్తంత మీగడ రాసిన సున్నితంగా మర్దన చేస్తే పదవులు పగడలకుండా గులాబీ రేకుల్లా మెరు స్తాయి. ముఖాన్ని రోజుకు రెండు మూడు సార్లు గోరువెచ్చటి నీటితో కడుక్కుని పొడి టవల్‌తో చక్కగా తుడిచేస్తే మొటిమల వంటివిరావు. లేత కొబ్బరిని మెత్తగా మెదిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తుంటే ముఖం చక్కగా అందంగా కనబడుతుంది. రకరకాల షాంపూల బదులు కుంకుడుకాయ రసం లేదా సీకాయపొడితో తలస్నానం చేయడం వల్ల చుండ్రు, కేశ సంబంధమైన సమస్యలు రాకుండా జుట్టు ఆరోగ్యంగా నిగనిలాడుతుంది. తల స్నానం పూర్తయిన తర్వాత, చివరి మగ్గు నీటిలో కొంచెం నిమ్మరసం కలిపి తలమీద పోసుకుంటే జుట్టు, చర్మ సమస్యలు రావు.

# ఒకరికి ఒకరం !



ప్రస్తుతం ఫోన్ అందరి జీవితంలో భాగమై పోయింది. దీని మాయలో పడి చుట్టూ ఉన్నవాళ్లని పట్టించు కోవడం లేదు. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య గొడవలకు కారణం మొబైలే అంటున్నారు. వివాహ బంధాలు బల హీన పడడానికి సోషల్ మీడియా, సాంకేతి కత చాలా వరకూ కారణం అవుతున్నాయి. రోజులో సంగంపైనే ఫోన్‌లో వీడియోలు చూడటం, చిన్న విషయాలకు మెసేజ్, మెయిల్ రూపంలో సమాధానం ఇచ్చు కోవడం వల్ల ఇద్దరిమధ్యా కమ్యూనికేషన్ తగ్గుతుంది. తిరిగి అడిగినదానికి అనాసక్తిగా సమాధానాలు చెబితే కోపాలు తలెత్తుతాయి. భాగస్వామితో సంభాషించేటప్పుడు ఫోన్‌ను దూరంగా ఉంచండి. ఇది ఇద్దరిలో సఖ్యతను పెంచుతుంది. సోషల్ మీడియాలో ఇతరులతో పరిచయాలు పెంచుకుంటే అది భాగస్వామిలో అసూయకీ, అపనమ్మకానికీ దారితీస్తుంది. ఫలితంగా సంబంధాలూ దెబ్బ తింటాయి. కాబట్టి ఇద్దరి మధ్య అపార్థాలు రావద్దు అంటే మీ పరిచయాలు గురించి మీ భాగస్వామితో చెప్పండి. దాంతో మీ దాంపత్యం దృఢంగా మారుతుంది. వారాంతంలో కుటుంబంతో సమయం గడపకుండా ఫోన్ చూస్తుండడం వల్ల ఇద్దరి మధ్య ప్రేమ తగ్గుతూ పోతుంది. సెలవురోజు అయినా కాస్త భాగస్వామితో బయటకు వెళ్లడంకలిసి భోజనం చేయడం వంటివిమీ బంధాన్ని ఆరోగ్యంగా ఉంచు తాయి.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

# వ్యథ: ధ్యానం కంటే దృక్పథం ముఖ్యం !

ప్రశ్న : నా వయస్సు 64 ఏళ్లు. నాకు బీపీ, మధుమేహం, గ్యాస్ సమస్యలు ఉన్నాయి. నిద్ర లేమితో బాధపడుతున్నాను. దీనికి మందులు వాడుతున్నాను. చిరాకు, కోపం, విసుగు వెంటాడు తున్నాయి. మా వారు ప్రభుత్వ ఉద్యోగిగా రిటైర్ అయినప్పటికీ, అనుకున్నంత సంపాదించలేక పోయారు. డబ్బు ఉన్నా మా చెల్లి, తమ్ముడితో పోలిస్తే సగం కూడా ఉండదు. నా కొడుకు కంటే అల్లుడే బాగా సంపాదిస్తాడు. ఇవన్నీ తలుచుకుంటే బాధేస్తుంది. దీంతో ప్రతికూల భావాలు పెరిగాయి. ఒక యోగా నిపుణుడి వల్ల ధ్యానం, చైనా యోగాసనాలు నేర్చుకున్నాను. రోజూ ఉదయం నాలుగు గంటలకు లేచి గంటసేపు యోగా, ధ్యానం సాధన చేస్తున్నాను. అయినా నా సమస్యలు తగ్గలేదు. నా మనసు ప్రశాంతంగా ఉండేందుకు సలహాలు ఇవ్వండి.

– ఒక సోదరి, తిరుపతి



జవాబు: అమ్మా! మనశ్శాంతికి ధ్యానం మంచిదే. అయితే జీవితాన్ని చూసే దృక్పథం కూడా చాలా ముఖ్యం. పొంగే పాలపై నీళ్లు చల్లడం కంటే మంట తగ్గించడం మేలు. అలాగే సమస్యలపై ఆలోచనలను ఆపడంకంటే వాటిపట్ల మన దృక్పథాన్ని మార్చుకోవడం మంచిది. మీరు చేస్తున్న యోగా, ధ్యానం అభినందనీయం. అయితే అవి చేస్తున్నప్పటికీ మనసులో ఇతరులతో పోల్చుకోవడం కొనసాగితే ప్రశాంతత పూర్తిగా లభించదు. 'నా దగ్గర ఎంత ఉంది?' అని భావించడం కంటే 'నా దగ్గర ఉన్నదానితో నేను ఎంత సంతోషంగా జీవిస్తున్నాను?' అనే ఆలోచన పెంచుకోండి. చెల్లి, తమ్ముడి సంపదతో, కొడుకు, అల్లుడి సంపాదనతో మీ జీవితాన్ని పోల్చుకోవడం మానేయండి. ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి జీవన ప్రయాణం వేరు. వారి సంపాదన, జీవన విధానం, లక్ష్యాలు వేరుగా ఉంటాయి. ఈ వయసులో సంపాదన కంటే ఆరోగ్యం, ఆత్మీయ సంబంధాలు, ప్రశాంతమైన జీవితం ముఖ్యమైనవి. గతాన్ని తలచుకుని బాధపడటం, భవిష్యత్తును ఊహించి భయపడటం రెండూ వర్తమాన ప్రశాంతతను దూరం చేస్తాయి. అలాగే ఉదయం నాలుగు గంటలకు లేవడం తప్పనిసరి కాదు. రాత్రి తగినంత నిద్రపోయిన తర్వాతే యోగా, ధ్యానం చేయండి. మీ వయసులో సాధారణంగా ఏడు నుంచి తొమ్మిది గంటల నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. ఉదయం ఆరు, ఏడు గంటల తర్వాత లేదా సాయంత్రం యోగా, ధ్యానం చేసినా నష్టం లేదు. రోజూ కొంతసేపు నచ్చిన వారితో మాట్లాడండి, ప్రకృతిలో నడవండి, ఇష్టమైన పనులు చేయండి. మనసుకు ఉల్లాసం కలిగించే అభిరుచులను ఎంచుకోండి. మందులు క్రమబద్ధంగా వాడండి. తేలికగా జీర్ణమయ్యే సమతుల ఆహారం తీసుకోండి. ధ్యానం మనసును ప్రశాంతపరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది. దృక్పథం జీవితాన్ని మార్చి, ఒత్తిడి కారకాల ప్రభావాన్ని తగ్గిస్తుంది. అందుకే ధ్యానం కంటే దృక్పథం ముఖ్యం అని గుర్తించండి. అవసరమైతే మానసిక ఆరోగ్య నిపుణుడిని సంప్రదించి కౌన్సెలింగ్ తీసుకోవడం కూడా మంచిదే.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామి



శ్రీవల్లీ దేవసేనలతో కలిసి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి పూజలు అందుకునే క్షేత్రాలు ఎన్నో వున్నాయి. అలాంటి పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా మల్లామ్ కనిపిస్తుంది. సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాల్లో మల్లామ్ విశిష్టమైనదిగా .. విశేషమైనదిగా చెప్పుకోవచ్చు. నెల్లూరు జిల్లా పరిధిలో ఈ గ్రామం కనిపిస్తుంది. శ్రీవల్లీ దేవసేనలతో కలిసి స్వామివారు ఇక్కడ ఆవిర్భ వించారు. ఇక్కడ స్వామివారు ప్రత్యక్షంగా ఉన్నారనీ .. ఆయన మహిమాన్వితుడని భక్తులు విశ్వసిస్తుంటారు. ఈ క్షేత్రంలో అడుగుపెట్టడంతోనే సర్ప దోషాలు తొలగిపోతాయని చెబుతారు. స్వామివారి దర్శనంతో కుజ దోషాలు తొలగిపోతా యని అంటారు. సంతానం లేక బాధపడేవారు, స్వామివారి ధ్వజా రోహణం రోజున ప్రత్యేక ప్రసాదాన్ని స్వీకరిస్తుంటారు. ఆయన అనుగ్రహంతో ఎంతోమంది సంతానాన్ని పొందినట్టుగా చెబుతారు. మొండి వ్యాధులతో బాధపడేవారు స్వామివారికి అనునిత్యం ప్రదక్షిణలు చేయడం వలన, ఆ వ్యాధుల నుంచి బయటపడతారని భక్తులు అనుభవపూర్వకంగా చెబుతుంటారు. స్వామివారి అనుగ్రహంతో ఆపదలు, అనారోగ్యాలు తొలగిపోతాయనీ, సకల శుభాలు చేకూరతాయని విశ్వసిస్తుంటారు.

# పల్లీ పకోడి



**తయారీ విధానం:**
ఒక గిన్నెలో పల్లీలు, బియ్యపు పిండి, శనగ పిండి, కారం, చాట్ మసాలా, గరం మసాలా, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుని పల్లీలకు పిండి బాగా పట్టేలా గట్టిగానే కలుపుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి, వేయించడానికి సరిపడా నూనెపోసి, వేడయ్యాక పిండితో ఉన్న పల్లీలను విడివిడిగా వేస్తూ దోరగా కాల్చుకుంటే కరకరలాడే పల్లీల పకోడి సిద్ధం.

**తయారీ విధానం:** ఒక గిన్నెలో పల్లీలు, బియ్యపు పిండి, శనగ పిండి, కారం, చాట్ మసాలా, గరం మసాలా, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుని పల్లీలకు పిండి బాగా పట్టేలా గట్టిగానే కలుపుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి, వేయించడానికి సరిపడా నూనెపోసి, వేడయ్యాక పిండితో ఉన్న పల్లీలను విడివిడిగా వేస్తూ దోరగా కాల్చుకుంటే కరకరలాడే పల్లీల పకోడి సిద్ధం.

# తెర

## 'అగధ' మంచి విజయం సాధిస్తుంది: ఎం.ఎస్.రాజు



**'అగధ' అంటే ఏంటి?..**
'అగధ' అని టైటిల్ పెట్టగానే చాలా మంది నెట్‌లో సర్చ్ చేశారు. అగధ అంటే లోతైన అంశం, ఓ శూన్యం అని చెప్పుకోవచ్చు. మనం దేవుడ్ని, దెయ్యాలను కంటితో చూడలేదు. అలాంటి ఫోర్స్‌లకు మధ్య జరిగే కథ అగధ.

**'అగధ' కోసం మీరు చేసిన రీసెర్చ్ గురించి చెప్పండి?..**
'అగధ' కోసం చాలా రీసెర్చ్ చేశాను. చాలా చోట్ల తిరిగాను. అవన్నీ కూడా ఆడియెన్స్‌కి అవసరం లేదు. ఇదొక ఆర్ట్ ఫిల్మ్‌లా కాకుండా అందరినీ రంజింపజేసేలా రూపొందించాను. నేను చూసిన రియాల్టీకి నా ఫ్యాంటసీని జోడించి ఓ మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వాలని తీశాను.

**మీరు సడెన్‌గా సినిమాల్ని నిర్మించడం ఆపేశారు.. ఎందుకు?..**
'ఆట', 'మస్కా' మంచి చిత్రాలు. కమర్షియల్‌గా విజయాలు అందుకున్నాను. కానీ నా స్టాండర్డ్‌లో లేవు అని చాలా మంది అన్నారు. ఆ తర్వాత మా అబ్బాయి కెరీర్ మీద కూడా ఫోకస్ పెట్టాను. చాలా ఏళ్ల తర్వాత 'డర్టీ హరి'ని తీశాను. అది నా టేస్ట్‌కి పూర్తి భిన్నంగా ఉంటుంది. నా జర్నీలో ఎప్పుడూ కూడా కొత్త కథలకే ఓకే చెబుతూ వచ్చాను.

**'అగధ' చిత్రం విజయంపై భారీ నమ్మకంతో ఉన్నారు?..** నేను ఇంత వరకు స్టేజ్ మీద అలా ఓపెన్‌గా సినిమా బాగుంది అని స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. కానీ 'అగధ' చూసిన తర్వాత సినిమా బాగుంది, విజయం సాధిస్తుందని నా మనసుకి అనిపించింది.

**'అగధ' వీఎఫ్‌ఎక్స్ వర్క్ ఎలా ఉంటుంది?..** నేను ప్రతీ ఫ్రేమ్ మీద ఫోకస్ పెడతాను. నాకు క్లారిటీ వస్తే తప్పా ముందుకు వెళ్లను. నేను తీసిన ప్రతీ చిత్రంలో నా ఇన్వాల్వ్‌మెంట్ ఉంటుంది. ప్రతీ క్రాఫ్ట్ గురించి ఆలోచిస్తాను. నేను నిర్మాతగా ఉన్నప్పుడు కూడా దర్శకులతో కథా విషయంలో చర్చించేవాడ్ని. వాళ్లు కూడా నా సలహాలను తీసుకునేవారు.

**'అగధ'డిస్ట్రిబ్యూషన్ గురించి చెప్పండి?..** అగధ'ని ముందు ఎవ్వరికీ ఇవ్వకూడదని అనుకున్నాం. ట్రైలర్ రిలీజ్ అయ్యాక చాలా మంది ఫోన్స్ చేశారు. కన్నడ నుంచి హోంబలే టీం సంప్రదించింది. గీతా ఆర్ట్స్, అన్నపూర్ణ స్టూడియో టీం నుంచి కొంత మంది వచ్చి సినిమాని చూశారు. ముందు ఇక్కడ సినిమాని రిలీజ్ చేసిన తర్వాత మిగతా భాషల్లో విడుదల చేయాలని అనుకుంటున్నాను.

**మీ హీరోలతో మీకున్న రిలేషన్ గురించి చెప్పండి?..** నేను నా ఆర్టిస్టులందరితోనూ మంచి రిలేషన్ మెయింటైన్ చేస్తాను. అగధ టీజర్, ట్రైలర్ చూసి మహేష్ బాబు నాకు వాయిస్ మెసెజ్ చేశారు

## 'విశ్వనాథ్ సన్స్' ప్రీ రిలీజ్ వేడుక




తమిళ అగ్ర కథానాయకుడు సూర్య నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ సన్స్'. ప్రతిభ గల దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. . ఈ చిత్రం భారీ అంచనాల నడుమ ఆగస్టు 14, 2026న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో అడుగు పెట్టనుంది. ఈ వేడుకలో కథానాయకుడు సూర్య మాట్లాడుతూ.. "ఈ వేడుకకు విచ్చేసిన ఎమ్మెల్యే నవీన్‌కి, మా సినీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ధన్యవాదాలు. అలాగే, రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న నా అభిమానులు, వారి కుటుంబ సభ్యులకు నా నమస్కారం. 28 ఏళ్ళ నుంచి మీరు నాపై ఈ ప్రేమను చూపిస్తున్నారు. మీ వల్లే నేను ఈరోజు ఇలా ఉన్నాను. నాగవంశీ, వెంకీ వల్లే ఇలాంటి మంచి సినిమా సాధ్యమైంది. ఈ సినిమాను మీరు థియేటర్లలో చూసి ఖచ్చితంగా ప్రేమిస్తారని నమ్ముతున్నాను. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "ముందుగా తక్కువ సమయంలో ఈ వేడుక జరగడానికి అనుమతి ఇచ్చిన తెలంగాణ పోలీస్ శాఖకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు. సినీ పరిశ్రమకు అండగా ఉంటుందన్నందుకు, గద్దర్ అవార్డులు ఇచ్చి మమ్మల్ని ప్రోత్సహిస్తున్నం దుకు.. సినీ పరిశ్రమ తరపున తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు. . థియేటర్లో చూసే ప్రేక్షకులకు కూడా ఆ సంతృప్తిని కలిగిస్తుంది. ఇది సూర్య అభిమానుల కోసం మాత్రమే తీసిన సినిమా కాదు, సూర్య అభిమానుల కుటుంబాల కోసం కూడా తీసిన సినిమా. ఈ సినిమా చూస్తున్నంత సేపూ మీ ముఖం మీద చిరునవ్వు ఉంటుంది.

## 'కొరియన్ కనకరాజు' సెలబ్రేషన్స్‌లో చిరంజీవి



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ కొరియన్ కనకరాజు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యూవీ క్రియే షన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించాయి. ఆగస్టు 6న జరిగిన ఈ సినిమా ప్రీమియర్స్‌కి అద్భుత మైన రెస్పాన్స్ వచ్చింది. ఆగస్టు 7న వరల్డ్ వైడ్ థియేటర్ల లో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో రన్ అవుతోంది. మెగా బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్ లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ: ఒక సినిమా విజయం సాధిస్తే ఎంతోమందిలో ఆనందాన్ని నింపుతుంది. ఎన్నో ఏళ్లుగా నేను ఈ విషయాన్ని చూస్తున్నాను. అది మరోసారి ఇక్కడ పునరావృతం అయింది. ఈ సంతోషంలో పాలుపంచుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. సినిమా చూసిన తర్వాత ఫంక్షన్ ఎప్పుడు పెడతారు, దాని గురించి నాలుగు మాటలు మాట్లాడాలని ఉంది అని అనుకున్నాను. వరుణ్ ఈ వేడుకకు రమ్మని అన్నప్పుడు కచ్చితంగా వస్తానని చెప్పాను. ఇలాంటి విజయాలను సెలబ్రేట్ చేసుకోవాలి. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మాట్లాడుతూ: కొరియన్ కనకరాజు మీ అందరికీ నచ్చి మంచి విజయాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. పెదనాన్న చిన్నప్పటి నుంచి మమ్మల్ని మంచి విలువలు, కష్టపడే తత్వం, క్రమశిక్షణతో పెంచారు. కొరియన్ కనకరాజు విజయం చాలా ఆనందాన్ని ఇచ్చింది, నాగబాబు మాట్లాడుతూ: మేమందరం ఈ స్థితిలో ఉన్నామంటే దానికి కారణం మా అన్నయ్య చిరంజీవి . మా అందరికీ ప్రాణవాయువు మా అన్నయ్య. కొరియన్ కనకరాజు సినిమా విజయం సాధించడం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు మేర్లపాక గాంధీ చాలా మంచి విజన్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. నటీనటులు అందరూ చాలా చక్కగా నటించారు. వరుణ్ విషయంలో నేను చాలా గర్వపడుతున్నాను.

## 'సెయాన్' రెండవ షెడ్యూల్ ప్రారంభం



వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్' ప్రాజెక్ట్ కోసం దర్శకుడు శివకుమార్ మురుగేశన్‌తో చేతులు కలిపారు. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్న అమరన్ తర్వాత రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో శివకార్తికేయన్ చేస్తున్న చిత్రమిది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ రోజు రెండవ షెడ్యూల్ ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియో లో శివకార్తికేయన్ లుక్ అందరినీ ఆకట్టుకుం టుంది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని భారీ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఎమోషన్స్, మాస్ అప్పీల్, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఎంటర్టైనర్ గా సినిమా రూపొందనుంది. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. వివేక్ విజయకుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, షాన్ లోకేష్ ఎడిటింగ్ చేస్తున్నారు. యాక్షన్ డైరెక్టర్‌గా సుప్రీమ్ సుందర్ పని చేస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అరుణ్ వెంకటరామూడి రూపొందిస్తున్నారు.

## 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' విన్‌లో రిలీజ్



'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' విన్‌లో రిలీజ్ డేట్ పోస్టర్ సెప్టెంబర్ 18 నుంచి ఈవిన్ లో స్ట్రీమింగ్‌హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు. సెప్టెంబర్ 18 నుంచి నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్థ్ స్ట్రీమింగ్ కానుంది. ఈ డేట్ లాంచింగ్ పోస్టర్ ఈటివి వీన్‌లో స్టార్ బాయ్ సిద్దుజొన్నల గడ్డ లాంచ్ చేశారు. ఈ చిత్రంలో హైపర్ ఆది, జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, శ్రావ్య చౌదరి, శ్రీ విద్యా, మహేందర్, ప్రేమ్ సాగర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## 'రంభ ఊర్వశి మేనక' నాన్‌స్టాప్‌గా నవ్విస్తుంది



కామెడీ సినిమాలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేష్ మరోసారి తనకు బాగా కలిసొచ్చిన జానర్‌లో సందడి చేయ బోతున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ రంభ ఊర్వశి మేనక. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. టీజర్ లాంచ్ ఈవెంట్లో హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ: నేను సరైన కామెడీ సినిమా చేసి దాదాపు 10 సంవత్సరాలు అవుతోంది. నాంది తర్వాత కొన్ని సీరియస్ సినిమాలు చేశాను. కాకపోతే నేను కామెడీని ఎప్పుడూ వదల్లేదు. ఒక మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నాను. చాలా రోజుల తర్వాత చంద్ర మోహన్ గారు వచ్చి ఈ కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ సంస్థలతో కలిసి ఈ సినిమా చేయడం మరింత ఆనందాన్ని ఇచ్చింది. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. నిర్మాతగా నా జర్నీ ప్రసాద్ గారితో కలిసి మొదలైంది. నేను ప్రతి సినిమా కథ విన్న తర్వాత ప్రసాద్ గారిని సంప్రదిస్తాను. అన్నపూర్ణ స్టూడియోస్ 50 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ బ్యానర్‌తో కలిసి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. హీరోయిన్ సురభి మాట్లాడుతూ: ఈ టీజర్ మీకు నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. అల్లరి నరేష్ గారు నా ఫేవరెట్. రాశి సింగ్ మాట్లాడుతూ: నాకు ఇలాంటి మంచి పాత్ర ఇచ్చిన మా డైరెక్టర్ గారికి థాంక్యూ. అల్లరి నరేష్‌కి అద్భుతమైన కామెడీ టైమింగ్ ఉంది.



# సింక్వ్యూఫీల్డ్ కప్‌లో.. సిందరోవ్‌పై ప్రజ్ఞా విజయం

**న్యూఢిల్లీ:** సింక్వ్యూఫీల్డ్ కప్‌లో జవోఖిర్ సిందరోవ్‌పై ప్రజ్ఞానంద గెలుపు సాధించాడు. గ్రాండ్ చెస్ టూర్‌లోని చివరి ఈవెంట్ అయిన సింక్ఫీల్డ్ కప్ రెండవ రౌండ్ మ్యాచ్‌లో బుధవారం భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద జవోఖిర్ సిందరోవ్ రక్షణను ఛేదించి తన మొదటి విజయాన్ని నమోదు చేసుకున్నాడు. క్వీన్ పాన్ ఓపెనింగ్ నుండి మొదలైన ఎండ్‌గేమ్‌లో, ప్రజ్ఞా అంగుళం అంగుళం చొప్పున తన పాయింట్‌ను కైవసం చేసుకుని, ఆట మొత్తానికి హీరోగా నిలిచాడు. సంపూర్ణ డ్రాగా ముగిసిపోవాల్సిన ఒక సమానమైన ఎండ్‌గేమ్‌ను సిందరోవ్ ఎంచుకున్నాడు.

కానీ ప్రజ్ఞానంద పట్టుదల. కంప్యూటర్ డ్రాగా భావిస్తున్న ఆట క్షణాల్లోనే విజయ దశకు చేరుకున్నాడు. ఈ ఆట ఏకంగా 95 ఎత్తుల పాటు సాగింది. ప్రజ్ఞానంద తన రెండు ఆటలలో 1.5 పాయింట్లు సాధించగా, రాత్రికి అగ్రస్థానంలో ఉన్న అమెరికాకు చెందిన ఫాబియానో కరువానా మాత్రమే హాలండ్‌కు చెందిన అనీష్ గిరితో డ్రాతో ప్రశాంతంగా ముగించాడు. ఆ డచ్ ఆటగాడు ఆరంభంలో చేసే లోతైన సన్నాహాలకు ప్రసిద్ధి చెందాడు మరియు అతను తన అభిమానులను నిరాశపరచలేదు, కానీ కరువానా తన నల్ల పావుతో బాగా సన్నద్ధమయ్యాడు. మొదటి రౌండ్‌లో కేవలం ఒకే నిర్ణయాత్మక ఫలితం వెలువడగా, రెండవ రౌండ్‌లో నాలుగు నిర్ణయాత్మక ఫలితాలతో సమీకరణం మారింది. ఈ రౌండ్లలో అమెరికాకు చెందిన లెవాన్ అరోనియన్ తన ప్రతిభను ప్రదర్శించి జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను ఓడించగా, అమెరికాకు చెందిన వెస్లీ సో హాలండ్‌కు చెందిన జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌పై తన ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాడు.



## శ్రీలంక సిరీస్‌కు..
# టీమిండియా కఠిన శిక్షణ

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత్ గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నద్ధం అవుతోంది. ఈనెల 4న కొలంబోలో అడుగుపెట్టడం మొదలు అక్కడి నాన్‌డెస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) మైదానంలో వరుసగా ఎలాంటి విరామం లేకుండా చెమటలు చిందిస్తోంది. ఇందులో మూడు రోజుల పాటు సాగిన పూర్తి స్థాయి వామప్ మ్యాచ్‌తో పాటు, మిగిలిన రోజుల్లో రోజుకు ఐదు నుంచి ఆరు గంటల పాటు సాగిన కఠిన నెట్ సెషన్లు ఉన్నాయి. ప్రధానంగా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే శ్రీలంకతో జరిగే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం తప్పనిసరి అయింది. అంతేకాకుండా శ్రీలంకపై 18 ఏండ్ల నుంచి ఒక్క టెస్టు సిరీస్ కోల్పోని రికార్డు భారత్‌కు ఉంది. ఈ నేపథ్యంలో లంక సిరీస్‌ను టీమిండియా యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సి వచ్చింది. ఈనెల 15న మొదలయ్యే సిరీస్ కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ఏ చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా పక్కా ప్రణాళికతో ఆటగాళ్లను సిద్ధం చేస్తోంది. ప్రస్తుత జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే లంకలో టెస్టు మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. మిగిలిన ఆటగాళ్లందరికీ ఇక్కడి పరిస్థితులు కొత్త. అందుకే లంకలో అడుగుపెట్టిన 24 గంటల్లోనే మైదానంలోకి దిగిన జట్టు ఇక్కడి విపరీతమైన వేడి, తీవ్రమైన తేమతో కూడిన వాతావరణానికి ఆటగాళ్లు అలవాటుపడేలా హెడ్ కోచ్ గంభీర్ ప్రాక్టీస్ సెషన్స్‌ను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తిరిగి 2 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విడతలుగా విభజించాడు. లంక ఎలెవన్‌తో జరిగిన వామప్ మ్యాచ్ సమయంలోనూ ఫీల్డింగ్ చేస్తున్న ఆటగాళ్లను మారుస్తూ, ఒకవైపు మ్యాచ్ ఆడుతూనే మరోవైపు సమాంతరంగా నెట్స్ ప్రాక్టీస్ చేయిస్తున్నాడు.

## కామన్వెల్త్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# భారతకు 3 స్వర్ణాలు,
## ఒక రజతం, ఒక కాంస్యం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో భారత ఫెన్సింగ్ జట్టు వివిధ సీనియర్ వ్యక్తిగత ఈవెంట్లలో ఒక్క రోజునే 3 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. నైజీరియాలోని లాగోస్‌లో జరుగుతున్న ఈ ఈవెంట్లలో సీనియర్ మహిళల ఫోయిల్, సీనియర్ పురుషుల ఈపీ, మరియు సీనియర్ పురుషుల సాబ్రే విభాగాలలో టీమ్ ఇండియా ఆధిపత్యం చెలాయించింది. సీనియర్ మహిళల ఫాయిల్ విభాగంలో భారత్ ఆధిపత్యాన్ని నెలకొల్పి, స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకుంది. కచ్చితమైన, నియంత్రిత ప్రదర్శనతో కనగలక్ష్మి స్వర్ణ పతకాన్ని కైవసం



చేసుకోగా, ఆమె సహచరి జాయిస్ అషిత రజత పతకాన్ని గెలుచుకుంది. తద్వారా కాంస్య పతకం గెలుచుకున్న ఇంగ్లాండ్‌కు చెందిన జార్జియా గ్రీన్, ఎమిలీ గుడ్‌చైల్డ్‌ల కంటే ముందుగా వీరు పోడియంపై మొదటి రెండు స్థానాలను దక్కించుకున్నారు. సీనియర్ పురుషుల ఈపీ విభాగంలో కూడా విజయం కొనసాగింది, ఇక్కడ రాజేంద్రన్ శాంతిమోల్ షెర్జిన్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి భారతదేశానికి ఆ రోజు రెండవ స్వర్ణ పతకాన్ని సాధించిపెట్టాడు. సీనియర్ పురుషుల సాబ్రే ఈవెంట్‌లో, రజత పతకం సాధించిన ఆస్ట్రేలియాకు చెందిన షిమ్ యోంగితో జరిగిన ఫైనల్ పోరులో అద్భుతమైన ప్రదర్శనతో సింగ్ కరణ్ సింగ్ భారతదేశానికి మూడవ స్వర్ణ పతకాన్ని అందించాడు. జట్టు సభ్యురాలు కుమారేసన్ పద్మ గిషో నిధి, నైజీరియాకు చెందిన అకిన్యోసోయే ఒలువాఫోలాయెమితో కలిసి కాంస్యం గెలిచి పతకాల సంఖ్యను పెంచింది.



# బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్
## అఫ్గాన్‌తో భారత్ టి20 సిరీస్ ఖరారు
## సెప్టెంబరు 13న తొలి మ్యాచ్

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ)కి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) బిగ్ షాకిచ్చింది. సెప్టెంబర్‌లో తమతో సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా వస్తుందని ఆశించిన బీసీబీకి నిరాశే ఎదురైంది. అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఖరారు చేసి బంగ్లా పర్యటనకు వెళ్లడం లేదని భారత్ క్రికెట్ బోర్డు పరోక్షంగా వెల్లడించింది. సెప్టెంబర్‌లో అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మూడు టీ20ల సిరీస్ షెడ్యూల్‌ను బుధవారం బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. అఫ్గాన్ క్రికెట్ బోర్డు వెల్లడించినట్లుగానే ఢిల్లీ వేదికగా మూడు టీ20ల సిరీస్ జరగనుంది. భారత్‌లోనే అఫ్గాన్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఢిల్లీ మైదానాన్ని అఫ్గాన్ హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకుంది. గత జూన్‌లో భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్టు, మూడు వన్డేల సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే. భారత్, అఫ్గానిస్థాన్ మధ్య సెప్టెంబర్ 13న తొలి టీ20, 15 రెండో టీ20, 19న మూడో టీ20 జరగనుంది. ఈ సిరీస్ భారత్, ఆఫ్ఘనిస్తాన్‌ల మధ్య జరగనున్న రెండవ ద్వైపాక్షిక టీ20ఐ మాత్రమే. ఈ రెండు జట్లు చివరిసారిగా జనవరి 2024లో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడ్డాయి. అప్పుడు భారత్, మొహాలీ, ఇండోర్, బెంగళూరులలో ఆఫ్ఘనిస్తాన్‌కు ఆతిథ్యం ఇచ్చింది. ఆ సిరీస్‌ను భారత్ గెలుచుకుంది. ఇక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో కష్టకాలం ఎదుర్కొంటున్న భారత టీ20 జట్టుకు, రాబోయే ఈ పోటీ ఒక కీలక దశలో వస్తోంది. ఇటీవలి పరంపరను ఐర్లాండ్‌తో 2-0 సిరీస్ ఓటమితో ప్రారంభించిన భారత్, ఆ తర్వాతి సిరీస్‌లో ఇంగ్లండ్ చేతిలో 4-0 తేడాతో ఓటమి చవిచూసింది. కాగా భారత క్రికెట్ బోర్డు ఎప్పుడూ అఫ్గానిస్థాన్‌కు అండగా ఉంటుందని బీసీసీఐ ప్రెసిడెంట్ మిథున్ మన్హాస్ తెలిపారు. అఫ్గాన్ క్రికెట్ అభివృద్ధి కోసం మద్దతు ఇస్తామని, అత్యున్నత స్థాయిలో పోటీ పడేలా వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పాడు. ఈ క్రమంలోనే ఆ జట్టుతో ద్వైపాక్షిక సిరీస్‌ను ఏర్పాటు చేశామని, టాప్ టీమ్స్‌తో ఆడటం వల్ల వెలకట్టలేని అనుభవం వస్తుందని అభిప్రాయపడ్డాడు. భారత్ వేదికగా అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యం ఇస్తున్న సిరీస్‌కు బీసీసీఐ అండగా ఉంటుందని సెక్రటరీ దేవజిత్ సైకియా అన్నారు. మైదానంలో ఇరు జట్ల మధ్య పోరు చాలా ఆసక్తికరమని, నాణ్యమైన క్రికెటర్లు ఉన్నారని పేర్కొన్నారు. భారత్‌లోనూ అఫ్గాన్ ఆటగాళ్లకు అభిమానులు ఉన్నారంటే వారి ఆటతీరే కారణమని, ఇటీవల ఒక టెస్ట్, వన్డే సిరీస్ జరిగిందని, మూడు ఫార్మాట్లలోనూ ఇరు జట్లు తలపడేందుకు ఉన్న అవకాశాలను ఏ మాత్రం వదులుకోమని స్పష్టం చేశారు.



Creative Visualisation. Images used are for illustration purposes only. | Applicable T&C available at the dealership. | **As certified by Kantar IMRB for an OEM platform for end-to-end usage as on November 28, 2025. | #543 km range: Certified range; actual results may vary by driving conditions and usage. | Assured buyback plan is available on payment basis with the option of 3 years/45 000 km or 4 years/60 000 km ownership plans (whichever is earlier). The program is offered through an insurance company. e VITARA comes with standard warranty of 3 years/1 00 000 km (whichever is earlier) with an option of extending the same on payment basis to 5 years/1 40 000 km and service activated coverage for 6th to 8th year for EV related components.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.